



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



# సీబీఎన్.. మెగా విజన్!

- నదుల అనుసంధానం నుంచి బుల్లెట్ రైల్ వరకు..
- ఒకే వ్యవస్థగా నీరు, రవాణా, విద్యుత్, లాజిస్టిక్స్, నైపుణ్యాలు
- 2047నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా దక్షిణాది
- దక్షిణ భారతాన్ని ఒకే అభివృద్ధి ఇంజిన్‌గా మార్చే ప్రతిపాదన



2

***2047 దక్షిణాదికి ఏపీ సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ ప్రతిపాదించారు. విజనరీ ప్రతిపాదించిన 'సక్సెస్ సూత్ర'లో ప్రాధాన్యతాంశం.. – నదులు కలవాలి. నగరాలు నిలవాలి. ఆర్థిక వ్యవస్థలు బలపడాలి. "వన్ విజన్.. వన్ సౌత్" ప్రతిపాదిత ప్రణాళికలో.. 10 ట్రిలియన్ డాలర్ల సత్తాను ప్రతిపాదించడం –దక్షిణాదిపై చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం. ఒక నది మరో నదితో కలవడం.. ఒక నగరం మరో నగరంతో (హైస్పీడ్ రైలు) అనుసంధానమవడం.. ఒక రాష్ట్రంలోని విద్యుత్ మరో రాష్ట్ర పారిశ్రామిక అవసరాలు తీర్చడం.. ఒక రాష్ట్ర నైపుణ్య సంస్థ మరో రాష్ట్రంలోని పరిశ్రమలకు మానవ వనరులను అందించడం.. –ఇవన్నీ విడివిడిగా చేసేవి కావు. ఒకే దారంతో కలిపితే 'మెగా విజన్' అనిపించక మానదు. ఇదే –దక్షిణ భారతాన్ని ఒక సమగ్ర ఆర్థిక, మౌలిక వసతుల, జలవనరుల ప్రాంతంగా తీర్చిదిద్దాలనుకుంటున్న విజనరీ వ్యూహం!***

## నేడు ఉత్తరాంధ్రకు సీఎం

- చోడవరంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పాల్గొననున్న చంద్రబాబు
- విశాఖలో బ్రిక్స్ యువజన, క్రీడా మంత్రుల సమావేశాలకు హాజరు

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో మమేకం కానున్నారు. ఉదయం అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం అలమండ గ్రామానికి చేరుకుని స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11.05 గంటలకు ఏ.కొడూరు జెడ్పీ హైస్కూలు సమీపంలోని ప్రజా వేదికకు సీఎం చేరుకుంటారు. మధ్యాహ్నం 1.15 గంట వరకు జరిగే ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2.20 గంటలకు పార్టీ కేడర్ సమావేశానికి ముఖ్యమంత్రి హాజరవుతారు. అనకాపల్లి పర్యటన ముగించుకుని విజయనగరం జిల్లా ఎస్.కోటకు సీఎం చేరుకుంటారు. సాయంత్రం 4.20 గంటలకు ఎమ్మెల్యే కె. లలితకుమారి నివాసానికి వెళ్లనున్నారు. అనంతరం విశాఖలో జరుగుతోన్న బ్రిక్స్ సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం 5.05 గంటలకు నోవాటెల్‌లో జరిగే రెండో బ్రిక్స్ యువజన, క్రీడల మంత్రుల సమావేశాలు–2026లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. విశాఖ పర్యటన ముగించుకుని రాత్రికి అమరావతి చేరుకోనున్నారు.

## ఏఎస్ఆర్ ఎయిర్‌పోర్టులో లోకేష్

### ఘనంగా స్వాగతించిన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

విశాఖపట్నం (చైతన్య రథం): అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ చేరుకున్నారు. విమానాశ్రయంలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత తొలిసారి సాధారణ ప్రయాణికులతో కలిసి కమర్షియల్ ఫ్లైట్‌లో విశాఖకు ప్రయాణించారు. భోగాపురం విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ కలిశెట్టి అప్పల్నాయుడు, ఎమ్మెల్యేలు లోకం నాగమాధవి, విష్ణు కుమార్‌రాజు, ఈశ్వర్‌రావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, విజయనగరం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, విశాఖపట్నం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావులు ఘన స్వాగతం పలికారు. నేడు భీమిలి, విజయనగరం నియోజకవర్గాల్లో మంత్రి నారా లోకేష్ పర్యటించనున్నారు. శనివారం ఉదయం మధురవాడలోని చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో దివీస్ ల్యాబ్స్ సహకారంతో అభివృద్ధి చేసిన పలు ఆధునీకరణ, మౌలిక వసతుల పనులను ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం విజయనగరం మండలం దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ మీటింగ్‌కు హాజరవుతారు. సాయంత్రం విజయనగరం మండలం చెల్లూరు గ్రామంలో ఏర్పాటుచేసిన వేదిక వద్ద విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో పాల్గొంటారు.








# ఫ్యూచర్ టెక్ హబ్.. ఏపీ!

- రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కొత్త అధ్యాయం
- స్పష్టమైన వ్యూహం.. వేగవంతమైన అమలు ఫలితం
- 20వ ఎస్ఐపీబీలో 25 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
- 21,627 ఉద్యోగ అవకాశాలకు భరోసా
- గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, ఏరోస్పేస్‌పైనే దృష్టి
- వ్యూహాత్మక ప్రణాళికలతో సీఎం చంద్రబాబు నాయుడు..

4



చైతన్యరథం



# సీబీఎన్.. మెగా విజన్!

***2047 దక్షిణాదికి ఏపీ సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ ప్రతిపాదించారు. విజనరీ ప్రతిపాదించిన 'సక్సెస్ సూత'లో ప్రాధాన్యతాంశం.. - నదులు కలవాలి. నగరాలు నిలవాలి. ఆర్థిక వ్యవస్థలు బలపడాలి. "వన్ విజన్.. వన్ సౌత్" ప్రతిపాదిత ప్రణాళికలో.. 10 ట్రిలియన్ డాలర్ల సత్తాను ప్రతిపాదించడం -దక్షిణాదిపై చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం. ఒక నది మరో నదితో కలవడం.. ఒక నగరం మరో నగరంతో (హైస్పీడ్ రైలు) అనుసంధానమవడం.. ఒక రాష్ట్రంలోని విద్యుత్ మరో రాష్ట్ర పారిశ్రామిక అవసరాలు తీర్చడం.. ఒక రాష్ట్ర నైపుణ్య సంస్థ మరో రాష్ట్రంలోని పరిశ్రమలకు మానవ వనరులను అందించడం.. -ఇవన్నీ విడివిడిగా చేసేవి కావు. ఒకే దారంతో కలిపితే 'మెగా విజన్' అనిపించక మానదు. ఇదే -దక్షిణ భారతాన్ని ఒక సమగ్ర ఆర్థిక, మౌలిక వసతుల, జలవనరుల ప్రాంతంగా తీర్చిదిద్దాలనుకుంటున్న విజనరీ వ్యూహం!***

**దక్షిణ భారతాన్ని ఒకే అభివృద్ధి ఇంజిన్‌గా మార్చే ప్రతిపాదన**

**నదుల అనుసంధానం నుంచి బుల్లెట్ రైల్ వరకు..**

**ఒకే వ్యవస్థగా నీరు, రవాణా, విద్యుత్, లాజిస్టిక్స్, నైపుణ్యాలు**

**2047నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా దక్షిణాది**

మహాబలిపురంలో రెండురోజుల క్రితం జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో ఏపీ సీఎం సీబీఎన్ చేసిన ప్రతిపాదనలను ఈ కోణంలోనే చూడాలి. గోదావరి-కావేరి అనుసంధానం నుంచి గంగా-కావేరి జాతీయ ప్రాజెక్టు వరకు, అమరావతి-బెంగళూరు-చెన్నై బుల్లెట్ రైల్ కారిడార్ నుంచి ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్ వరకూ.. సీబీఎన్ ప్రతిపాదనలు కేవలం ఏపీ ప్రయోజనాలకే పరిమితమైనవి కావు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పరం పోటీపడే ప్రాంతాలుగా కాకుండా, ఒకే ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా ఎదగాలన్న దూరదృష్టికి తొలి అడుగు!

### నీటి కొరతకు 'బేసిన్' స్థాయి పరిష్కారం

చంద్రబాబు ప్రతిపాదనల్లో అత్యంత దీర్ఘకాలిక ప్రభావం చూపగల అంశం -నదుల అనుసంధానం. దక్షిణ భారతదేశంలో నీటి వనరుల పంపిణీ అసమానంగా ఉందన్నది కాదనలేని వాస్తవం. అధికారిక జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యుడీఏ) అధ్యయనాల ప్రకారం గోదావరి, మహానది వంటి నదీ పరీవాహక ప్రాంతాల్లో మిగులు జలాల అవకాశాలు ఉండగా, కృష్ణా, పెన్నా, కావేరి, వైగైవంటి బేసిన్లు నీటిలోటును ఎదుర్కొంటున్నాయి. ఈ అసమానతను తగ్గించడమే పెనిన్సులర్ రివర్ లింకింగ్ ప్రణాళికకు ప్రాథమిక ఆలోచన. అంటే -'ఎక్కడ నీరు ఉంది?' అన్నది కాదు, 'అవసరమున్న ప్రాంతానికి అదనపు నీటిని ఎలా చేర్చాలి?' అనేదే భవిష్యత్తు ప్రశ్న. ఇదే నేపథ్యంలో గోదావరి నుంచి కృష్ణా, పెన్నామీదుగా కావేరి బేసిన్‌కు 500 టీఎంసీకి పైగా మిగులు వరద జలాలు తరలించే ప్రతిపాదనను సీబీఎన్ కేంద్రం ముందుంచారు. ఆలోచనపరంగా దీని ప్రాధాన్యాన్ని తక్కువ చేయలేం. వృధా అవుతున్న వరద జలాలను నిల్వ చేసి, నీటి కొరత ప్రాంతాలకు మళ్లించడం సాధ్యమైతే.. దక్షిణాది సాగు, తాగు, పారిశ్రామిక జలాల అవసరాలకు దీర్ఘకాలిక భద్రతకు అవకాశం ఉంటుంది. వాస్తవానికి -ఇది కొత్త ఆలోచన కాకున్నా.. భవిష్యత్ జలాల అవసరాలకు ఇదే సరైన సమయమన్న అంశాన్ని విస్మరించలేం.

ఎందుకంటే -నదీ అనుసంధానికి అసలు సవాలు ఇంజినీరింగ్ కాదు, అంతర్రాష్ట్ర సమ్మతి. ఒక రాష్ట్రంనుంచి నీరు మరో రాష్ట్రానికి వెళ్లాలంటే నీటి హక్కులు, ట్రిబ్యునల్ తీర్పులు, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పునరావాసం, ఆర్థిక భారంవంటి అనేక అంశాలను పరిష్కరించాలి. అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలకు ప్రత్యేక చట్టపరమైన వ్యవస్థ కూడా ఉంది. అందుకే చంద్రబాబు ప్రతిపాదనలో మరో కీలకాంశం -దక్షిణాది నదీ బేసిన్ల మధ్య ప్రత్యేక సమన్వయ వ్యవస్థ. అంటే ఒక్కో ప్రాజెక్టును ఒక్కో రాష్ట్ర సమస్యగా చూడకుండా, మొత్తం దక్షిణాదిని ఒక జలవనరుల వ్యవస్థగా చూడాలన్న సీబీఎన్ ప్రతిపాదన.. సమస్య పరిష్కార సమయస్ఫూర్తికి అద్దంపడుతుంది.

### 'వాటా' నుంచి 'వాటర్ కోఆపరేషన్' వైపు..

దక్షిణాదిలో నదీ జలాలు చాలాకాలంగా రాజకీయ, న్యాయ వివాదాలకు కారణమవుతున్నాయి. కావేరి, కృష్ణా వంటి నదులపై రాష్ట్రాల మధ్య విభేదాలే ఉదాహరణ. తాజా దక్షిణాది మండలి సమావేశంలోనూ నీటి అంశం కీలకమైంది. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రతిపాదనతో.. 'నా రాష్ట్రానికి ఎంత?' అనే ప్రశ్ననుంచి 'మొత్తం బేసిన్‌కు భద్రత ఎలా?' అనే ఆలోచనకు బాట పడుతుంది. నిజానికి -వేగంగా చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇది మరింత అవసరం. వర్షపాతం తీవ్రత పెరగడం, తక్కువ కాలంలో భారీ వరదలు రావడం, మరోవైపు దీర్ఘకాలిక కరువులు ఏర్పడటంవంటి పరిస్థితుల్లో పాతకాలపు నీటి నిర్వహణ విధానాలు సరిపోవు. నీటి నిల్వ సామర్థ్యం, రీచార్జ్, పునర్వినియోగం, మైక్రో ఇరిగేషన్‌తోపాటు బేసిన్‌స్థాయి ప్రణాళిక అత్యావశ్యం. భారత్ ఇప్పటికే నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్న దేశం. నీతి ఆయోగ్ తాజా విశ్లేషణలోనూ దేశ జనాభా ప్రపంచంలో దాదాపు 18 శాతం ఉన్నప్పటికీ, ప్రపంచ తీపినీటి వనరుల్లో భారత్ వాటా సుమారు 4 శాతమేనని, తలసరి వార్షిక నీటి లభ్యత చాలాకాలంగా నీటి ఒత్తిడిస్థాయిలో ఉందని ప్రస్తావించింది. అందుకే నీటి భద్రతను వచ్చే తరాల మౌలిక వసతిగా చూడాల్సిన అవసరం ఉందని ప్రతిపాదిస్తున్నారు చంద్రబాబు.

### గంగా-కావేరి.. మరింత పెద్ద కల

చంద్రబాబు ప్రతిపాదనలో మరో ఆలోచన గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టడం. ఇది గోదావరి-కావేరి కంటే మరింత విస్తృతమైన, సంక్లిష్టమైన ఆలోచన. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా దక్షిణాది సమావేశంలో బ్రహ్మపుత్ర సహా ప్రధాన నదులను గోదావరి, కావేరితో అనుసంధానించే ఆలోచనపై దృష్టి పెట్టడం గమనార్హం. ఇలాంటి దీర్ఘకాలిక జల అనుసంధానాల ద్వారా దేశానికి నీటి భద్రతను పెంచవచ్చన్న దృక్పథం కేంద్రస్థాయిలోనూ వ్యక్తమవుతోంది. అయితే గంగా-కావేరి అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టులను 'శాశ్వత పరిష్కారం'గా ప్రకటించే ముందు సమగ్ర పర్యావరణ, హైడ్రాలజీ, సామాజిక, ఆర్థిక అధ్యయనాలు తప్పనిసరి. నదుల సహజ ప్రవాహాలు, డెల్టా పర్యావరణ వ్యవస్థలు, చేపల వనరులు, అడవులు, స్థానిక జీవన విధానాలపై ప్రభావాన్ని అంచనా వేయాల్సి ఉంటుంది.

### నీటిమార్గంతో పాటు రైలు మార్గం!

సీబీఎన్ ప్రతిపాదనల ప్రత్యేకత ఇక్కడే కనిపిస్తుంది. ఆయన నీటి అనుసంధానంతో ఆగిపోలేదు. అమరావతి-బెంగళూరు-చెన్నైలను అనుసంధానించే హైస్పీడ్ రైల్ కారిడార్‌ను ప్రతిపాదించారు. ఇది కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించే రైలు కాదు. మూడు ప్రధాన నగరాలను ఒకే ఆర్థిక కారిడార్‌గా మార్చే బృహత్తర అవకాశం.

అమరావతి- పరిపాలన, కొత్త నగర నిర్మాణం, భవిష్యత్ పెట్టుబడులకు కేంద్రం. బెంగళూరు - ఐటీ, స్టార్టప్‌లు, ఏరోస్పేస్, పరిశోధనలకు ప్రపంచస్థాయి కేంద్రం. చెన్నై -ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, తయారీ, పోర్టు ఆధారిత వాణిజ్యానికి కీలక కేంద్రం. ఈ మూడు నగరాలు వేగవంతమైన రవాణాతో అనుసంధానమైతే వాటి మధ్య ఉన్న పట్టణాలు, పారిశ్రామిక ప్రాంతాలు కూడా ఆర్థిక కార్యకలాపాల్లో భాగమయ్యే అవకాశముంది. ఇది పూర్తిగా ఊహాజనిత రైల్వే ఆలోచన కాదు. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ఏడు కొత్త హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించగా, వాటిలో హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు మార్గాలున్నాయి. ఈ మార్గాలకు డీపీఆర్, అలైన్‌మెంట్, సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల ప్రక్రియ కొనసాగుతోంది. అందువల్ల చంద్రబాబు ప్రతిపాదనను ఇప్పటికే ఆమోదమైన 'అమరావతి-బెంగళూరు-చెన్నై బుల్లెట్ రైల్'గా కాకుండా, ఉన్న హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఆలోచనలను ఒక సమగ్ర దక్షిణాది కారిడార్‌గా కలిపే విజన్‌గా చూడాలి.

### రోడ్లు కాదు.. 'కామన్ లాజిస్టిక్స్ గ్రిడ్'

దక్షిణాది పారిశ్రామిక బలానికి మరో బలం పోర్టులు. చెన్నై, ఎన్నోర్, కృష్ణపట్నం, కాకినాడ, విశాఖపట్నం, కొచ్చి, మంగళూరు వంటి పోర్టులు తూర్పు, పడమర తీరాలను కలుపుతున్నాయి. కానీ పోర్టు ఉంటే సరిపోదు. పోర్టుకు పరిశ్రమ, పరిశ్రమకు రైలు, రైలుకు డ్రైపోర్టు, డ్రైపోర్టుకు జాతీయ రహదారి, చివరికి అంతర్జాతీయ మార్కెట్‌తో వేగవంతమైన కనెక్టివిటీ అవసరం. అందుకే ఉమ్మడి దక్షిణాది లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టుల ఏర్పాటు అన్న చంద్రబాబు ప్రతిపాదనలో వ్యూహాత్మక ప్రాధాన్యత కనిపిస్తోంది. రాష్ట్రాల సరిహద్దుల్లో విధానాల భిన్నత్వం, రవాణా ఆలస్యాలు, సరుకు తరలింపు ఖర్చులు తగ్గితే దక్షిణాది తయారీ రంగం మరింత పోటీతత్వాన్ని సాధిస్తుందనడంలో సందేహాలు అక్కర్లేదు. ఇదే తమిళనాడు ముఖ్యమంత్రి సి జోసెఫ్ విజయ్ ప్రతిపాదించిన సమగ్ర ఆర్థిక, లాజిస్టిక్స్ క్లస్టర్ల ఆలోచనతోనూ కలుస్తుంది. దక్షిణాది రాష్ట్రాలు ఉమ్మడి తయారీ, లాజిస్టిక్స్, ఎగుమతి విలువ గొలుసులను నిర్మించుకోవాలన్న ఆలోచన సమావేశంలో బలంగా, లోతుగా వినిపించింది.

### విద్యుత్, నైపుణ్యాలు.. సరిహద్దులులేని ఆర్థిక వ్యవస్థ

విద్యుత్ విషయంలోనూ ఇదే విధానం అవసరం. ఒక ప్రాంతంలో సౌర విద్యుత్ అధికంగా ఉత్పత్తి అవుతున్నప్పుడు, మరో ప్రాంతంలో

- (మిగతా వివరాలు 3లో)

## 'సౌభాగ్య' లక్ష్మిలకు శుభాకాంక్షలు

అమరావతి (చైతన్య రథం): వరలక్ష్మీ వ్రతం సందర్భంగా రాష్ట్ర మహిళలు, కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. సిరిసంపదలు, సౌభాగ్యం, సకల శుభాలకు అధిదేవత వరలక్ష్మీ దేవి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నా. పాడిపంటలతో, సుఖసంతోషాలతో రాష్ట్రం సుభిక్షంగా, సమృద్ధిగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను. కుటుంబ సౌభాగ్యం కోసం శ్రమించే మహిళామూర్తులందరికీ ఈ పవిత్ర పండుగ విశేషమైన శుభాలు, శాంతి ప్రసాదించాలని కోరుకుంటూ.. అందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

### సుఖసంతోషాలతో వర్ధిల్లాలి: లోకేష్

మహిళలకు సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్నిచ్చే వరలక్ష్మీ వ్రతం పండుగ సందర్భంగా.. వరలక్ష్మీ కృపతో అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని విద్యా మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు ఆకాంక్షించారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. మహిళలకు సౌభాగ్యాన్ని, ఐశ్వర్యాన్నిచ్చే పండుగ ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు తెలిపారు.

# జానకి మరణం దిగ్భ్రాంతికరం: సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి (94) ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. "400కు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరమైనా ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మనసుల్లో నిలిచిపోతారు. షావుకారు జానకి ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను" అని పేర్కొన్నారు.

### లోకేష్ సంతాపం

అమరావతి (చైతన్య రథం): ప్రముఖ సినీ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతిపట్ల విద్యా మంత్రి నారా లోకేష్ సంతాపం తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. 'తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించిన నటి జానకి. షావుకారు సినిమా పేరునే ఇంటిపేరుగా మార్చుకున్న విదుషీమణి. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. సినీ రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

# కడప ఎంపీపై ఈడీ అటాక్

## హైదరాబాద్, కడప నివాసాలలో విస్తృత సోదాలు

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి ఏపీ, తెలంగాణలో ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, కడప జిల్లా పులివెందులలో మొత్తం ఆరుచోట్ల శుక్రవారం ఉదయం నుంచి ఈడీ సోదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ కోకాపేటలో ఉన్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి నివాసంలో హైదరాబాద్ ఈడీ జోనల్ అధికారుల బృందాలు సోదాలు చేస్తున్నాయి. పులివెందులలోని అవినాష్‌రెడ్డి నివాసానికి ఈడీ అధికారులు వెళ్లగా.. తాళంవేసి ఉండటంతో బయటే కొద్దిసేపు వేచి ఉన్నారు. కాసేపటికి అవినాష్‌రెడ్డి చిన్నాన్న మనోహర్ రెడ్డిని పిలిపించిన అధికారులు.. తాళం తెరిపించి సోదాలు జరుపుతున్నారు. వివేకా హత్య కేసు నిందితులు




మనీలాండరింగ్‌పై ఈడీ ఆరా తీస్తోంది. హత్యకు ముందు నగదు లావాదేవీల వ్యవహారం బయటకు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. సీబీఐ దర్యాప్తు సునీల్‌యాదవ్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి ఇళ్లలోనూ సోదాలు చేపట్టారు. సీబీఐ కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. వివేకా హత్య కేసులో రాజకీయ నేతల ప్రమేయం, సమయంలో బయటకొచ్చిన అంశాలపై మరింత లోతుగా విచారణ చేస్తోంది. నిందితులకు ఇచ్చిన రూ.4 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎలా వచ్చాయన్న అంశంపైనే ఈడీ ప్రధానంగా దృష్టి సారించింది.

### రూ.24 లక్షల నగదు సీజ్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు ముగిశాయి. సీబీఐ కేసు ఆధారంగా హైదరాబాద్, కడప సహ ఏడుచోట్ల ఈడీ తనిఖీలు చేపట్టింది. ఈ కేసులోని కీలక నిందితుల నివాసాల్లో సోదాలు జరిగాయి. పలు పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసాల్లోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అవినాష్ నివాసంలో లెక్క చూపని రూ.24లక్షల నగదును సీజ్ చేశారు. ఆయనకు చెందిన రెండు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నారు.. సోదాల్లో లభించిన డిజిటల్, ఆర్థిక ఆధారాలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.



# సీబీఎన్.. మెగా విజన్!

(2వ పేజీ తరువాయి)

పరిశ్రమల డిమాండ్ ఉండొచ్చు. ఒక రాష్ట్రంలో విద్యుత్ లోటు, మరో రాష్ట్రంలో మిగులుండే పరిస్థితులు ఏర్పడవచ్చు. అందుకే దక్షిణాది గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో మరింత సమర్థంగా అనుసంధానించాలన్న ప్రతిపాదన భవిష్యత్ పారిశ్రామిక వృద్ధికి ఉపయుక్తం. అదే విధంగా విశ్వవిద్యాలయాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలతో కలిసి ఉమ్మడి నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న ఆలోచనా కీలకం. ఎందుకంటే రాబోయే దశాబ్దాల్లో పోటీ కేవలం రాష్ట్రాల మధ్య కాదు - ప్రపంచంలోని ప్రాంతాల మధ్య ఉంటుంది. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, రక్షణ ఉత్పత్తులు, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ, కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీవంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలంటే రాష్ట్రాలుగా కాకుండా ఒక పెద్ద ప్రతిభా మార్కెట్‌గా దక్షిణాది ఎదగాలన్నది విజనరీ చంద్రబాబు ఆలోచన.

### 2047 లక్ష్యం.. 'సౌత్' ఒక ఆర్థిక ఇంజిన్

దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా ఉన్నాయి. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ–పీఎం) అధ్యయనం ప్రకారం 2023–24లో దక్షిణాది రాష్ట్రాల మొత్తం వాటా భారత జీడీపీలో సుమారు 30.6 శాతం. చంద్రబాబు దీనినే మరింత ముందుకు తీసుకెళ్లి 2047నాటికి దక్షిణ భారతాన్ని 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే సామర్థ్యముందని పేర్కొన్నారు. అదే సమయంలో భారత్ మొత్తం 30–35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంలో దక్షిణాది కీలక పాత్ర పోషించగలదనీ అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్యం సాధించాలంటే ప్రతి రాష్ట్రం విడివిడిగా తన వృద్ధిని పెంచుకుంటే సరిపోదు. ఒక రాష్ట్ర బలం మరో రాష్ట్రానికి మార్కెట్‌గా, సరఫరా గొలుసుగా, మానవ వనరుగా, మౌలిక వసతుల భాగస్వామిగా మారాలన్నది చంద్రబాబు ఆలోచన. అదే 'సదరన్ ఎకనామిక్ కారిడార్'కు పునాది కావచ్చు.

### తీర్థయాత్రనుంచి టూరిజం ఎకానమీ వరకు

దక్షిణాది ఆధ్యాత్మిక సంపదను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో కలపాలన్న చంద్రబాబు ప్రతిపాదన కూడా ఆర్థిక కోణంలో ఆసక్తికరమే. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మదురై, రామేశ్వరం, మైసూరువంటి కేంద్రాలను వారణాసి, అయోధ్య, చార్‌ధామ్‌తో అనుసంధానించే ప్రత్యేక తీర్థయాత్ర సర్క్యూట్ ఏర్పడితే దేశీయ పర్యాటకానికి కొత్త మార్గాలు తెరుచుకున్నట్టే. ఇది కేవలం ఆలయాల మధ్య పర్యాటక అనుసంధానతే కాదు. హోటళ్లు, రవాణా, విమానయానం, హస్తకళలు, స్థానిక ఆహారం, చిన్న వ్యాపారాలు, గైడ్ సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు –అన్నింటినీ కలిపే పూర్తిస్థాయి టూరిజం ఎకానమీగా మార్చుకునే అవకాశం.

నిజానికి –అసలు పరీక్ష.. ప్రతిపాదనలు ప్రాజెక్టులుగా మారడం. అందుకే –ప్రతిపాదనలు ప్రతిపాదనలుగానే ఉండిపోకూడదంటే.. –డీపీఆర్‌లు, అనుమతులకు నిర్దిష్ట కాలపరిమితి పెట్టాలనడం మంచి పరిపాలనా సూచన. అయితే దానితో పాటు స్వతంత్ర శాస్త్రీయ మూల్యాంకనం, రాష్ట్రాల మధ్య పారదర్శక నీటి లెక్కలు, పర్యావరణ రక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యమూ అంతే అవసరం.

### దక్షిణాదికి కొత్త 'కో–ఆపరేటివ్ ఫెడరలిజం'?

ఏపీ సీఎం ప్రతిపాదనలను ఒక వాక్యంలో చెప్పాలంటే–'రాష్ట్రాల మధ్య పోటీని తగ్గించి, పరస్పర ఆధారిత వృద్ధిని పెంచడం'. అంటే నీటిలో సహకారం. రైలుతో అనుసంధానం. లాజిస్టిక్స్‌లో భాగస్వామ్యం. విద్యుత్‌లో సమన్వయం. నైపుణ్యాల్లో ఉమ్మడి వ్యవస్థ. పర్యాటకంలో సింగిల్ సర్క్యూట్. పెట్టుబడుల్లో పరస్పర పూరకత. ఇది జరిగితే దక్షిణాది ఒక భౌగోళిక ప్రాంతం నుంచి ఒక సమగ్ర ఆర్థిక ప్రాంతంగా పరిణమిస్తుందనడంలో సందేహాలు అక్కర్లేదు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల కలిపిన ఆర్థిక బలం దేశంలో అత్యంత పెద్ద వాటాల్లో ఒకటి. తయారీ, ఐటీ, సేవలు, పోర్టులు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మానవాభివృద్ధి –అనేక రంగాల్లో 'దక్షిణాది' దేశానికి ముందుంది. అందుకే 2047లో భారత్‌ను పెద్ద ఆర్థికశక్తిగా నిలబెట్టే ప్రయాణంలో దక్షిణాది కేవలం భాగస్వామి కాదు –ప్రధాన ఇంజిన్‌లలో ఒకటి అంటున్నారు చంద్రబాబు.

### ముందున్న దారి..

చంద్రబాబు ప్రతిపాదనల్లోని అసలు దూరదృష్టి ఒక్కో ప్రాజెక్టులో లేదు. వాటన్నింటినీ ఒకే భవిష్యత్ దక్షిణాది మ్యాప్‌లో చూడటంలో ఉంది. గోదావరి నీరు కావేరిని చేరితే అది కేవలం నీటి ప్రయాణం కాదు –ఒక రాష్ట్రపు వనరు మరో రాష్ట్రపు భద్రతకు ఆధారమయ్యే సహకారానికి సంకేతం. అమరావతి నుంచి బెంగళూరు, చెన్నైకి హైస్పీడ్ రైలు పరుగెత్తితే అది కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించడం కాదు –మూడు నగరాల ఆర్థిక వ్యవస్థలను ఒకదానితో ఒకటి ముడిపెట్టడం. ఉమ్మడి లాజిస్టిక్స్ గ్రిడ్ ఏర్పడితే అది కేవలం సరుకు రవాణా కాదు –దక్షిణాది ఉత్పత్తిని ప్రపంచ మార్కెట్లకు మరింత వేగంగా తీసుకెళ్లే వ్యవస్థ. ఉమ్మడి నైపుణ్య వ్యవస్థ ఏర్పడితే అది కేవలం ఉద్యోగ శిక్షణ కాదు –ప్రపంచ పెట్టుబడులకు దక్షిణాదిని ఒక పెద్ద టాలెంట్ పూల్‌గా నిలబెట్టడం. అందుకే మహాబలిపురం సమావేశంలో చంద్రబాబు వినిపించిన ప్రతిపాదనలను రేపటి దక్షిణాది కోసం ఒక 'ఇంటిగ్రేటెడ్ రీజనల్ విజన్'కు ఆరంభ బిందువుగా చూడాలి. విజనరీ విజన్ సాక్షాత్కరించాలంటే –కావాల్సింది ప్రకటన కాదు, రోడ్‌మ్యాప్. ప్రతి ప్రతిపాదనకు డీపీఆర్. ప్రతి డీపీఆర్‌కు కాలపరిమితి. ప్రతి ప్రాజెక్టుకు రాష్ట్రాల సమ్మతి. ప్రతి సమ్మతికి పారదర్శక వ్యవస్థ. ప్రతి పెట్టుబడికి స్పష్టమైన ఆర్థిక ప్రయోజనం. అదే జరిగితే గోదావరి నుంచి కావేరి వరకు, అమరావతి నుంచి చెన్నై వరకు, విద్యుత్ గ్రిడ్ నుంచి స్కిల్ గ్రిడ్ వరకు –దక్షిణాది భవిష్యత్ అభివృద్ధి కథ ఒకే దిశలో కదిలే అవకాశముంది. 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల దక్షిణాది ఆర్థిక వ్యవస్థ అన్న లక్ష్యం ఎంత పెద్దదో, దాన్ని సాధించేందుకు అవసరమైన ఆలోచన కూడా అంతే పెద్దది. చంద్రబాబు ప్రతిపాదనల అసలు బలం –సరిహద్దులను గుర్తించే పరిపాలన నుంచి సరిహద్దులను దాటి ఆలోచించే అభివృద్ధివైపు అడుగులోనే ఉంది.

- మహాదేవ

చైతన్యరథం

# ఫ్యూచర్ టెక్ హబ్.. ఏపీ!

- రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కొత్త అధ్యాయం
- స్పష్టమైన వ్యూహం.. వేగవంతమైన అమలు ఫలితం
- 20వ ఎస్ఐపీబీలో 25 ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్
- 21,627 ఉద్యోగ అవకాశాలకు భరోసా
- గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, ఏరోస్పేస్‌పైనే దృష్టి
- వ్యూహాత్మక ప్రణాళికలతో సీఎం చంద్రబాబు నాయుడు..



ఫైల్ ఫొటో

అమరావతి సచివాలయంలో ఆగస్టు 12న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (సిపిబి) సమావేశం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో మరో మైలురాయి. ఈ భేటీలో 25 ప్రాజెక్టులకు సంబంధించి మొత్తం రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు బోర్డు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నది అంచనా. అనకాపల్లి జిల్లాలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ రూ.85,200 కోట్లతో, విశాఖపట్నంలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా రూ.58,743 కోట్లతో, అదే జిల్లాలో ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ రూ.31,387 కోట్లతో, కాకినాడలో వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.15,000 కోట్లతో, కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ రూ.7,800 కోట్లతో, విశాఖపట్నంలో అక్షత్ గ్రీన్‌టెక్ రూ.1,600 కోట్లతో ప్రాజెక్టులు చేపట్టనున్నాయి. ఇప్పటివరకూ జరిగిన 20 సిపిబి సమావేశాల్లో మొత్తం 363 ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే.. వాటి మొత్తం విలువ రూ.13.78 లక్షల కోట్లకు చేరింది. ఇవి పూర్తిస్థాయిలో కార్యరూపం దాలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 10.86 లక్షలమందికి ఉపాధి లభించే అవకాశముంది.

సమావేశంలో సీఎం చంద్రబాబు చేసిన కీలక వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కేవలం భారీ పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా, ఒప్పందం చేసుకున్న ప్రతి ప్రాజెక్టు శంకుస్థాపన నుంచి వాణిజ్య ఉత్పత్తి వరకూ నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తయ్యేలా చూడాలన్నది ముఖ్యమంత్రి ఆదేశం. పారిశ్రామిక ప్రోత్సాహకాలను డిసెంబరునుంచి ఎస్క్రో ఖాతాల్లో జమ చేయాలని, ప్రాజెక్టుల పురోగతికి అనుగుణంగానే ప్రోత్సాహకాలు విడుదల చేయాలని సూచించారు. పెట్టుబడులు కేవలం నగరాలు, పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ పారిశ్రామికీకరణ జరగాలని, సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణం పూర్తి చేసి, రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పారిశ్రామిక పార్కులు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. 'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమాన్ని విస్తృతస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీ నీరు మాత్రమే అవసరమవుతుందని, కొన్ని వర్గాలు పరిశ్రమలను కాలుష్యకారక యూనిట్లుగా చిత్రీకరిస్తూ అపోహలు సృష్టిస్తున్నాయని, వాటిని నివృత్తి చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలోనే, రాబోయే రోజుల్లో గ్రీన్ అమ్మోనియా, లిథియం అయాన్ బ్యాటరీలు, రోబోటిక్స్‌వంటి భవిష్యత్ సాంకేతిక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అవసరమైన విధాన చర్యలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించడం ప్రాధాన్యతాంశం. సంప్రదాయ తయారీ, ఐటీ రంగాలకు మించి ఏరోస్పేస్, గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్‌వంటి భవిష్యత్ సాంకేతికతల్లో రాష్ట్రం అడుగుపెడుతుండటం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం, నిలువుటద్దం!

## ఏరోస్పేస్ రంగంలో తొలి అడుగులు

ఇప్పటికే నెల్లూరు జిల్లా (శ్రీ సత్యసాయి జిల్లా)లో రేమండ్ గ్రూప్ అనుబంధ సంస్థ జేకే మైనీ గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్, రూ.510 కోట్లతో అత్యాధునిక ఏరోస్పేస్ తయారీ యూనిట్‌ను నెలకొల్పుతోంది. గ్లోబల్ ఓఈఎం సంస్థలకు, టైర్-1 సరఫరాదారులకు అవసరమైన అత్యంత కచ్చితత్వంగల విమాన ఇంజిన్ విడిభాగాలను ఇక్కడ తయారు చేయనున్నారు. 2027 మే నాటికి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుండగా, 1,400 మందికిపైగా ప్రత్యక్ష ఉద్యోగాలు లభించనున్నాయి. అదే గ్రూప్‌నకు చెందిన మరో అనుబంధ సంస్థ గుడిపల్లిలో రూ.430 కోట్లతో ఆటోమోటివ్ విడిభాగాల యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత ఏరోస్పేస్ రంగంలో వచ్చిన తొలి భారీ పెట్టుబడి ఇదే కావడం, బెంగళూరు సరిహద్దుకు ఆనుకుని ఉన్న హిందూపురం ప్రాంతాన్ని ఏరోస్పేస్ కారిడార్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి బలం చేకూరుస్తోంది. కొత్త ఏరోస్పేస్ పాలసీ కింద వచ్చిన తొలి పెట్టుబడి, భవిష్యత్తులో అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించే అవకాశాలకు తలుపులు తెరిచినట్టే.

## గ్రీన్ అమ్మోనియాలో ప్రపంచ రికార్డు దిశగా..

గ్రీన్ అమ్మోనియా రంగంలో ఏపీ ఇప్పటికే ప్రపంచస్థాయి గుర్తింపు సాధించింది. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ చేపడుతున్న 1.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంగల గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్దది. మొత్తం రూ.84,000 కోట్ల పెట్టుబడితో, పాత నాగార్జున ఫెర్టిలైజర్స్ కాంప్లెక్స్‌ను పునరుద్ధరిస్తూ దీన్ని నిర్మిస్తున్నారు. 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1,950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ సామర్థ్యం, 2 గిగావాట్ల పంప్ హైడ్రో స్టోరేజీతో సమీకృత క్లీన్ ఎనర్జీ వ్యవస్థగా రూపొందిస్తున్నారు. 2027నాటికి తొలి దశ, 2030నాటికి పూర్తి సామర్థ్యం అందుబాటులోకి రానుండగా, ఇక్కడ ఉత్పత్తయ్యే గ్రీన్ అమ్మోనియా ప్రధానంగా జర్మనీకి ఎగుమతి కానుంది. ఇది ప్రపంచ క్లీన్ ఎనర్జీ సరఫరా వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను మరింత బలోపేతం చేయడం ఖాయం. ఇంతకుముందు రెన్యూ ఎనర్జీ సంస్థ రూ.82,000 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల పీవీ ఇంగాట్-వేఫర్ ప్లాంటు, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా యూనిట్‌ను కూడా ప్రకటించడం గమనార్హం. తాజాగా 20వ సిపిబి భేటీలో ఆమోదం పొందిన రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ (రూ.85,200 కోట్లు), వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ (రూ.15,000 కోట్లు) వంటి ప్రాజెక్టులు కూడా క్లీన్ ఎనర్జీ-డేటా సెంటర్ల సమీకృత వ్యవస్థ దిశగా రాష్ట్ర అడుగులను మరింత వేగవంతం చేస్తున్నాయి.

## లిథియం బ్యాటరీలు, డేటా సెంటర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్

లిథియం బ్యాటరీల రంగంలోనూ రాష్ట్రం ముందంజలో ఉంది. వారీ ఎనర్జీస్ సంస్థ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.8,175 కోట్లతో దేశంలోనే అతిపెద్ద లిథియం-అయాన్ బ్యాటరీ గిగా ఫ్యాక్టరీని నెలకొల్పనుంది. వార్షిక 16 గిగావాట్-గంటల సామర్థ్యంతో, సెల్ తయారీ నుంచి బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ వరకూ మొత్తం విలువ శృంఖలాన్ని ఇది కవర్ చేస్తుంది. 3,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దీంతోపాటు, అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని ప్రవేశపెట్టి, ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి సంస్థలతో కలిసి 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ' పేరుతో క్వాంటమ్ హార్డ్‌వేర్ తయారీ వ్యవస్థను నిర్మించే దిశగా అడుగులు వేస్తుండటం, ఏకకాలంలో అనేక భవిష్యత్ సాంకేతికతలపై రాష్ట్రం ఎంత విస్తృతంగా దృష్టి సారించిందో స్పష్టం చేస్తోంది. ఇటీవలే ఇందుకు సంబంధించి రాష్ట్ర సచివాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జాతీయ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్, రాష్ట్ర క్వాంటమ్ మిషన్ డైరెక్టర్‌తోపాటు పరిశ్రమ, పరిశోధన సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అదే సమయంలో, డేటా సెంటర్ల రంగంలోనూ రాష్ట్రం శరవేగంగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. తాజా సిపిబి భేటీలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో డేటా సెంటర్లకు సంబంధించినవే అత్యధిక వాటా కలిగి ఉండటం, ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశపు కీలక డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా మార్చే ప్రయత్నాలకు నిదర్శనం.

## సవాళ్లు తక్కువేమీ కాదు

అయితే, ఇంతటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను సాధించే మార్గంలో సవాళ్లు తక్కువేమీ కాదు. ఏరోస్పేస్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌వంటి రంగాలకు అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఈ నైపుణ్య అంతరాన్ని పూడ్చడం, స్థానిక యువతకు తగిన శిక్షణ ఇవ్వడం పెద్ద సవాలే. లిథియం బ్యాటరీ, గ్రీన్ అమ్మోనియా వంటి పరిశ్రమలకు భారీ మొత్తంలో నీరు, విద్యుత్ అవసరం కావడం, పర్యావరణపరమైన సమతుల్యతను కాపాడుకుంటూనే వీటిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే, డేటా సెంటర్లు, కొత్త పరిశ్రమలపై కొన్ని వర్గాలు కాలుష్య భయాలు రేకెత్తిస్తున్నాయని, వాస్తవానికి ఉత్తరాంధ్రలో రానున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీ నీరు మాత్రమే అవసరమవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేయాల్సి రావడం, పెట్టుబడులపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని కూడా సూచిస్తోంది. అంతేకాక, ఇలాంటి అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలకు అవసరమైన ప్రత్యేక మౌలిక సదుపాయాలు- స్థిరమైన విద్యుత్ సరఫరా, ప్రత్యేక పారిశ్రామిక పార్కులు, పరిశోధన-అభివృద్ధి కేంద్రాలు- ఇవన్నీ వేగంగా సిద్ధం చేయాల్సి ఉంటుంది. పెట్టుబడులు కేవలం విశాఖపట్నం, అనకాపల్లివంటి ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలకే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సమానంగా విస్తరించాల్సిన అవసరాన్నీ ప్రభుత్వం గుర్తించింది.

## స్పష్టమైన విధానం, వేగవంతమైన అమలు

అయితే, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న వేగం, స్పష్టమైన ప్రణాళిక అభినందనీయం. ప్రతి కొత్త రంగానికి ప్రత్యేక పాలసీని రూపొందించడం (ఏరోస్పేస్ పాలసీ, క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ, ఐటీ అండ్ జీసీసీ పాలసీ 4.0).. ఇలా ప్రతి రంగానికి ప్రత్యేకంగా విధానపరమైన స్పష్టత ఇవ్వడం ద్వారా పెట్టుబడిదారులకు నమ్మకాన్ని కల్పించగలుగుతున్నారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దిన సంస్కరణలు, గూగుల్‌వంటి దిగ్గజ సంస్థలను ఆకర్షించడానికి పునాదిగా మారడం కూడా ఇందుకు నిదర్శనం. ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాల ద్వారా ప్రాజెక్టుల పురోగతికి అనుసంధానం చేయడం,పెట్టుబడులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా వేగంగా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చేలా చూసేందుకు నిర్దిష్ట కాలవ్యవధిని నిర్దేశించడంవంటి చర్యలు, ప్రభుత్వ జవాబుదారీ తనాన్ని పెంచే దిశగా వేసిన ముందడుగులు. ప్రతి సవాలుకూ ముందుగానే పరిష్కారం ఆలోచించి, వేగంగా అమలు చేసే చంద్రబాబు పరిపాలనా శైలి, ఈ భవిష్యత్ రంగాల్లో రాష్ట్రం విజయవంతం కావడానికి కీలక పాత్ర పోషిస్తోంది.

## స్వర్ణాంధ్ర లక్ష్యానికి బలమైన పునాది

మొత్తంమీద చూస్తే, ఏరోస్పేస్, గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా సెంటర్లువంటి రంగాల్లో ఏకకాలంలో పెట్టుబడులను ఆకర్షించగలగడం, ఆంధ్రప్రదేశ్‌ను కేవలం ఒక తయారీ కేంద్రంగా కాకుండా, భవిష్యత్ సాంకేతిక శక్తిగా తీర్చిదిద్దాలన్న చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం. సంప్రదాయ పరిశ్రమల మీదే ఆధారపడకుండా, రేపటి ప్రపంచానికి అవసరమైన సాంకేతికతలపై ఇప్పుడే పెట్టుబడి పెట్టడం అనేది దీర్ఘకాలిక ఆలోచనే. ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు, దేశంలోనే అతిపెద్ద లిథియం బ్యాటరీ గిగాఫ్యాక్టరీ, ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలి ఏరోస్పేస్ పెట్టుబడి, ఇప్పుడు రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన 25 కొత్త ప్రాజెక్టులకు ఒకేసారి ఆమోదం- ఇవన్నీ ఏపీ ఖాతాలో చేరడం యాదృచ్ఛికం కాదు, స్పష్టమైన వ్యూహం, వేగవంతమైన అమలు ఫలితమే! సవాళ్లు ఎదురైనప్పుడు వెనుకడుగు వేయకుండా, ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీతో, స్పష్టమైన కాలవ్యవధితో, గ్రామీణ ప్రాంతాలకు కూడా పరిశ్రమలు విస్తరించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్న చంద్రబాబు నాయకత్వం, రాష్ట్రాన్ని భవిష్యత్ సాంకేతిక కేంద్రంగా మార్చగలదన్న విశ్వాసాన్ని బలోపేతం చేసింది. 2047నాటికి స్వర్ణాంధ్రగా ఎదగాలన్న లక్ష్యానికి, ఈ కొత్తతరం పరిశ్రమలే బలమైన పునాది. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి ఉద్యోగావకాశాలు, ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ గుర్తింపు.. -రెండూ ఈ దార్శనిక వ్యూహం ద్వారా సాకారం కానున్నాయి.

- రాణీప్రసాద్

# ఏపీపీఎస్సీకి, డీఎస్సీ ఒకటే అన్న మహాజ్ఞాని

**- జగన్‌పై రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ వ్యంగ్యాస్త్రాలు**



అమరావతి (చైతన్యరథం): పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షకు, డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీకి తేడా తెలియని జగన్ మేధావి తనం గురించి రాష్ట్రంలోని అన్ని తరాల ప్రజలు ఆలోచించాలని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పబ్లిక్ సర్వీస్ పరీక్షలో సర్వీస్ అనే పదాన్ని హోటల్ సర్వీస్ అనుకుని ఆ పరీక్ష పత్రాల మూల్యాంకనం రిసార్ట్ లో పెట్టినట్లు ఉన్నాడని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో 4పిల్లర్లు ఉంటాయనే విషయం కూడా తెలియని వ్యక్తి 5ఏళ్లు ముఖ్యమంత్రిగా చేయటం రాష్ట్ర ప్రజల ఖర్మ కాక మరేంటని ప్రశ్నించారు. ఏపీపీఎస్సీకి డీఎస్సీ కి తేడా తెలియని వాడు, రాజ్యాంగం తెలియని వాడు కాబట్టే అసెంబ్లీ కి రానంటున్నాడు. గ్రూప్ 1 ఉద్యోగాల విలువ తెలియక హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో పేపర్లు దిద్దించి పెద్ద కుంభకోణానికి పాల్పడ్డాడు. డీఎస్సీ నిర్వహించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించిన దమ్మున్న నాయకుడు లోకేష్. కూటమి ప్రభుత్వ హయాంలో అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీ నియామకాలపై జగన్ రెడ్డి అనవసర రాద్ధాంతం చేస్తున్నాడని చింతకాయల విజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

# ఐదేళ్లు నెత్తురు పారించి.. ఇప్పుడు నీతులా

- **జగన్ రెడ్డి దమనకాండను ప్రజలు మర్చిపోలేదు**
- **గత స్థానిక ఎన్నికల్లో అడ్డగోలుగా అరాచకాలు**
- **నేడు స్వాతిముత్యం తరహాలో గొడ్డలి పార్టీ అధినేత మాటలు**
- **టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ ఫైర్**



అమరావతి (చైతన్యరథం): గతంలో అధికార బలంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర అరాచకాలు సృష్టించిన గొడ్డలిపార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు ఏమీ తెలియనట్లు 'స్వాతిముత్యంలాగా' నటిస్తూ ఎన్నికల్లో యుద్ధం చేద్దాం అనడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూర్యప్రకాష్ మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ కార్యాలయానికి కార్యకర్తలు ఎవరైనా స్వేచ్ఛగా రావచ్చని, కానీ వైసీపీ ఆఫీసుకు కేవలం ఎంపిక చేసుకున్న కొద్దిమందిని మాత్రమే అనుమతించే పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. అలాంటి కొద్దిమందిని కూర్చోబెట్టుకుని.. గంజాయి బ్యాచ్‌లకు, హత్యలు చేసేవారికి, గొడ్డళ్లతో విన్యాసాలు చేసేవారికే టికెట్లు ఇస్తామని చెప్పే రీతిలో జగన్ ఆలోచనలు ఉన్నాయని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన దౌర్జన్యాలు ప్రజలందరికీ గుర్తున్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడా పోటీ ఉండకూడదని, వీలైనన్ని ఎక్కువ ఏకగ్రీవాలు చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు లక్ష్యాలు పెట్టి అరాచకాలు చేయించింది జగన్ కాదా అని ప్రశ్నించారు.

ఆనాడు ప్రజాస్వామ్యాన్ని కాలరాసి బలవంతపు ఏకగ్రీవాలు చేసుకుని, నేడు అధికారం పోయాక ఏమీ ఎరగనట్లు 'స్వాతిముత్యంలాగా' మాట్లాడుతూ 'యుద్ధం చేద్దాం, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగితే మనదే విజయం' అనడం దొంగ ఇంట్లోని కుక్క పోలీసులను చూసి మొరిగినట్లు ఉందని సూర్యప్రకాష్ ఎద్దేవా చేశారు.

జగన్ పాలన రాష్ట్రానికి అరిష్టమని భావించే గత ఎన్నికల్లో ప్రజలు ఆయన పార్టీని 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో విజ్ఞులని, ఒకసారి వదిలించుకున్న దరిద్రాన్ని మళ్లీ తెచ్చుకునేందుకు సిద్ధంగా లేరన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా బెదిరించారని, పోటీలో నిలిచిన వారిని వేధించి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అటువంటి అరాచకాలకు పాల్పడిన వారు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరిట సాగిన హింస, దౌర్జన్యాలకు సంబంధించిన ఆధారాలు ప్రజల వద్ద ఇంకా పదిలంగానే ఉన్నాయని హెచ్చరించారు. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా, స్వాతిముత్యంలా ఎన్ని కబుర్లు చెప్పినా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాభవం తప్పదని, కూటమి ప్రభుత్వానికే ప్రజలు మరోసారి స్పష్టమైన తీర్పునిస్తారని ఆయన తేల్చిచెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఎలాంటి భయభ్రాంతులు లేకుండా పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో స్థానిక ఎన్నికలు జరుగుతాయని, ప్రజాభిప్రాయం ప్రకారం కూటమి విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు 'సిద్ధం' సభలు పెట్టి 'వై నాట్ 175' అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ మోహన్ రెడ్డి, చివరికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు.

గతంలోలాగే ఇప్పుడు కూడా కార్యకర్తలను మభ్యపెట్టి మళ్లీ నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా 99 బహిరంగ సభల్లో 'రెడ్ బుక్'ను ప్రజలకు చూపించారని గుర్తుచేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారమే చర్యలు ఉంటాయని ప్రజల సమక్షంలో స్పష్టంగా చెప్పి ప్రజామోదం పొందామని, ఇవి ఎన్నికల తర్వాత కొత్తగా తెచ్చినవి కావని సూర్యప్రకాష్ స్పష్టం చేశారు.

### తప్పు చేస్తే చట్టం వదలదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిపైనా ఒక్కటంటే ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని, తప్పు చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నందునే చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని సూర్యప్రకాష్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ 'రెడ్ బుక్ రాజ్యాంగం' అంటూ గగ్గోలు పెట్టే గొడ్డలి పార్టీ నాయకులకు ఆయన సూటిగా సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం ఎవరిమీదైనా రాజకీయ కక్షతో అక్రమ కేసులు పెట్టిందా? లేక వారు చేసిన నేరాలకు ఆధారాలు ఉండబట్టే జైలుకు వెళ్లారా? అనే దానికి వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, వారి పార్టీ నేతలు సమాధానం చెప్పాలి. బొల్లా బ్రహ్మనాయుడు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి, భూకబ్జా కుట్రకు పాల్పడితే పోలీసులు అరెస్ట్ చేయకూడదా? సీదిరి అప్పలరాజు 40 ఏళ్ల నిరుపేద గొర్రెల కాపరిని రోడ్డు ప్రమాదంలో చంపేసిన సొంత కొడుకుని కాపాడుకోవడానికి అమాయకుడైన వేరే యువకుడిపై నేరం మోపి సాక్ష్యాలను తారుమారు చేయాలని చూస్తే మాజీ మంత్రని వదిలేయాలా? కుటుంబానికి ఆధారం కోల్పోయి, పాలకు డబ్బుల్లేక నీళ్లలో బిస్కెట్ వేసి బిడ్డకు తినిపించే ఆ పేద బాధితురాలి కన్నీళ్లు మీకు కనిపించలేదా? వల్లభనేని వంశీ విషయానికి వస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాది పాటు ఆయనపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. కానీ, ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించి కేసు విత్‌డ్రా చేయించాలని చూస్తే చట్టం చూస్తూ ఊరుకోవాలా? దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు స్పష్టంగా ఉన్నాయి. ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే వై. విరూపాక్షి ఇసుక దోపిడీని అడ్డుకుందన్న అక్కసుతో ఒక దళిత మహిళపై దాడి చేసి వివస్త్రను చేస్తే ప్రభుత్వం మౌనంగా ఉండాలా? కిడ్నాప్ కేసులో మాజీ ఎమ్మెల్యే ముస్తఫా, కల్తీ మద్యం కేసులో జోగి రమేష్, డ్రైవర్ హత్య కేసు సాక్షుల బెదిరింపులో ఎమ్మెల్సీ అనంతబాబు, అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వర్రా రవీంద్రా రెడ్డిలపై అన్ని ఆధారాలతోనే పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకున్నారు.

బాధితుల పక్షాన నిలబడాల్సిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సిగ్గులేకుండా నేరస్తుల పక్షాన నిలబడి వెనకేసుకురావడం సిగ్గుచేటని మద్దిపట్ల సూర్యప్రకాష్ మండిపడ్డారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనని, ప్రజా ప్రభుత్వం బాధితులకు న్యాయం చేసే దిశగానే పని చేస్తుందని ఆయన తేల్చిచెప్పారు.

### ఐదేళ్ల పాలనలో వేలాది అక్రమ కేసులు

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో బడుగు, బలహీన, దళిత వర్గాలపై 'బ్లడ్ బుక్' రాసి అరాచకాలు సృష్టించిన జగన్ మోహన్ రెడ్డికి, నేడు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుంటే 'రెడ్ బుక్ రాజ్యాంగం' అంటూ మాట్లాడే అర్హత లేదని మద్దిపట్ల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని, ఎన్నికల సమయంలో నారా లోకేష్ చెప్పినట్లుగానే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలను వేధించిన వారిపైనే పక్కా ఆధారాలతో చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఏకంగా 60 వేల అక్రమ కేసులు బనాయించి పైశాచికానందం పొందారని విమర్శించారు.

జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వెళ్తే అంగళ్లు, తంబళ్లపల్లి వద్ద వైసీపీ శ్రేణులు రాళ్ల దాడి చేశాయి. పుంగనూరు, అంగళ్లు ఘటనల్లో ఏకంగా 1200 మందిపై హత్యాయత్నం (307) కేసులు పెట్టారు. అమెరికాలో ఉన్న వారిపై, సిక్కింలో ఆర్మీలో పనిచేస్తున్న జవాన్లపై, మాచర్లలో యువగళం పాదయాత్రలో ఉన్న తమపై కూడా అంగళ్లలో దాడి చేశారంటూ తప్పుడు కేసులు నమోదు చేశారు. చంద్రబాబుపై 2 హత్యాయత్నం కేసులు, నారా లోకేష్‌పై 23 కేసులు పెట్టడమే కాకుండా.. కళా వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్ (14 కేసులు), కొల్లు రవీంద్ర (25), అయ్యన్నపాత్రుడు, చల్లా బాబురెడ్డి (17), ధూళిపాళ్ల నరేంద్ర (16), రఘురామకృష్ణరాజు (11), బీటెక్ రవి (9), అచ్చెన్నాయుడు (21)లతో పాటు చివరకు ఎస్సీ, ఎస్టీ నేతలపై కూడా తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించారు. చిన్న ఘటన జరిగినా వందలాది మందిపై కేసులు పెట్టి టీడీపీని నిర్వీర్యం చేయాలని చూసిన జగన్ మోహన్ రెడ్డి పాపాలను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. తప్పు చేసిన వారిపై చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, ఓర్వలేక భ్రమలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేస్తుందని సూర్యప్రకాష్ తేల్చిచెప్పారు.

### కూటమిదే విజయం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే ఊరుకోనంటూ వైసీపీ కార్యకర్తలను, ఇన్‌ఛార్జ్‌లను జగన్ మోహన్ రెడ్డి రెచ్చగొట్టడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని సూర్యప్రకాష్ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బలవంతపు ఏకగ్రీవాలు చేయించుకుని, ఇప్పుడు అధికారం కోల్పోయాక 'యుద్ధం చేద్దాం' అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అవసరానికి ఒక మాట మాట్లాడి, ఆ తర్వాత వాడుకొని వదిలేయడం జగన్ మోహన్ రెడ్డి రాజకీయ నైజమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోసం సొంత తల్లిని, చెల్లిని వాడుకుని.. ఆ తర్వాత వారిపైనే కేసులు వేయించిన నీచ చరిత్ర జగన్‌ది. అధికారంలో ఉన్న ఐదేళ్లూ సామాన్యుల నుంచి ప్రతిపక్ష నేతల వరకు అందరినీ వేధించారు.

సొంత బాబాయి హత్య కేసు మొదలుకొని ఎందరి జీవితాలనో నాశనం చేశారు. యువత, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి.. ఇప్పుడు మళ్లీ 'జెన్ జీ' అంటూ కొత్త డ్రామాలకు తెరలేపుతున్నారు. 'ఒక్క అవకాశం' అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ పాలనను ప్రజలు చూశారని, ఆ 'సినిమా' పూర్తిగా అట్టర్‌ఫ్లాప్ అయిందని అన్నారు. ఒక్కసారి చూసి తల బొప్పి కట్టిన ఆ సినిమాను మళ్లీ రీ-రిలీజ్ చేస్తే చూడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవరూ సిద్ధంగా లేరని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థలైనా, మున్సిపాలిటీలైనా, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలైనా సరే ఫలితం ఒక్కటేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి ఎలాగైతే పట్టం కట్టారో, భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా 94 శాతానికి పైగా స్థానాలు, 56 శాతానికి పైగా ఓట్లతో కూటమిదే ఏకపక్ష విజయమని మద్దిపట్ల సూర్యప్రకాష్ ధీమా వ్యక్తం చేశారు.

చైతన్యరథం

# మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతర గాలింపు

- 5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్‌తో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్, బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంత అధికారులకు సమాచారం
- మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చే వరకు గాలింపు ఆగదు
- కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




అమరావతి (చైతన్యరథం): గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 5 నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తోపాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించే అధికారి కూడా గాలింపు చర్యలను కొనసాగిస్తారని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కోస్ట్‌గార్డ్, నేవీతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బోటు ఆచూకీ లభించే వరకు అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

## షావుకారు జానకితో మా అనుబంధం ప్రత్యేకం

**- నందమూరి బాలకృష్ణ సంతాపం**



అమరావతి (చైతన్యరథం): మహానటి షావుకారు జానకి తుదిశ్వాస విడిచారన్న వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని నటసింహం నందమూరి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. జానకితో మా నందమూరి కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉంద న్నారు. నాన్న ఎన్టీఆర్ హీరోగా రిలీజైన తొలి చిత్రం 'షావుకారు'తోనే ఆమె 'షావుకారు జానకి'గా సుప్రసిద్ధులయ్యారు. అలా నాన్నకి జానకి తొలి హీరోయిన్, అలాగే ఆమె తొలి కథానాయకుడు ఎన్టీఆర్. నాన్నతో అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకులను జానకి ఆకట్టుకున్నారు. మా ఎన్ఏటి బ్యానర్ లో రూపొందిన తొలి చిత్రం 'పిచ్చిపుల్లయ్య'లో జానకి కీలక పాత్ర ధరించారు. 'పాండురంగ మహాత్మ్యం' నుంచీ ఎన్ఏటి బ్యానర్ లోగోలో శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహానికి కుడివైపున జానకి కూర్చుని తెరపై కనిపించడం విశేషం. నేను 'తాతమ్మకల'లో మహానటి భానుమతి మునిమనవడిగా నటిస్తూ పరిచయమయ్యాను. ఆ తరువాత రామ్ – రహీమ్, వేములవాడ భీమకవి చిత్రాల్లో షావుకారు జానకితో నటించే అదృష్టం నాకు దక్కింది. మన దేశంలో 75 ఏళ్ళ సుదీర్ఘ నటనాప్రస్థానం చూసిన నటి షావుకారు జానకి ఒక్కరే అనుకుంటాను. అంతటి సుదీర్ఘ నటనాజీవితంలో ఎన్నెన్నో మరపురాని పాత్రల్లో జనాన్ని మెప్పించారు జానకి. ఆ మహానటి మరణం నాకు వ్యక్తిగతంగా తీరనిలోటు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు.

## షావుకారు జానకి మృతి బాధాకరం

**- మంత్రి కందుల దుర్గేష్ సంతాపం**

అమరావతి (చైతన్యరథం): ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ 'షావుకారు' జానకి  మృతి పట్ల రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. "'షావుకారు' చిత్రంతో సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని 'షావుకారు జానకి'గా విశేష కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు. రాజమహేంద్రవరంలో జన్మించిన ఆమె దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి, వైవిధ్యమైన పాత్రలతో సహజ నటనను ప్రదర్శించి కోట్లాది మంది అభిమానులను మెప్పించారని గుర్తుచేసుకున్నారు. తెలుగు చిత్రసీమలో తన అభినయంతో చెరగని ముద్ర వేసిన షావుకారు జానకి మరణం కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు..ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన సానుభూతిని తెలిపారు.

# డయేరియాపై అసత్య ప్రచారం

- ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో విరేచనాలతో ఆసుపత్రిలో చేరిన 11 మంది
- ప్రస్తుతం చికిత్స పొందుతున్న 9 మంది ఆరోగ్యం నిలకడగా ఉంది
- డయేరియా కారణాలపై అధికారుల విశ్లేషణ
- ప్రాథమిక పరీక్షల్లో తాగునీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలింది
- ఉయ్యూరులో రూ.98 కోట్లతో అమృత్ 2.0 కింద కొత్త నీటి సరఫరా పనులు
- మంత్రి పొంగూరు నారాయణ స్పష్టీకరణ
- బాధితులకు మంత్రి పరామర్శ



ఉయ్యూరు (చైతన్యరథం): కృష్ణా జిల్లా ఉయ్యూరులో డయేరియాపై అసత్య ప్రచారం జరుగుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి నారాయణ శుక్రవారం పరామర్శించారు.అనంతరం ఉయ్యూరు 5వ వార్డులో డయేరియా నమోదైన ప్రాంతాన్ని సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, జాయింట్ కలెక్టర్ నవీన్, తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఉయ్యూరులో డయేరియాపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. ఉయ్యూరుతో పాటు పరిసర గ్రామాల్లో మొత్తం 11 మంది విరేచనాలతో ఆసుపత్రిలో చేరారని, వారిలో ఆరుగురు మాత్రమే ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధికి చెందినవారని చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని, బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మంత్రి తెలిపారు. ఈ నెల 17న ఒక వ్యక్తి కార్డియాక్ సమస్యతో ఆసుపత్రిలో చేరి మరణించారని, ఆయన మృతికి డయేరియాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఉయ్యూరు మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే నీటి పైప్‌లైన్‌కు, పరిసర గ్రామాల్లోని నీటి సరఫరా లైన్లకు సంబంధం లేదని మంత్రి వివరించారు. డయేరియాకు కారణం మున్సిపల్ పైప్‌లైన్‌లో నీటి కాలుష్యమా.. లేక ఆర్వో ప్లాంట్ల నీటిలో ఏదైనా సమస్యా అనే అంశాన్ని పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక పరీక్షల్లో తాగునీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలిందని మంత్రి వెల్లడించారు. మరింత లోతైన విశ్లేషణ ద్వారా అసలు కారణాన్ని నిర్ధారించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఉయ్యూరు పట్టణంలో రూ.98 కోట్లతో అమృత్ 2.0 కింద నీటి సరఫరా పనులు చేపడుతున్నామని చెప్పారు. పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన, సురక్షితమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం పొందాలని మంత్రి నారాయణ సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

### ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని

# ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ జగన్ రెడ్డి

**- టీచర్ పోస్టులకు, గ్రూప్-1 పోస్టులకు తేడా తెలియని గొడ్డలి పార్టీ అధినేత**

**- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఎద్దేవా**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ పరీక్షలు నిర్వహిస్తుందో, వాటి విధి-విధానాలు ఏమిటో కనీసం తెలియని వ్యక్తి గొడ్డలి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి.. ఏపీపీఎస్సీపై ఎలాంటి అవగాహన లేకుండానే మాట్లాడుతున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి విమర్శించారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని ఫస్ట్ క్లాస్ స్టూడెంట్ జగన్ రెడ్డి అని ఒక శుక్రవారం ప్రకటనలో జూలకంటి ఎద్దేవా చేశారు. నెల రోజులపాటు 'రిసెర్చ్' చేసి ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అని కనుగొన్న గొప్ప మేధావి జగన్! ఏపీపీఎస్సీ అంటే ఏమిటో తెలియదు, డీఎస్సీ అర్థం కూడా తెలియని నాయకులు వైసీపీ నాయకులు. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతను గంజాయికి బానిసలను చేశారు. టీచర్ పోస్టులకు, గ్రూప్–1 పోస్టులకు తేడా తెలియని వారే గొడ్డలి పార్టీ నాయకులు. కానీ నిరుద్యోగుల జీవితాలతో రాజకీయం చేయడం మాత్రం బాగా తెలుసు. క్యాలెండర్ అంటే గోడకు తగిలించేది కాదు... నిరుద్యోగుల జీవితాలను నిలబెట్టేది అని జగన్ తెలుసుకోవాలి! కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే కోర్టు కేసులు... వైఎస్సార్‌సీపీ హయాంలో ఉద్యోగం అడిగితే వాలంటీర్ పోస్టులు... ఇదేనా గొడ్డలి పార్టీ నైజం? గొడ్డలి వేటు లెక్కలు తెలిసిన వారికి నిరుద్యోగి కన్నీటి విలువ ఏమి తెలుస్తుంది? జాబ్ క్యాలెండర్ పేరుతో తేదీలు మార్చడం కాదు... ఖాళీ పోస్టులు భర్తీ చేయడమే అసలైన క్యాలెండర్! కత్తులతో ప్రాణాలు తీయడం కాదు... కలంతో యువత జీవితాలు నిలపడమే అసలైన యువ శక్తి. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కి ఒక మనవి, పెద్ద మనసుతో వయోజన విద్యా పథకం కింద జగన్‌కు చదువు చెప్పించండి. లేదంటే ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అన్నట్లు, టీచర్లను మద్యం షాపుల దగ్గర కాపలా పెట్టినట్లు, మెకానిక్‌లను డాక్టర్లుగా, డాక్టర్లను తాపీ మేస్త్రీలుగా మార్చి మాట్లాడే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే జులకంటి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి మహర్దశ

**- త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి**
**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**



కోటబొమ్మాళి (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డు నిధులు రూ.2.90 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం భవనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

**సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి**

ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ చేయాలని అన్నారు.

**మానవతా దృక్పథంతో సేవలందించాలి**

వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించి రోగులకు ఆప్యాయతతో సేవలందించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని కోరారు. ఆసుపత్రి పరిసరాల్లో పరిశ్రభత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోగులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీలక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి. గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## నేడు ముఖ్యమంత్రి మాడుగుల పర్యటన

**- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర**

మాడుగుల (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం అనకాపల్లి జిల్లా మాడుగుల పర్యటన విియవంతమయ్యేలా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలంలో జోనల్ పరిశీలకులు బెందాళం అశోక్, జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తితో కలిసి కార్యకర్తలతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం ముఖ్యమంత్రి ఒక నియోజకవర్గంలో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యం సాధ్యమవుతుందని, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యకర్తలతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం ఉంటుందని తెలిపారు. కూటమి నాయకులతో కలిసి సభావేదిక ఏర్పాట్లను మంత్రి రవీంద్ర పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సూచించారు.

# విశాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత

- **గోదావరి జలాలతో నగర తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**
- **రూ.1,000 కోట్లతో తాగునీటి ప్రణాళిక, ప్రతి ఇంటికీ రోజుకు 135 లీటర్ల నీటి సరఫరా లక్ష్యం**
- **రూ.1,500 కోట్లతో ఎస్టీపీ ప్రాజెక్టులు, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు వినియోగించేలా చర్యలు**
- **రోడ్లు, వీధి దీపాల పనులకు అత్యవసర ప్రాతిపదికన ప్రాధాన్యత**
- **వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలు, 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు : మంత్రి నారాయణ**



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ నగరంలో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, మురుగునీటి నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు. శుక్రవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, కమిషనర్ కేతన్ గార్గ్, అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్ష సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టవలసిన కార్యక్రమాలు, ప్రతిపాదిత ప్రాజెక్టు పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి, ప్రజా ప్రతినిధులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. విశాఖకు గోదావరి జలాలు రానున్న నేపథ్యంలో వాటి నిల్వకు అవసరమైన ప్రాంతాలను గుర్తించామని, సుమారు రూ.1,000 కోట్లతో తాగునీటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే ప్రతి ఇంటికీ రోజుకు 135 లీటర్ల నీటిని అందించవచ్చని పేర్కొన్నారు. గోదావరి జలాలతో విశాఖ తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందన్నారు. మురుగునీటి శుద్ధి కోసం సుమారు రూ.1,500 కోట్లతో ఎస్టీపీ ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్నామని, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు అందించడం ద్వారా మంచినీటి వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. డేటా సెంటర్ల వల్ల విశాఖలో నీటి సమస్య ఏర్పడుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు. నగరంలో రోడ్లు, వీధి దీపాల పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. రహదారి పనుల జాప్యంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో చర్చించామని, అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే పనులను వేగవంతం చేస్తామన్నారు. వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలను నిర్మించి, అర్హులకు సుమారు 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, కోర్టు తీర్పు అనంతరం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి తదుపరి చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. ఈ సమీక్షలో గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి. విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

# సీబీఐపై నీకు నమ్మకం ఉందా?

- **జగన్‌ను నిలదీసిన మంత్రి సవిత**
- **ఆనాడు వివేకా హత్య కేసుపై సీబీఐ దర్యాప్తు ఎందుకు వద్దన్నావ్?**
- **దొంగే.. దొంగ దొంగ అన్నట్లుగా జగన్ తీరు**
- **గ్రూప్ 1 మూల్యాంకనంలో అక్రమాలు బయటపడడంతో డైవర్షన్ రాజకీయాలు**
- **అసెంబ్లీలో చర్చకు ఎందుకు రాలేదు**
- **మెగా డీఎస్సీ అభ్యర్థుల కష్టాన్ని తక్కువ చూసి చూపొద్దు**
- **జగన్ తాటాకు చప్పుళ్లకు ఎవరూ బెదిరిపోరు**
- **రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**




పెనుకొండ (చైతన్యరథం): గ్రూప్ 1 పరీక్షల్లో జరిగిన అక్రమాలు బయటకు పొక్కడంతో మెగా డీఎస్సీ నిర్వహణపై దొంగే.. దొంగ, దొంగ అని అరిచినటట్లుగా జగన్ ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. మెగా డీఎస్సీ అభ్యర్థుల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడుతున్న జగన్ కు చట్టాలపైనా, సీబీఐపైనా నమ్మకం ఉందా.. అని ప్రశ్నించారు. డీఎస్సీలోపై తప్పుడు ఆరోపణలు చేయడం కాదని, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేసినా ఆయన ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యువతకు ఉద్యోగాలే కల్పనే లక్ష్యంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఇచ్చిన మాటకు కట్టుబడి జాబ్ క్యాలెండర్ అమలు చేస్తూ, కూటమి ప్రభుత్వం ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తుందని స్పష్టం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మెగా డీఎస్సీలో టీచర్ పోస్టు సాధించిన టీచర్లు జ్యోతి, గంగాధర్ ఇళ్లకు శుక్రవారం వెళ్లి వాళ్లతో మంత్రి మాట్లాడారు. అనంతరం మహిళా టీచర్ జ్యోతితో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదనడానికి తన పక్కనున్న మహిళా టీచరే ఉదాహరణ అన్నారు. డీఎస్సీలో రెండు పోస్టులకు ఆమె క్వాలీఫై అయ్యిందన్నారు. ఆమె తమ్ముడు కూడా డీఎస్సీ అర్హత పరీక్ష రాసినా, ఉత్తీర్ణత సాధించలేకపోయారన్నారు. మెగా డీఎస్సీ పారదర్శకతను ఈ అక్కాతమ్ముళ్లే నిదర్శనమన్నారు. జగన్ తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం బెదిరిపోదని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. డీఎస్సీ అంటే సీబీఎన్ అని, సీబీఎన్ అంటే డీఎస్సీ అని మంత్రి సవిత స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలకు, భయాలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. టీచర్ల కష్టానికి దక్కిన ఈ విజయం వారికి గర్వకారణమని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సవిత భరోసా ఇచ్చారు.

**గ్రూప్ 1 లో అక్రమాలతో జగన్ డ్రామాలు**

తన హయాంలో జరిగిన గ్రూప్ 1 పరీక్షలో మూల్యాంకనంలో జరిగిన తప్పిదాల నుంచి బయటపడడానికి జగన్ మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. దొంగే దొంగ అన్నట్లు మెగా డీఎస్సీపై జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. భర్త, పిల్లలకు, కుటుంబానికి దూరంగా ఉంటూ, అనంతపురంలో మెగా డీఎస్సీపై పలువురు శిక్షణ పొందారన్నారు. వారి కష్టాన్ని తక్కువ చేస్తూ.. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల మనోభావాలు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా జగన్ మాట్లాడడం సరికాదన్నారు. జగన్ కు చట్టాలపైనా, సీబీఐపైనా మ్మకం ఉందా.. అని ప్రశ్నించారు. వైఎస్ వివేకా హత్య కేసులో తొలుత సీబీఐ దర్యాప్తు కోరిన జగన్, అధికారంలోకి రాగానే ఎందుకు మాటమార్చారని ప్రశ్నించారు. బాబాయ్ కూతురు, చెల్లెలు వైఎస్ సునీత ఎన్ని పర్యాయాలు కోరినా, వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అవసరం లేదని చెప్పలేదా.. అని నిలదీశారు. బయటకూర్చొని మాట్లాడడం సరికాదని, అసెంబ్లీ వేదికగా చర్చ జరిపి ఉంటే వాస్తవాలు ప్రజలకు తెలిసేవని మంత్రి అన్నారు.

**మా మనస్సులను బాధపెట్టొద్దు : మహిళా టీచర్ జ్యోతి**

పెనుకొండలో టీచర్ గా పనిచేస్తున్నాను.. నా పిల్లల సాక్షిగా చెబుతున్నా... కష్టపడి మెగా ఎస్సీలో ఉద్యోగం సాధించానని మహిళా టీచర్ జ్యోతి తెలిపారు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగి ఉంటే తనతో పాటు తన తమ్ముడికీ ఉద్యోగం వచ్చేది కదా..అని పశ్నించారు. మెగా డీఎస్సీ కోసం ఎంతో కష్టపడి చదవానని, తాను రెండు పోస్టులకు అర్హత సాధించానని తెలిపారు. తమ కష్టాన్ని తక్కువ చేసి మాట్లాడడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా తమ మనస్సులు బాధపెట్టడం సరికాదని జగన్ నుద్దేశించి మహిళా టీచర్ జ్యోతి కోరారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ.. తాను వ్యవసాయ కుటుంబానికి చెందినవాడినని, అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ డీఎస్సీకి సిద్ధమయ్యానని తెలిపారు. కుటుంబ బాధ్యతలను చూసుకుంటూనే ఎంతో కష్టపడి ఉద్యోగాన్ని సాధించానన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అందించిన డీఎస్సీ కోచింగ్ తనకు ఎంతో ఉపయోగపడిందని గంగాధర్ తెలిపారు.

## అమరావతి రైతుల రిటర్న్‌బుల్ ప్లాట్లలో...

# శరవేగంగా అభివృద్ధి పనులు

- మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి
- రాజధాని రైతుల కుటుంబంలో నేనూ ఒకడిగా ఉండి ల్యాండ్ పూలింగ్ చేశాను
- తుళ్లూరు శివాలయ పునఃశంకుస్థాపన మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేసిన మంత్రి
- రైతుల త్యాగాలతోనే అమరావతి తిరిగి రాజధానిగా మారిందని ఉద్ఘాటన

అమరావతి (చైతన్యరథం): రాజధాని నిర్మాణం కోసం చేపట్టిన ల్యాండ్ పూలింగ్ సమయంలో తాను రాజధాని రైతుల కుటుంబంలో ఒకడిగా ఉండి వారితో కలిసి పనిచేశానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. రైతులతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ల్యాండ్ పూలింగ్ సమయంలో ఉదయం నుంచి రాత్రి వరకు రైతుల మధ్యే ఉండి పనిచేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. రైతుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే అమరావతి తిరిగి రాష్ట్ర రాజధానిగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. శుక్రవారం తుళ్లూరులో శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీబాల కోటేశ్వరస్వామి వార్ల ఆలయ పునఃశంకుస్థాపన మహోత్సవానికి మంత్రి నారాయణ హాజరయ్యారు. ప్రభుత్వ సహకారంతో గ్రామస్తులు ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న నేపథ్యంలో ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తుళ్లూరు శివాలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. ఈ ప్రాంతానికి పురాతన చరిత్ర ఉందని, అలాంటి చారిత్రక ఆలయాన్ని తిరిగి నిర్మించడం సంతోషకరమని పేర్కొన్నారు.

### రైతులతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మంత్రి

రాజధాని ల్యాండ్ పూలింగ్‌లో తుళ్లూరు రైతులు ఎంతో సహకరించారని మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని రైతుల కుటుంబంలో నేనూ ఒకడిగా ఉండి పూలింగ్ చేశానని ఆయన పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ సమయంలో రైతులతో తనకు ఏర్పడిన అనుబంధాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రైతుల మధ్యే ఉండి పనిచేశానని, ఒకరి ఇంట్లో అల్పాహారం, మరొకరి ఇంట్లో భోజనం, ఇంకొకరి ఇంట్లో సాయంత్రం స్నాక్స్, మరో రైతు ఇంట్లో రాత్రి భోజనం చేసేంతగా వారితో అనుబంధం ఏర్పడిందని తెలిపారు. గతాన్ని ఎప్పటికీ మర్చిపోకూడదని, అమరావతి కోసం రైతులు ఏ ఉద్దేశంతో తమ భూములను ఇచ్చారో ఆ ఉద్దేశం నెరవేరాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి నారాయణ అన్నారు.

### రైతుల పోరాటానికి తుళ్లూరు ఆలయం సాక్ష్యం

అమరావతి రాజధాని కోసం రైతులు చేసిన పోరాటంలో తుళ్లూరు శివాలయం కీలక స్థలంగా నిలిచిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఇదే పవిత్రమైన ఆలయం నుంచి రైతులు 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' పాదయాత్రను ప్రారంభించారని గుర్తు చేశారు. రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు నాటి ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు, ఒత్తిళ్లు ఎదుర్కొన్నారని మంత్రి అన్నారు. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకుండా అమరావతి కోసం పోరాడారని తెలిపారు. రైతులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే అమరావతి తిరిగి రాష్ట్ర రాజధానిగా మారిందని, ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ అన్నారు. అమరావతి కోసం పోరాడిన ప్రతి రైతు సోదరుడికి ఈ సందర్భంగా మరోసారి అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

### రైతుల రిటర్న్‌బుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగవంతం

అమరావతిలో రైతులకు కేటాయించిన రిటర్న్‌బుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. రోడ్లు, ఇతర ప్రాథమిక మౌలిక వసతుల పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

రాజధానిలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పనులను ప్రాజెక్టుల వారీగా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### ప్రాజెక్టుల వారీగా రాజధాని అభివృద్ధి

రాజధానిలో ప్రస్తుతం ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులపై దృష్టి పెట్టినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ప్రాజెక్టుల అవసరాలకు అనుగుణంగా ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఆయా ప్రాజెక్టులకు అవసరమైన భూముల సమీకరణ పూర్తిచేసి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

### సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఎలివేటెడ్ కారిడార్



సీడ్ యాక్సెస్ రోడ్డును నేషనల్ హైవేతో అనుసంధానించే మూడో విడత నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. వచ్చే శనివారం సీడ్ యాక్సెస్ రోడ్డును నేషనల్ హైవేతో కలిపే మూడో విడత నిర్మాణ పనులు, ఎలివేటెడ్ కారిడార్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. పనులు వేగంగా జరిగేలా అవసరమైన యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అమరావతిలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, రైతులు రాజధాని కోసం చేసిన త్యాగాలకు తగిన ఫలితం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి నారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీపీఎస్సీ, డీఎస్సీ... తేడా తెలుసుకో

- జగన్‌కు శాప్ ఛైర్మన్ రవినాయుడు హితవు
- ప్రెస్‌మీట్‌లో గొడ్డలి పార్టీ అధినేత చెప్పినవన్నీ అబద్ధాలే
- వివేకా హత్య, గ్రూప్ వన్ పరీక్షలపై సీబీఐ విచారణ అడగాలి



తిరుపతి (చైతన్యరథం): నిజాలు మాట్లాడితే తల వేయి ముక్కలవుతుందని, ఎప్పుడూ నిజాలు చెప్పవద్దని పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డికి అతని తండ్రి సూచించాడని శాప్ ఛైర్మన్ రవినాయుడు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమేనని స్వయంగా డీఎస్సీ అభ్యర్థులు, ఆ ప్రక్రియలో భాగస్వామ్యం అయిన అధికారులు స్పష్టంగా చెబుతున్నా పదే పదే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రవినాయుడు మాట్లాడారు. జగన్ హయాంలో గ్రామ సచివాలయ ఉద్యోగాలకు సంబంధించి దరఖాస్తు చేసిన వారందరికీ ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేదని, సచివాలయ ఉద్యోగుల నియామకాలలో తీసుకొన్న కమీషన్ పదివేల కోట్లు రూపాయలు ఎవరి దగ్గరికి వెళ్ళాయో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగాల నియామకాలు, డీఎస్సీ నియామకాల పైన చర్చకు సిద్ధమని అన్నారు. టెట్ క్వాలిఫై అయిన వారికి మాత్రమే టీచర్ ఉద్యోగాలు ఇవ్వారన్నారు. ఏ ప్రక్రియలో, ఏ సంస్థ ద్వారా ఉద్యోగాలు వస్తాయో తెలియని జగన్ ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేయడం సిగ్గుచేటన్నారు.

కరోనా ముసుగులో చేయాల్సిన అవినీతి మొత్తం చేసేశాడని జగన్‌పై రవినాయుడు ధ్వజమెత్తారు. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను జగన్ పారదర్శకంగా భర్తీ చేయటమేమిటని రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని, పత్రికా సమావేశాల ద్వారా జగన్ రెడ్డి తన టాలెంట్ ను తనే బయట పెట్టుకుంటున్నారన్నారు. ఏపీపీఎస్సీ ని భ్రష్టు పట్టించిన వ్యక్తి జగన్ అన్నారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడాను జగన్ తెలుసుకోవాలన్నారు. జగన్ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్1 పరీక్షలకు సంబంధించి హైకోర్టు నియమించిన సిట్ నివేదికలో నిజాలు బయటపడుతున్న కొద్దీ కూటమి ప్రభుత్వ హయాంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. జగన్ ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వివేక హత్య కేసు విషయంలో, పరకామణి చోరీ విషయమై, లడ్డు కల్తీ, టి డి ఆర్ బాండ్ల విషయంలో, గ్రూప్ వన్ పై ఎందుకు సిబిఐ ఎంక్వైరీ అడగలేదని ప్రశ్నించారు. 2016లో ప్రజా ప్రభుత్వం పీవీ సింధుకు గ్రూప్ వన్ పోస్ట్ ఇచ్చిందని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను అదే తరహా లో గుర్తించాలని చెప్పారే తప్ప అందరికీ గ్రూప్ వన్ ఉద్యోగాలు ఇవ్వాలనే ఉద్దేశం కాదన్నారు. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. జగన్ ఆడే పబ్జీ గేమ్ స్పోర్ట్స్ కోటాలో లేనందువలన ఈ రాద్ధాంతం అంతా చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఇచ్చిన మాట ప్రకారం పారదర్శకంగా నిరుద్యోగుల కోసం కూటమి ప్రభుత్వ హయాంలో మంత్రి నారా లోకేష్ సారథ్యంలో నిరుద్యోగుల కోసం ప్రతి సంవత్సరం డీఎస్సీ నియామకాలు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఇంటిపై ఎప్పుడో ఈడీ సోదాలు చేసి ఉంటే బాగుండేదని, ఈడీ సోదాలు చేసి, అవినీతి సొమ్ము ఎక్కడెక్కడ దాచి పెట్టారో కక్కించాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీ తాతయ్య గుంట గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, గంగమ్మ గుడి డైరెక్టర్ వినుకొండ వెంకట్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ వి ఎం శ్రీధర్, తెలుగు యువత నాయకులు కొట్టే హేమంత్ రాయల్, గంగమ్మ గుడి మాజీ డైరెక్టర్ గంజి సుధాకర్ రెడ్డి, ముని రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేరళం రాష్ట్రానికి పవన్ కళ్యాణ్

- వైద్యుల సూచన మేరకు భుజానికి ఆయుర్వేద థెరపీ



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం కేరళం రాష్ట్రానికి వెళ్లనున్నారు. ఇటీవల ముంబైలో కుడి భుజం రొటేటర్ కఫ్ గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆయన, వైద్యుల సూచన మేరకు తదుపరి చికిత్సల్లో భాగంగా ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు. శస్త్ర చికిత్స అనంతరం వైద్యులు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. కొంతకాలం బహిరంగ కార్యక్రమాలు, విధులకి దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. పాలనా బాధ్యతల దృష్ట్యా వారం రోజుల్లోనే పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయానికి అందుబాటులోకి వచ్చారు. ముందస్తుగా ఖరారైన ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడం, వరుసగా శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను నిర్వహించడం చేశారు. ఈ క్రమంలో శస్త్ర చికిత్స చేసిన భుజం భాగంలో వాపు పెరగడంతోపాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చింది. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు భుజం పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కేరళంలో ప్రత్యేక ఆయుర్వేద థెరపీ చేయించుకోనున్నారు.

# దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యత

- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టీకరణ
- ఇంద్రకీలాద్రిపై రూ.52.50 కోట్లతో నిర్మించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం, శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం ప్రారంభం
- రెండో ఘాట్ రోడ్డు, శాశ్వత మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటుకు కార్యాచరణ
- రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు
- భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించిన మంత్రి ఆనం, ఎంపీ కేశినేని చిన్ని



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రూ.52.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం, శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనాలను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అంతకుముందు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారులు, ఉన్నతాధికారులతో కలిసి నూతన భవనాలను భక్తులకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంద్రకీలాద్రి ఆలయ సమగ్ర అభివృద్ధితో పాటు భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఇంద్రకీలాద్రిపై ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు అత్యవసర సమయాల్లో రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా రెండో ఘాట్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. కుమ్మరిపాలెం నుంచి సుమారు 700 మీటర్ల మేర రెండో ఘాట్ రోడ్డు నిర్మించే ప్రతిపాదనపై ఇప్పటికే ఆర్అండ్‌బీ శాఖ, కన్సల్టెన్సీ సంస్థ ద్వారా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. త్వరితగతిన నివేదికలు సిద్ధం చేసి తదుపరి కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

**టీటీడీ స్థలంలో ఏడు అంతస్తుల మల్టీ లెవెల్ భవనం**

కుమ్మరిపాలెంలో ఉన్న సుమారు 3 ఎకరాల టీటీడీ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఆ స్థలంలో ఏడు అంతస్తుల మల్టీ లెవెల్ భవనం నిర్మించి, మల్టీ లెవెల్ పార్కింగ్‌తో పాటు భక్తుల కోసం వసతి గదులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ భవనం ద్వారా ఒకేసారి సుమారు 15 వేల మంది భక్తులకు ప్రయోజనం కలిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

**నూతన కేశఖండనశాల**

దుర్గాఘాట్ సమీపంలో భక్తుల సౌకర్యార్థం నూతన భారీ కేశఖండనశాల నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం సమీపంలోని కార్పొరేషన్ స్థలాన్ని కూడా వినియోగించుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

అలాగే ప్రస్తుత ఘాట్ రోడ్డులోని మొదటి మలుపు వద్ద సుమారు 25 అడుగుల ఎత్తైన ఆదిశంకరాచార్యుల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు**

త్వరలో జరగనున్న ప్రతిష్ఠాత్మక దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దేవస్థానం, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, తదితర శాఖల సమన్వయంతో ఉత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నామని చెప్పారు. క్యూ లైన్లలో భక్తులకు నిరంతర తాగునీటి సరఫరా, పాలు, ప్రసాదాల పంపిణీ, పారిశుద్ధ్యం, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**అన్నప్రసాదం వడ్డించిన మంత్రి, ఎంపీ**

నూతనంగా ప్రారంభించిన శ్రీకనకదుర్గ అన్నప్రసాద సదనంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విజయవాడ లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), తదితరులు భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు. అనంతరం ప్రసాద విక్రయ కౌంటర్‌లో నగదు చెల్లించి అమ్మవారి లడ్డూ ప్రసాదాలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కొనుగోలు చేశారు.

**రూ.26 కోట్లతో 'శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం'**

రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద సదనం మొత్తం 5,400 చదరపు మీటర్ల (సుమారు 58,125 చదరపు అడుగుల) విస్తీర్ణంలో నిర్మితమైంది. భవనం మొదటి అంతస్తులోని భోజనశాలలో ఒకే విడతలో 800 మంది భక్తులు కూర్చుని భోజనం చేసే సదుపాయం కల్పించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సెంట్రల్ స్టోర్, వంటకు అవసరమైన ప్రిపరేషన్ ఏరియా, వాష్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు. మూడు వైపుల నుంచి వాహనాల రాకపోకలకు అనువుగా మార్గాలను కూడా నిర్మించారు.

**రూ.26.50 కోట్లతో 'శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం'**

రూ.26.50 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ దుర్గా భవాని మహాప్రసాద భవనం మొత్తం 3,600 చదరపు మీటర్ల (సుమారు 38,748 చదరపు అడుగుల) విస్తీర్ణంలో నాలుగు అంతస్తులుగా నిర్మించారు. గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో ప్రసాద విక్రయ కౌంటర్లు, భక్తుల కోసం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. రెండో, మూడో అంతస్తుల్లో పులిహోర, చక్కెరపొంగలి, లడ్డూల తయారీ, ప్యాకింగ్, నిల్వకు ఆధునిక సదుపాయాలు కల్పించారు.

**త్వరలో యాంత్రీకృత వంటశాలలు**

భవిష్యత్‌లో పెరిగే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అత్యున్నత పరిశుభ్రతా ప్రమాణాలతో తక్కువ సమయంలో అధిక పరిమాణంలో అన్నప్రసాదాలు, ప్రసాదాలను సిద్ధం చేసేందుకు ఈ రెండు భవనాల్లో త్వరలోనే యాంత్రీకృత వంటశాలలను (మెకనైజ్డ్ కిచెన్లు) అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇంజనీరింగ్ అధికారులు, దేవస్థానం సిబ్బంది, వేద పండితులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ బస్సులో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు మంత్రి మండిపల్లి



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నంలోని హుడా పార్కు నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నూతనంగా ప్రారంభించిన ఎలక్ట్రిక్ బస్సులో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ప్రయాణించారు. పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన రవాణా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, పలువురు రవాణా అధికారులు ఉన్నారు.

## 26వ రోజూ విజయవంతంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 2,50,129 ఇళ్లను సందర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- మొత్తంగా 74.30 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- ప్రజా భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా కార్యక్రమం



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 26వ రోజు శుక్రవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. 26వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 2,50,129 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 74.30 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించారు. ప్రతీ గడపకు వెళ్లి ప్రతీ కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసి వారికి అందుతున్న ప్రయోజనాలను వివరించడంతో పాటు రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను ఆయా కుటుంబాలకు వివరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యమవుతున్నారు.

## అసెంబ్లీకి రారు.. జీతాలు మాత్రం కావాలి

- సభను ఎదుర్కొనే దమ్ము లేకనే పరార్
- వైసీపీ ఎమ్మెల్యేలపై చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆగ్రహం



అమరావతి (చైతన్యరథం): వైసీపీకి ఎందిన 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు ఎందుకు రాలేదని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సూటిగా ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చర్చకు దూరంగా ఎందుకు ఉన్నారని నిలదీశారు. అసెంబ్లీకి రాకపోయినా జీతాలు తీసుకుంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను ఎదుర్కొనే దమ్ము లేకే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ నుంచి పారిపోయి పులివెందుల పిల్లల్లా మారారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దేవాలయం లాంటి అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ము వైసీపీ ఎమ్మెల్యేలకు లేదని ఘాటుగా విమర్శించారు. డీఎస్సీపై మంత్రి లోకేష్ బయటపెట్టిన వాస్తవాలతో వైసీపీ నేతకు మైండ్ బ్లాక్ అయిందన్నారు. నాలుగు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో వివిధ అంశాలపై అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. 25 గంటల 15 నిమిషాల పాటు కొనసాగిన సభలో 103 మంది సభ్యులు ప్రసంగించారన్నారు. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు కూడా హాజరై ఉంటే 114 మంది మాట్లాడేవారన్న జీవీ అన్నారు. తమ బండారం బయటపడుతుందనే భయంతోనే అసెంబ్లీకి దూరంగా ఉంటూ శాసనమండలిలో మాత్రం గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఏపీపీఎస్సీకి.. డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి ఐదేళ్ల సీఎంగా ఉండటం విడ్డూరమన్నారు. ఏపీపీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పాల్సి వస్తుందనే తాడేపల్లి ప్యాలెస్‌లో దాక్కున్నారని గొడ్డలి పార్టీ అధినేత జగన్‌పై జీవీ ఆంజనేయులు ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ‘పీడకల’గా మండలిలో నా మొదటి రోజు!

- **ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆవేదన**
- **పెద్దల సభ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్న వైసీపీ ఎమ్మెల్సీలు**
- **దళిత చైర్మన్‌ను అవమానిస్తూ మండలి గౌరవం మంటగలుపుతున్నారు**
- **జగన్ రెడ్డి మెప్పు కోసమే వైసీపీ ఎమ్మెల్సీల వీరంగాలు**
- **పద్ధతి మార్చుకుని సభ హుందాతనాన్ని నిలబెట్టాలి**
- **డీఎస్సీపై మంత్రి లోకేష్, అధికారులు ఎంతగా వివరించినా తప్పుడు ఆరోపణలు మానని వైసీపీ ఎమ్మెల్సీలు**
- **ఎన్ని పిటిషన్లు వేసిన హైకోర్టు చర్చకు తీసుకోలేదంటే కారణం అర్థం చేసుకోలేని అవగాహన రాహిత్యుడు జగన్**
- **చర్చిద్దాం రమ్మని మంత్రి లోకేష్ ఆహ్వానిస్తున్నా ఇంకా ఎందుకీ రాద్ధాంతం**
- **పెద్దల సభకు నన్ను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఆమోదించిన గవర్నర్‌కి కృతజ్ఞతలు**



అమరావతి (చైతన్యరథం): శాసన మండలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు వ్యవహరిస్తున్న తీరు తనను తీవ్రంగా బాధించిందని నూతనంగా ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. పెద్దల సభగా పిలిచే శాసన మండలిలో చర్చలు, సమీక్షలు, బిల్లులపై సూచనలు జరగాల్సి ఉండగా.. నినాదాలు, అరుపులు, ప్లకార్డులు, గందరగోళంతో సభా కార్యకలాపాలను అడ్డుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ప్రతిపాదించారని, గవర్నర్ ఆ ప్రతిపాదనను ఆమోదించారని వర్ల రామయ్య తెలిపారు. ఇటీవలే తాను శాసన మండలి చైర్మన్ మోషెన్ రాజు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశానని చెప్పారు. అయితే, తాను ప్రమాణ స్వీకారం చేసిన రోజున సభ వాయిదా పడటంతో ఎలాంటి కార్యకలాపాలు జరగలేదన్నారు.

ఎమ్మెల్సీగా తొలి రోజు తాను శాసన మండలిలో అడుగుపెట్టినప్పుడు సభలో పెద్ద ఎత్తున గందరగోళం కనిపించిందని రామయ్య చెప్పారు. కొత్త సభ్యుడిగా తనకు ఏదైనా స్వాగతం పలుకుతున్నారేమోనని తొలుత భావించానని, అయితే పరిస్థితిని గమనించిన తర్వాత వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ, పెద్దగా అరుస్తూ సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగిస్తున్నారని తెలిసిందన్నారు. చైర్మన్ మోషెన్ రాజు కుర్చీలో కూర్చున్న సమయంలో ఆయనకు ఇరువైపులా వైసీపీ ఎమ్మెల్సీలు నిలబడి పెద్దపెద్ద నినాదాలు చేశారని ఆయన తప్పుబట్టారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని చైర్మన్ ముఖానికి అడ్డంగా పెట్టారని, ఆయన మైక్రోఫోన్ వద్దకు వెళ్లి తమ డిమాండ్లను చెప్పేందుకు కూడా అవకాశం లేకుండా చేశారని అన్నారు. చైర్మన్ ముఖానికి ప్లకార్డు అడ్డుగా పెడితే ఆయనకు ఏమైనా కనిపిస్తుందా?" అని రామయ్య ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి ఎంపిక చేసిన ఎమ్మెల్సీలే ఈ విధంగా సభలో వ్యవహరిస్తున్నారన్నారు.

**వైసీపీ ఎమ్మెల్సీల తీరుపై తీవ్ర ఆగ్రహం**

పెద్దల సభకు సభ్యులను ఎంపిక చేసేటప్పుడు వారి వయసును మాత్రమే కాకుండా వారి నడవడిక, మాట తీరు, వ్యవహారశైలి, సభను గౌరవించే విధానం, ఇతరులను గౌరవించే సంస్కారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని వర్ల సూచించారు. 25 లేదా 30 ఏళ్ల వయసున్న వ్యక్తి కూడా తన ప్రవర్తన ద్వారా పెద్దమనిషిగా నిలవవచ్చని, పెద్దరికం వయసుతో మాత్రమే రాదని చెప్పారు. శాసన మండలి అంటే ఏమిటో ప్రతి సభ్యుడు తెలుసుకోవాలని రామయ్య అన్నారు. ద్విసభ్య శాసన వ్యవస్థలో శాసన మండలి ఎగువ సభగా పనిచేస్తుందని, శాసనసభలో ఆమోదించిన బిల్లులను సమీక్షించడం, వాటిపై చర్చించడం, అవసరమైన మార్పులు, మెరుగుదలను సూచించడం మండలి ప్రధాన బాధ్యతల్లో ఒకటని వివరించారు. ఉదాహరణగా, శాసనసభలో అమరావతిలో సాయంత్రం ఆరు గంటల తర్వాత పురుషులు బయట తిరగకూడదనే విధంగా ఒక బిల్లు తీసుకొచ్చి ఆమోదించారని అనుకుందామని, అది శాసన మండలికి వచ్చినప్పుడు సభ్యులు దానిని పరిశీలించి, “ఇది సరికాదు, ఈ విధంగా మార్చాలి” అని సూచించవచ్చన్నారు. ఆ సూచనల ఆధారంగా బిల్లును సవరించి తిరిగి శాసనసభకు పంపవచ్చని వివరించారు. ఇంతటి బాధ్యత కలిగిన పెద్దల సభలో చిన్నపిల్లల మాదిరిగా, అల్లరి మూకల్లా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తన మొదటి రోజు అనుభవం తాను ఊహించిన శాసన మండలికి పూర్తిగా భిన్నంగా ఉందని రామయ్య అన్నారు. చర్చల్లో పాల్గొని, ప్రజా సమస్యలపై మాట్లాడాలని భావించి సభకు వెళ్లిన తనకు చర్చలు, డిబేట్లు కనిపించలేదని, జగన్ మోహన్ రెడ్డి బృందం చేస్తున్న అల్లరి మాత్రమే కనిపించిందని విమర్శించారు. వైసీపీ సభ్యులు సభలో నినాదాలు చేస్తూ సెల్ఫీలు తీసుకుని వాటిని జగన్ మోహన్ రెడ్డికి పంపుతున్నారని కూడా ఆయన ఆరోపించారు. సార్.. నేను ఇంత పెద్దగా అరిచాను, సార్.. చైర్మన్‌కు అడ్డుగా ప్లకార్డు పెట్టాను.. అంటూ ఫొటోలు, సెల్ఫీలు పంపుతున్నారని, వాటికి జగన్ నుంచి “వెరీ గుడ్, యూ ఆర్ పాస్” అన్నట్లుగా ప్రోత్సాహం లభిస్తోందని వ్యాఖ్యానించారు. సభను అడ్డుకోవడానికే సభ్యులను పంపించారా అని వర్ల ప్రశ్నించారు.

**పెద్దల సభ ప్రాముఖ్యత, బాధ్యతలు తెలుసుకుని మెలగాలి**

రాజ్యాంగంలోని 169, 171 అధికరణలను చదవాలని జగన్ మోహన్ రెడ్డికి, ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు వర్ల రామయ్య సూచించారు. పెద్దల సభకు సభ్యులను ఎంపిక చేసే సమయంలో ఎంతో ఆచితూచి వ్యవహరించాలన్నారు. దళితులపై దాడులు చేసినవారు, కుటుంబ వ్యవస్థలను నాశనం చేసినవారు, రౌడీషీటర్లు వంటి వ్యక్తులను పెద్దల సభకు పంపడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. శాసన మండలిలో మంత్రి నారా లోకేష్‌నుద్దేశించి వైసీపీ సభ్యులు అవమానకరంగా సైగలు చేస్తూ, అసభ్యకరమైన రీతిలో వ్యవహరిస్తున్నారని రామయ్య ఆరోపించారు. సభలో అసభ్యకరమైన, పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధమైన భాషకు స్థానం లేదని అన్నారు. తనతో కొంతమంది వైసీపీ ఎమ్మెల్సీలు వ్యక్తిగతంగా మాట్లాడారని, వారి పేర్లు చెప్పడం మర్యాద కాదని రామయ్య తెలిపారు. అన్నా.. ఇది మాకు రోజూ ఉండేదేనా? కౌన్సిల్‌లో మాకు ఇదేనా పని? అని వారు తనను అడిగారని చెప్పారు. దీన్ని బట్టి సభను అడ్డుకోవడం, చర్చలు, డిబేట్లు, సమీక్షలు జరగకుండా చేయడం వెనుక నాయకత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. భారతదేశంలో ఎవరైనా రాజ్యాంగబద్ధంగానే నడుచుకోవాలి.

ఆర్టికల్ 169 ప్రకారం శాసనమండలి అనేది బిల్లులను లోతుగా పరిశీలించి, సమగ్ర చర్చ జరిపి, తగిన మార్పులను సూచించే సమీక్షా సభ. కానీ, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన సభను వైఎస్ జగన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం అల్లరిపాలు చేస్తున్నారు. యువ నాయకుడు నారా లోకేష్ ప్రజల్లోకి విస్తృతంగా వెళుతుంటే వస్తున్న ప్రజాదరణను చూసి వైఎస్ జగన్, ఆయన పార్టీ నేతలు తట్టుకోలేకపోతున్నారు. లోకేష్‌పై ఉన్న ద్వేషం, ఈర్ష్య, ఆక్రోశాన్ని తట్టుకోలేక సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. ‘గొడ్డలి రాజకీయం’ ఎవరిదో, ఎవరికి నష్టం చేసిందో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసు. ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలను ఇప్పటికైనా వైసీపీ మానుకోవాలి. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించి సభ సజావుగా సాగేందుకు సహకరించాలని, నిరాధార ఆరోపణలతో ప్రజలను మోసం చేయడం ఆపాలని వర్ల హితవు పలికారు.

**మెగా డీఎస్సీపై వైసీపీ తప్పుడు ఆరోపణలు..**

మెగా డీఎస్సీలో అవినీతి జరిగిందంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలను కూడా రామయ్య తీవ్రంగా తప్పుబట్టారు. సంబంధిత శాఖ మంత్రి నారా లోకేష్ బహిరంగంగా చర్చకు రావాలని సవాల్ చేశారని, ఎవరికైనా సందేహాలుంటే చర్చిద్దామని, అన్నింటి గురించి స్పష్టంగా వివరిస్తానని గుర్తుచేశారు. అయితే ఆ సవాల్‌ను వైసీపీ నేతలు స్వీకరించలేదన్నారు. మెగా డీఎస్సీపై వైసీపీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు ఇప్పటికే సమాధానాలు ఇచ్చారని రామయ్య చెప్పారు. చీఫ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ అజయ్ జైన్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, సచివాలయ సంబంధిత అధికారులు, శాఫ్ ఎండీతో పాటు ఇతర సీనియర్ అధికారులు మీడియా సమావేశాలు నిర్వహించి ఎక్కడా అవినీతి జరగలేదని స్పష్టం చేశారని తెలిపారు. ఇటీవల ఇద్దరు మహిళా అధికారులు కూడా మీడియా సమావేశం నిర్వహించి డీఎస్సీకి సంబంధించిన అంశాలను చాలా స్పష్టంగా వివరించారని చెప్పారు. ఎవరికైనా ఇంకా అనుమానాలు ఉంటే ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో ఉంటామని, వచ్చి తమ వద్ద సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆ అధికారులు చెప్పారని రామయ్య పేర్కొన్నారు. ఆరోపణలు చేస్తున్నవారు కనీసం ఆ అధికారులను కలిసి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. ఏడాది క్రితం ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులను కూడా తప్పుడు ఆరోపణలతో వైసీపీ మానసికంగా వేధిస్తోందని రామయ్య విమర్శించారు. ఉద్యోగం వచ్చి ఏడాది అయినా సంతోషంగా ఉండలేకపోతున్నామని, జగన్ మోహన్ రెడ్డి తమ ఉద్యోగాలు పోతాయంటూ భయపెడుతున్నారని ఒక యువతి ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

ఒకవేళ ప్రభుత్వ నిర్ణయంలో తప్పు ఉందని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని భావిస్తే కోర్టును ఆశ్రయించాలని అన్నారు. డీఎస్సీ అంశంపై 341 పిటిషన్లు దాఖలయ్యాయని, ఆ పిటిషన్లన్నింటినీ న్యాయస్థానం కొట్టివేసిందని రామయ్య తెలిపారు. ఆధారాలు ఉంటే కోర్టుకు వెళ్లాలని, కానీ ఆధారాలు లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడి అభ్యర్థులను, ఉపాధ్యాయులను, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేయడం సరికాదన్నారు.

**పెద్దల సభ గౌరవాన్ని దిగజారుస్తున్న వైసీపీ**

శాసన మండలి చైర్మన్ మోషెన్ రాజును వైసీపీ సభ్యులు ఇబ్బంది పెట్టిన తీరు తనకు మరింత బాధ కలిగించిందని రామయ్య చెప్పారు. దళిత వర్గానికి చెందిన చైర్మన్ సభను నడిపేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన ముఖానికి ప్లకార్డులు అడ్డుపెట్టి, మైక్రోఫోన్ వద్దకు వెళ్లి నినాదాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చైర్మన్ వయసు, స్థానం, బాధ్యతలను కూడా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారమే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, తాను అయినా, జగన్ అయినా, మరెవరైనా రాజ్యాంగానికి మించి వెళ్లలేరని రామయ్య అన్నారు.

ఆర్టికల్ 169 ప్రకారం శాసన మండలి అనేది చట్టాలను సమీక్షించే, బిల్లులను నిశితంగా పరిశీలించే, వాటిపై చర్చించి చట్టాలుగా మారే ముందు అవసరమైన మెరుగుదలను సూచించే సభ అని పేర్కొన్నారు. అలాంటి సభను జగన్ మోహన్ రెడ్డి తన వ్యక్తిగత రాజకీయ స్వార్థం, ఈర్ష్య, ఆక్రోశం కోసం తప్పుదోవ పట్టించకూడదన్నారు. తన పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉందని వైసీపీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించకూడదని రామయ్య హెచ్చరించారు. సభలో టీడీపీ వైపు సభ్యుల సంఖ్య తక్కువగా ఉన్నా తాము ధర్మం, ప్రజల పక్షాన ఉన్నామని చెప్పారు.

మహాభారతంలోని పాండవులు ఐదుగురే ఉన్నా చివరకు ధర్మమే గెలిచిందని, కౌరవులు వంద మంది ఉన్నా వారి పతనం తప్పలేదని ఉదాహరణగా చెప్పారు. ప్రజా వ్యతిరేకంగా వ్యవహరిస్తే వైసీపీకి కూడా పతనం తప్పదన్నారు. తన మొదటి రోజు అనుభవాన్ని “పీడకల”గా అభివర్ణించిన రామయ్య, భవిష్యత్తులో అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ ఎమ్మెల్సీలకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వాలని కోరారు.

**వైసీపీ ఎమ్మెల్సీలు హుందాగా వ్యవహరించాలి**

రానున్న శాసన మండలి సమావేశాల నుంచి వైసీపీ ఎమ్మెల్సీలు మారిన మనుషుల్లా, పెద్దల సభ సభ్యుల్లా వ్యవహరించాలని సూచించారు. వైసీపీకి చెందిన కొంతమంది ఎమ్మెల్సీలకు కూడా ఇప్పుడు శాసన మండలి అంటే ఏమిటి, పెద్దల సభలో ఎలా వ్యవహరించాలో అర్థమైనట్లుగానే తనకు అనిపిస్తోందని రామయ్య అన్నారు. జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ సభ్యులను తీర్చిదిద్ది, సభ గౌరవాన్ని కాపాడే విధంగా వ్యవహరించేలా ఆదేశించాలని కోరారు. తనతో పాటు సహచర ఎమ్మెల్సీ రమాదేవికి కూడా తొలి రోజున సభలో తమను పరిచయం చేసుకునే అవకాశం రాలేదని రామయ్య చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలోనే వైసీపీ సభ్యులు పైకి వెళ్లి చైర్మన్‌ను ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేపట్టారన్నారు. తనకు మొదటి రోజే మాట్లాడే అవకాశం రాలేదని, అయితే దాని గురించి తాను బాధపడటం లేదని చెప్పారు. మరో రోజు అవకాశం వస్తుందని, అయితే సభలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరు మాత్రం తప్పని స్పష్టం చేశారు. శాసన మండలి రాబోయే రోజుల్లో నిజమైన “పెద్దల సభ”గా గౌరవంగా, సజావుగా పనిచేసేలా వైసీపీ సహకరించాలని వర్ల రామయ్య కోరారు. సభా నియమాలు, రాజ్యాంగ నిబంధనలు పాటించాలని, చర్చలకు అవకాశం కల్పించాలని, సభ్యత, సంస్కారం, ఇతర సభ్యుల పట్ల గౌరవం ప్రదర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని, తన పార్టీ ఎమ్మెల్సీలను కూడా అదే విధంగా మార్చాలని వర్ల రామయ్య కోరారు.



# విద్యా వెలుగులు

## 'అక్షర ఆంధ్ర'తో నవశకం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్చుకుని ఆత్మవిశ్వాసంతో జీవించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. ఆ దిశగా విద్య, సమాచార-సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం గత రెండేళ్లలో వయోజన అక్షరాస్యత ఉద్యమానికి కొత్త ఊపునిచ్చింది. ఇది కేవలం చదువు నేర్పే కార్యక్రమంగా కాకుండా ప్రతి వ్యక్తినీ ఆర్థికంగా, సాంకేతికంగా, సామాజికంగా మరింత బలోపేతం చేసే ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది.

### ప్రతి ఇంటికీ డిజిటల్, ఆర్థిక స్వావలంబన
### సీఎం చంద్రబాబు విజన్, మంత్రి లోకేష్ చొరవతో మారిన లక్షలాది మంది జీవితాలు
### సాంకేతికత జోడించి, వయోజన అక్షరాస్యతలో దేశానికే ఆదర్శంగా ఏపీ

15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు గల నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు నేర్పించే లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యాచరణ చేపట్టింది. 2029 నాటికి సంపూర్ణ వయోజన అక్షరాస్యత సాధించాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం 25 లక్షల మందికి అక్షరాస్యత అందించే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందులో మహిళలు, కూలీలు, చిరు వ్యాపారులు, వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు. గ్రామాలు, పట్టణాల్లో అందుబాటులో ఉండేలా అభ్యాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అనువైన సమయాల్లో తరగతులు నిర్వహించే విధానాన్ని అమలు చేశారు.

#### రెండేళ్లలో భారీ ప్రజా భాగస్వామ్యం

గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మంది స్వచ్ఛంద బోధకులు ముందుకు వచ్చి అక్షరాస్యత ఉద్యమంలో భాగస్వాములయ్యారు. దాదాపు 25లక్షల మంది అభ్యాసకులు ఈ కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక బోధకుడిని కేటాయించి వ్యక్తిగత శ్రద్ధతో బోధన సాగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 2.50 లక్షల అభ్యాస కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల వరకు విద్యను తీసుకెళ్లాయి. ప్రభుత్వ శాఖలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, యువత కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారు.

#### విద్యతో పాటు జీవిత నైపుణ్యాలు

అక్షర ఆంధ్ర ప్రత్యేకత ఏమిటంటే ఇది కేవలం అక్షరాలు నేర్పే కార్యక్రమం మాత్రమే కాదు. ప్రజల దైనందిన జీవితానికి ఉపయోగపడే అనేక అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చారు. అభ్యాసకులకు... చదవడం, రాయడం, ప్రాథమిక గణితం, పొదుపు, బ్యాంకింగ్‌పై అవగాహన, డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ సేవల వినియోగం, మొబైల్ ఫోన్ వినియోగ నైపుణ్యాలు మొదలైన అంశాల్లో శిక్షణ ఇచ్చారు. సులభంగా అర్థమయ్యే బోధనా విధానాలు, దృశ్యరూప పాఠాలు, అభ్యాస పుస్తకాలు ఉపయోగించి నేర్చుకోవడాన్ని సులభతరం చేశారు.

#### సాంకేతికతతో పారదర్శక అమలు

మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమాన్ని పూర్తిగా సాంకేతిక ఆధారంగా అమలు చేశారు. "అక్షర ఆంధ్ర" మొబైల్ అనువర్తనం ద్వారా అభ్యాసకుల నమోదు నుంచి వారి అభ్యాస పురోగతి వరకు ప్రతి అంశాన్నీ ప్రత్యక్షంగా పర్యవేక్షించే విధానాన్ని తీసుకొచ్చారు.

ఈ వ్యవస్థ ద్వారా... అభ్యాసకుల నమోదు, స్వచ్ఛంద బోధకుల వివరాలు, ప్రతిరోజూ హాజరు నమోదు, బోధన పురోగతి, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో సమీక్ష, తక్షణ సమాచార పర్యవేక్షణ వంటి సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కార్యక్రమం పారదర్శకంగా, వేగంగా, సమర్థంగా అమలవుతోంది.

#### ప్రభుత్వ శాఖల సమన్వయం

అక్షర ఆంధ్ర విజయానికి అనేక ప్రభుత్వ శాఖల సమిష్టి కృషి బలమైంది. పాఠశాల విద్య, ఉన్నత విద్య, గ్రామీణాభివృద్ధి, మహిళ-శిశు సంక్షేమం, పంచాయతీరాజ్, పట్టణ పేదరిక నిర్మూలన తదితర శాఖలు సమన్వయంతో పనిచేశాయి. గ్రామ సచివాలయాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి నిరక్షరాస్యులను గుర్తించి అభ్యాస కేంద్రాలకు చేర్చే బాధ్యతను నిర్వర్తించారు.

#### రెండేళ్లలో విశేష ఫలితాలు

గత రెండేళ్లలో అక్షర ఆంధ్ర కార్యక్రమం గణనీయమైన ఫలితాలు సాధించింది.

- 2.50 లక్షల మంది స్వచ్ఛంద బోధకులు సేవలు అందించారు.
- 25 లక్షల మంది అభ్యాసకులు నమోదు చేసుకున్నారు.





- 2026 మార్చి 15న నిర్వహించిన ప్రాథమిక అక్షరాస్యత పరీక్షకు 24.89 లక్షల మంది హాజరయ్యారు.
- వారిలో 24.74 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు.
- 99.39 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఫలితాలు కార్యక్రమం విజయవంతంగా అమలవుతోందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

#### జీవితాల్లో వచ్చిన మార్పు

అక్షర ఆంధ్ర వల్ల వేలాది కుటుంబాల జీవితాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. కార్యక్రమానికి ముందు... చదవలేక, సంతకం చేయలేక, బ్యాంకు పనులు చేయలేక, మొబైల్ ఉపయోగించలేక ఇబ్బందులుపడిన ఎంతోమంది ఇప్పుడు స్వయంగా పనులు చేసుకునే స్థాయికి చేరుకున్నారు.

#### అధ్యయనాల్లో...

- అక్షరాలను గుర్తించే సామర్థ్యం గణనీయంగా పెరిగింది.
- బ్యాంకులో స్వయంగా నగదు జమ చేసే వారి సంఖ్య పెరిగింది.
- నగదు ఉపసంహరణ చేసుకునే నైపుణ్యం పెరిగింది.
- వడ్డీ, పొదుపుపై అవగాహన పెరిగింది.
- డిజిటల్ చెల్లింపుల వినియోగం విస్తరించింది.
- బ్యాంకు సందేశాలు చదివే సామర్థ్యం పెరిగింది.
- మొబైల్ వినియోగంపై విశ్వాసం పెరిగింది. దీంతో అక్షరాస్యతతో పాటు ఆర్థిక స్వావలంబన కూడా పెరుగుతోంది.

#### దేశానికే ఆదర్శంగా నిలిచిన కార్యక్రమం

అక్షర ఆంధ్ర కార్యక్రమం అమలును కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది. కార్యక్రమ ఫలితాలను పరిశీలించిన అనంతరం వచ్చే సంవత్సరానికి మరింత విస్తృతంగా అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది. గత సంవత్సరంతో పోలిస్తే మరింత మంది అభ్యాసకులను చేర్చేలా కార్యాచరణ సిద్ధమైంది.

#### రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం...

- 36లక్షల మంది కొత్త అభ్యాసకులకు అక్షరాస్యత అందించడం.
- మరింత మంది స్వచ్ఛంద బోధకులను సిద్ధం చేయడం.
- ప్రతి గ్రామంలో అక్షరాస్యత ఉద్యమాన్ని బలోపేతం చేయడం
- డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతను మరింత విస్తరించడం.
- ప్రతి కుటుంబంలో కనీసం ఒక అక్షరాస్యత మార్గదర్శిని తయారుచేయడం.
- జిల్లా స్థాయిలో నిరంతర సమీక్షలు నిర్వహించడం... వంటి లక్ష్యాలతో ముందుకు సాగుతోంది.

#### జ్ఞాన సమాజంవైపు బలమైన అడుగులు

గత రెండేళ్లలో అక్షర ఆంధ్ర కార్యక్రమం రాష్ట్రంలో విద్యా విస్తరణకు కొత్త దిశను చూపించింది. అక్షరాస్యతను జీవిత నైపుణ్యాలతో అనుసంధానం చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమంగా నిలిచింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టి, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ప్రభుత్వం చేపట్టిన ఈ సంస్కరణల ఫలితంగా ప్రతి పౌరుడు చదువుకున్నవాడిగా, ప్రతి కుటుంబం సాధికారంగా, ప్రతి గ్రామం జ్ఞాన కేంద్రంగా మారే దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోంది.

"ప్రతి చేతిలో అక్షరం... ప్రతి ఇంటిలో జ్ఞానం... ప్రతి కుటుంబంలో ఆత్మవిశ్వాసం" అనే లక్ష్యంతో అక్షర ఆంధ్ర ఉద్యమం రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది. 2029 నాటికి సంపూర్ణ వయోజన అక్షరాస్యత సాధించి దేశంలోనే అక్షరాస్యతలో అగ్రగామి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలనే సంకల్పంతో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



## ప్రజా సమస్యలపై " ప్రజా దర్బార్ " నిర్వహించిన ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు ప్రకారం శ్రీకాకుళం, రణస్థలం మండలం హెడ్ క్వార్టర్ గల వారి క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలపై"ప్రజా దర్బార్" నిర్వహించి ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి తక్షణ పరిష్కారం కొరకై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ... ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు వాటిని ఒకటి రెండు వారాల గడువులో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

## ఎలక్ట్రిక్ బస్సులో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు మంత్రి మండిపల్లి

**●ఎయిర్‌పోర్ట్‌కు ఎలక్ట్రిక్ బస్సు సేవలు పరిశీలన**



విశాఖ (చైతన్యరథం): విశాఖపట్నంలోని హుడా పార్క్ నుంచి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వరకు నూతనంగా ప్రారంభించిన ఎలక్ట్రిక్ బస్సులో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రయాణించారు. పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సుల సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన రవాణా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు పలువురు రవాణా అధికారులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**● అభివృద్ధికి ప్రాధాన్యత ప్రజాదర్బార్‌లో కేశినేని శివనాథ్, బుద్దా వెంకన్న**




విజయవాడ (చైతన్యరథం): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడంతో పాటు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఇద్దరు నాయకులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో విజయవంతం కావడానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో జిల్లా లో మొదటి స్థానంలో ఉన్న పశ్చిమ నియోజకవర్గం, నిరంతర శ్రమతో ప్రస్తుతం రాష్టంలో మొదటి స్థానంలోకి చేరుకుందని తెలిపారు. కనకదుర్గమ్మ ఆశీస్సులతో శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా రూ.52 కోట్లతో అన్నప్రసాద కౌంటర్, లడ్డూ పోటు నిర్మాణ పనుల ప్రారంభోత్సవం నియోజకవర్గానికి శుభ పరిణామన్నారు. కొత్త నిర్మించిన అన్నప్రసాద కేంద్రం ద్వారా గంటకు దాదాపు 10,000 మందికి ఉచితంగా భోజనం అందించేలా అత్యాధునిక వంటశాల సదుపాయాలు ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విజయవాడ నగర అభివృద్ధికి మరింత వేగం తీసుకువస్తామని అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

**పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న మాట్లాడుతూ...**

ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ప్రధానంగా డ్రైనేజీ సమస్యలు, రోడ్ల అభివృద్ధి, తాగునీటి సమస్యలు, వీధిలైట్లు, పారిశుధ్యం వంటి స్థానిక సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని బుద్దా వెంకన్న చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరుతామని తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే కొండ్రు మురళి



రాజాం (చైతన్యరథం): రాజాం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని, పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నామని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఈ సందర్భంగా రాజాం తెదేపా కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజలనుంచి వినతులు స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంపై ప్రజల్లో సంతృప్తి గుర్తించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందడం సంతృప్తిని ఇచ్చిందన్నారు. అనంతరం కార్యకర్తే అధినేత కార్యక్రమం నిర్వహించి కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ భరోసాగా నిలుస్తుందని అన్నారు. కార్యకర్తల కోసం సంక్షేమ విభాగాన్ని నెలకొల్పడం, సభ్యత్వం తీసుకున్నవారికి ప్రమాద బీమా కల్పించడం, పనిచేసే కార్యకర్తలను గుర్తించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం మంత్రి లోకేశ్ కృషికి నిదర్శనమన్నారు. అనంతరం తెలగావీధిలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని ప్రజలకు సవివరంగా వివరించారు.

## వరలక్ష్మీ వ్రతం నిర్వహించిన హోంమంత్రి అనిత



నక్కపల్లి (చైతన్యరథం): ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన నివాసంలో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. అనంతరం ముత్తయిదువులకు వాయినాలు అందజేశారు.

## కనకమహాలక్ష్మికి 1000 డజన్ల గాజులతో అలంకరణ



చీపురుపల్లి (చైతన్యరథం): శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రాంత ఆరాధ్య దైవం, కోరికలు తీర్చే కల్పవల్లి విజయనగరం జిల్లా చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారిని 1000 డజన్ల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు సమర్పించిన గాజులను దండలుగా కూర్చి అర్చకులు అమ్మవారికి అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తల్లిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, దేవస్థానం ఈవో నానాజీబాబు, కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

## పార్టీ నాయకులతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సమీక్ష



గోపాలపురం (చైతన్యరథం): గోపాలపురం నియోజకవర్గంలోని తెలుగుదేశంపార్టీ నాయకులతో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రకాశరావుపాలెం కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపాలపురం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల పరిష్కారం తదితర అంశాలపై నాయకులతో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన పాలన మరియు సంక్షేమ ఫలాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని నాయకులకు సూచించారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణ, పార్టీ శ్రేణుల సన్నద్ధత, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను మరింతగా తెలుసుకుని, ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఒకరోజు పాదయాత్ర నిర్వహించాలని సమావేశానికి హాజరైన టీడీపీ నాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించారు. నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పిలుపునిచ్చారు.

## మూలపాడులో ఇంటింటికీ తెలుగుదేశం : పాల్గొన్న ఎమ్మెల్యే వసంత



మైలవరం (చైతన్యరథం): ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొని గ్రామంలోని ప్రజలను నేరుగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్లు, మహిళా సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులకు చేరవేయడం 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అర్జీ అంటే కాగితం మాత్రమే కాదు... ఒక నిరుపేద కుటుంబ ఆవేదన

## ● ప్రజా వినతులు/సమస్యల పరిష్కారంలో అధికారులు మానవీయ కోణంలో స్పందించాలి: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



దుగ్గిరాల (చైతన్యరథం): ప్రజాదర్బార్ కోసం ప్రభుత్వ కార్యాలయాలకు, ఎమ్మెల్యే వారి క్యాంపు కార్యాలయాలకు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే సామాన్య, నిరుపేద ప్రజల వినతుల పట్ల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది మానవీయ కోణంలో ఆలోచించి వారికి భరోసా కల్పించేలా స్పందించాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 'నిత్య ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని పాల్గొని, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలను స్వయంగా స్వీకరించారు. సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ని పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వాన పత్రికలను పుష్పగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురి వినతుల పరిష్కారంలో భాగంగా వివిధ శాఖల అధికారులుతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఫోన్లో మాట్లాడుతూ.. ప్రజా దర్బార్‌లో స్వీకరించిన అర్జీలను అధికారులు కేవలం ఒక కాగితంగా చూడకూడదని, దాని వెనుక ఒక నిరుపేద కుటుంబం యొక్క కష్టం, ఆవేదన దాగి ఉంటాయని గుర్తుచేశారు. "అర్జీలను ఏదో ఒక సాంకేతిక కారణం చూపి ఫైలు క్లోజ్ చేయడానికి ప్రాధాన్యత ఇవ్వొద్దు.. బాధితుడికి న్యాయం చేసి ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలి" అని సూచించారు. అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితి రాకుండా వారికి మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వా లక్ష్యం అని, అధికారులు సిబ్బంది ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు భరోసా కల్పించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# అవగాహనా రాహిత్యంతో మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు

## ●మంత్రి నారా లోకేష్ సవాల్‌ను స్వీకరించలేక పారిపోతున్న జగన్ అండ్ కో : ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు (చైతన్యరథం): అవగాహనా రాహిత్యంతో మెగా డీఎస్సీ నిర్వహణపై అసత్య ఆరోపణలు చేసేసిన వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అసెంబ్లీలో ఆ అంశంపై ప్రస్తావించేందుకు కూడా సాహసించలేకపోయారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ధ్వజమెత్తారు. రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అసెంబ్లీ సాక్షిగా విసిరిన బహిరంగ సవాల్‌ను స్వీకరించలేక చేతులెత్తేసిన వైసీపీ ప్రజా ప్రతినిధులు... తాము చేసిన ఆరోపణలు నిరూపించలేక చతికిలబడ్డారంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఏలూరు పవర్‌పేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా భేటీలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీపై విచారణ చేపట్టాలని పట్టుబడుతున్న వైసీపీ నేతలు... ఆ అంశాన్ని అసెంబ్లీకి వచ్చి ఎందుకు ప్రస్తావించలేకపోయారని ఆయన ప్రశ్నించారు. గతంలో గ్రూప్-1 పరీక్షల్లో అవినీతి జరిగిందని సిట్ నివేదిక పలు విషయాలను తేటతెల్లం చేసిందని పేర్కొన్నారు. మొదట దానిపై ఎంక్వైరీ చేయించాలనే నినాదాన్ని వైసీపీ నేతలు ఎత్తుకోవాలంటూ తనదైన శైలిలో చమత్కరించారు. ప్రజలకు ఉపయోగపడే విషయాలపై కాకుండా తమ స్వలాభం కోసం రాద్ధాంతం చేయాలని చూస్తే రానున్న రోజుల్లో వైసీపీ ఒక్క సీటు కూడా గెలవలేదంటూ ఆయన దుయ్యబట్టారు. మతిభ్రమించిన వారిలా ప్రవర్తించకుండా మసులుకోవడం మంచిదంటూ ఆయన హితవు పలికారు.

# నగరాల సామజిక వర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటా : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): నగరాల సామాజికవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఎంపీ కేశినేని శివనాథ్ వ్యాఖ్యానించారు. శుక్రవారం విజయవాడ (48వ డివిజన్ చిట్టినగర్) 48వ డివిజన్ చిట్టినగర్‌లో నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 27 మంది నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పోతిన బేసు కంటేశ్వరుడు, గౌరవ అధ్యక్షుడిగా రాయన ఆదిబాబు, కార్యదర్శిగా తొత్తడి భరత్, కోశాధికారిగా బెవర సాయి సుధాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ... ముందుగా నూతన కార్యవర్గానికి శు భాకాంక్షలు తెలియజేశారు శ్రావణ శుక్రవారం రోజున ప్రమాణ స్వీకారం చేయడం నిజంగా పాలకమండలి అదృష్టమని ఇది ఒక గొప్ప విషయమని అన్నారు నగరాల గురించి చెప్పుకోవాలంటే చాలా ఉందని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నగరాల పాత్ర అత్యంత కీలకమైనదని ఎంపీగా తన గెలుపు స్థానిక ఎమ్మెల్యే గెలుపులో కూడా నగరాల పాత్ర మరువలేనిదని తెలియజేశారు.

# గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ కృషి



జగ్గయ్యపేట (చైతన్యరథం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు వత్సవాయి మండలం, మక్కపేట గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం" (డోర్ టు డోర్) కార్యక్రమంలో శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను పలకరించి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు ప్రధానంగా త్రాగునీటి సమస్య, విద్యుత్ పోల్స్ ఏర్పాటు, డ్రైనేజీ సమస్య, అంగన్వాడీ భవనానికి కాంపౌండ్ వాల్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు కాంపౌండ్ వాల్, సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొన్ని సమస్యలను పంచాయతీరాజ్ నిధుల ద్వారా, మరికొన్ని సమస్యలను సంబంధిత ఇతర శాఖల నిధుల ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామంలో సాధ్యమైనంత మేర ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఉమ్మడి గోదావరి జిల్లాల క్యాన్సర్ రోగులకు తీపి కబురు

## ●ఎంపీ సానా సతీష్ బాబు చొరవతో కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్స కేంద్రానికి ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు



కాకినాడ (చైతన్యరథం): ఉమ్మడి గోదావరి జిల్లాల క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్స సదుపాయాల ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు చొరవతో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో కాకినాడ జీజీహెచ్‌లో హై ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్, సీటీ సిమ్యులేటర్ వంటి ఆధునిక పరికరాలతో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటు కానుంది.

కీలక పరిణామాలు

ఆగష్టు 3వ తేదిన: కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ చికిత్స మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ సానా సతీష్ బాబు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరిను కలిసి వినతీ పత్రం అందజేశారు. కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని, ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో ఆధునిక రేడియేషన్ థెరపీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రిని కోరారు.

ఆగష్టు 7వ తేదిన ఓఎన్‌జీసీ నుంచి కాకినాడ జీజీహెచ్‌కు ఒప్పంద పత్రం పంపించారు. క్యాన్సర్ చికిత్స సదుపాయాల ఏర్పాటుకు సీఎస్ఆర్ నిధులు అందించేందుకు ఓఎన్జీసీ ముందుకొచ్చింది.

ఆగష్టు 12వ తేదిన: కాకినాడ జీజీహెచ్ అధికారులు ఓఎన్జీసీ పంపిన ఒప్పందంపై సంతకం చేసి తిరిగి పంపించారు. దీంతో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ మరో కీలక దశకు చేరుకుంది.

### రూ.48 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అధునాతన వైద్యం

ఓఎన్‌జీసీ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కార్యక్రమంలో భాగంగా కాకినాడ, గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో అధునాతన క్యాన్సర్ చికిత్స సదుపాయాల కోసం సుమారు రూ.48 కోట్లను కేటాయించేందుకు అంగీకరించింది. ఇందులో ఒక్కో కేంద్రానికి సుమారు రూ.16 కోట్ల చొప్పున కేటాయించనున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో హై ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్, సీటీ సిమ్యులేటర్ వంటి ఆధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. చికిత్స కేంద్రానికి అవసరమైన యంత్ర సామగ్రిని కూడా ఓఎన్జీసీ సమకూర్చనుంది.

### పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట

ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో రోగులు కాకినాడ జీజీహెచ్‌కు వస్తుంటారు. క్యాన్సర్ చికిత్స కోసం ప్రస్తుతం విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి రావడంతో రోగుల కుటుంబాలపై భారీగా ఆర్థిక భారం పడుతోంది. కాకినాడ జీజీహెచ్‌లోనే అధునాతన క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వస్తే వేలాది మంది రోగులకు ప్రయోజనం కలగడంతో పాటు, లక్షల రూపాయల వైద్య ఖర్చులు మరియు సుదూర ప్రయాణాల భారం తగ్గనుంది.

### ఎంపీ సానా సతీష్ బాబు ప్రత్యేక చొరవ ఫలితం

కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై ఎంపీ సానా సతీష్ బాబు ఢిల్లీలో ఓఎన్జీసీ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో క్యాన్సర్ రోగుల పరిస్థితిని, పేదలకు ఈ సదుపాయం ఎంత అవసరమో వివరించారు. ఎంపీ సానా సతీష్ బాబు నిరంతర ప్రయత్నాలు, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం, ఓఎన్జీసీ సహకారంతో ఇప్పుడు ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చుతోంది.

### త్వరలో సేవలు అందుబాటులోకి

క్యాన్సర్ చికిత్స కేంద్రం కోసం అవసరమైన మౌలిక వసతులు, పరికరాల ఏర్పాటు పూర్తయిన అనంతరం కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్స సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్యం మరింత చేరువ కానుంది.

# కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక మూడవ వార్డులో శనివారం రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే అదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాలతో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను, స్థానిక అవసరాలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ సమస్యలను అడిగి తెలుసుకున్న చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణం చీఫ్ విప్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోగా, ఆయన వారితో నేరుగా మాట్లాడి వినతి పత్రాలను స్వీకరించారు. మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. జీవీ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల చెంతకు పాలనను చేర్చడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నాయకులు, తరితరులు పాల్గొన్నారు.

## డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో నేతల పర్యటన...



పెనమలూరు (చైతన్యరథం) : పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు మున్సిపాలిటీలోని 5,7 వార్డుల్లో డయేరియా ప్రబలిన కారణంగా స్థానిక వార్డుల్లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో పాటుగా పర్యటించి ప్రజలకు అండగా ఉంటామని తెలియజేసి, తదుపరి ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియాతో వైద్యం చేయించుకుంటున్న రోగులను మంత్రి పి.నారాయణ, మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ రాజేంద్రప్రసాద్ పరామర్శించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ... డయేరియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశామని, అలాగే డయేరియా ప్రబలడానికి కారణం ఏమిటో తెలుసుకోవడానికి నీటిని కూడా శాంపిల్స్ టెస్టింగ్‌కి పంపించడం జరిగిందని ప్రజలెవ్వరు ఆందోళన చెందవద్దని అన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

●జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే గళ్ళా



గుంటూరు (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అదే విధముగా జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళామాధవి ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అదే విధంగా గురువారం జరిగిన అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయటం పాటు, వారి సమస్యలను పరిష్కరించాలని కోరటంపై హర్షం వ్యక్తం చేస్తూ పలు జర్నలిస్ట్ సంఘాల ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలుసుకొని ధన్యవాదాలు తెలిపి, సత్కరించారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాగ్రీవెన్స్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటుండటంతో ప్రజలు సంతృప్తిగా వెళ్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రతి వర్గం, ప్రతి వృత్తి, ప్రతి సంస్థ అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు.

ఈ సందర్భంగా అసెంబ్లీలో జర్నలిస్టుల సంక్షేమంపై తాను ప్రస్తావించిన అంశాన్ని వివరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రజలకు నిజమైన సమాచారాన్ని చేరవేసేందుకు ఎన్నో కష్టాలు, ప్రమాదాలను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు కనీస భద్రత, సంక్షేమం అవసరమని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు హౌసింగ్ సదుపాయం, ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులు కల్పించాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. జర్నలిస్టులు చాలా తక్కువ వేతనాలతో, నిరంతర ఒత్తిడిలో పనిచేస్తున్నప్పటికీ సమాజానికి సేవ చేస్తున్నారని అన్నారు.

# ఏపీలో పెట్టుబడులకు అమెరికా ఐటీ పారిశ్రామికవేత్తలకు మన్నవ మోహనకృష్ణ పిలుపు

●అమరావతి క్వాంటం వ్యాలీతో ప్రపంచ క్వాంటం ఆవిష్కరణలకు ఏపీని వేదికగా మార్చే లక్ష్యం

●చంద్రబాబు విజన్.. లోకేష్ నాయకత్వంలో ఏపీకి టెక్నాలజీ రంగంలో కొత్త దిశ

●కూటమి ప్రభుత్వం విధానాలతో టెక్నాలజీ, పెట్టుబడులకు అనుకూల వాతావరణం




అమెరికా / న్యూజెర్సీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, టెక్నాలజీ రంగంలో తీసుకొస్తున్న మార్పులు, అమరావతి అభివృద్ధి ప్రణాళికలను అమెరికాలోని ఐటీ పారిశ్రామికవేత్తలకు ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వివరించారు. న్యూజెర్సీలో ప్రవాసాంధ్ర ఐటీ పారిశ్రామికవేత్తలతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు.

### క్వాంటం వ్యాలీతో అమరావతికి కొత్త గుర్తింపు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనికత, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక టెక్నాలజీ రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని మన్నవ మోహనకృష్ణ తెలిపారు. అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేయనున్న 'క్వాంటం వ్యాలీ' రాష్ట్ర టెక్నాలజీ ప్రస్థానంలో కీలక అడుగుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్, పరిశోధన, ఆవిష్కరణల వంటి రంగాల్లో కొత్త అవకాశాలకు ఇది వేదికగా మారనుందని తెలిపారు.

“చంద్రబాబునాయుడు నాయకత్వంలో గతంలో హైదరాబాద్ ఐటీ రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఇప్పుడు అదే దార్శనికతతో అమరావతిని భవిష్యత్ టెక్నాలజీకి కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం మన ముందుంది. క్వాంటం వ్యాలీ ఈ ప్రయాణంలో కీలక భాగం” అని మన్నవ మోహనకృష్ణ అన్నారు.

### ప్రపంచ టెక్నాలజీ సంస్థలకు ఏపీ ఆహ్వానం

అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు, అమరావతి అభివృద్ధి, క్వాంటం టెక్నాలజీ వంటి రంగాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏపీని పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుస్తున్నాయని ఆయన తెలిపారు. అమెరికాలోని తెలుగు పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార అనుభవాన్ని, పెట్టుబడులను రాష్ట్రంతో అనుసంధానం చేసుకోవాలని కోరారు. “ప్రపంచ స్థాయిలో మీరు సాధించిన అనుభవం, పరిజ్ఞానం ఏపీకి ఎంతో ఉపయోగపడుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను విస్తరించండి. ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుంది. మీ పెట్టుబడులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడతాయి” అని మన్నవ మోహనకృష్ణ పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక వసతులు, వేగవంతమైన అనుమతులు, పరిశ్రమలకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన వివరించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం వేగంగా చేపడుతున్న అభివృద్ధి, టెక్నాలజీ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యతపై అమెరికా ఐటీ పారిశ్రామికవేత్తలు ఆసక్తి వ్యక్తం చేశారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు రాష్ట్రంలో టెక్నాలజీ రంగానికి కొత్త అవకాశాలను తీసుకొస్తున్నాయని పేర్కొంటూ, ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో భాగస్వాములు కావడానికి వారు సుముఖత వ్యక్తం చేశారు.




## కోదండరామ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): కేతవీరునిపాడు గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించనున్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సౌమ్య... శ్రీ కోదండ రామస్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచేలా దేవస్థానం నిర్మాణం జరగడం సంతోషకరమని తెలిపారు. గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకుస్థాపన మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## అసెంబ్లీకి 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు ఎందుకు రాలేదు : జీవీ ఆంజనేయులు

●ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి ఐదేళ్లు సీఎం కావడం విడ్డూరం



వినుకొండ (చైతన్యరథం): ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీ సమావేశాలకు 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంపై ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. ప్రజల ఓట్లతో గెలిచి జీతాలు తీసుకుంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేయడం సరికాదన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు అర్థవంతమైన చర్చలకు వేదికగా నిలిచాయని జీవీ తెలిపారు. మొత్తం 25 గంటల 15 నిమిషాల పాటు సభ కొనసాగగా 103 మంది సభ్యులు ప్రసంగించారని చెప్పారు. 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు కూడా సభకు హాజరై ఉంటే మరో 11 మంది సభ్యులు ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం ఉండేదన్నారు. సభను ఎదుర్కొనే దమ్ము లేకే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారని జీవీ ఆంజనేయులు విమర్శించారు. అసెంబ్లీ నుంచి పారిపోయి పులివెందుల పిల్లుల్లా మారారు అంటూ సెటైర్ వేశారు. దేవాలయం లాంటి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేకపోవడం వైసీపీ నేతల వైఫల్యానికి నిదర్శనమన్నారు. తమ బండారం బయటపడుతుందనే భయంతోనే వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి దూరంగా ఉన్నారని ఆరోపించారు. మరోవైపు మండలిలో గందరగోళం సృష్టిస్తూ ప్రజా సమస్యలపై చర్చకు అడ్డుపడుతున్నారని విమర్శించారు. డీఎస్సీ విషయంలో మంత్రి నారా లోకేష్ బయటపెట్టిన వాస్తవాలతో వైసీపీ నేతలకు మైండ్ బ్లాక్ అయిందని అన్నారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేయడం విడ్డూరంగా ఉందని జగన్‌పై విమర్శలు గుప్పించారు. ఏపీపీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పాల్సి వస్తుందనే భయంతోనే జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో దాక్కున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాల్సిన బాధ్యత ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతి ఎమ్మెల్యేపైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.

చైతన్యరథం

# ఎంపీ అవినాశ్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్

కడప (చైతన్యచరథం):వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా అవినాశ్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాలపై దాడులకు దిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇవాళ (శుక్రవారం) తెల్లవారుజాము నుంచి సోదాలు మొదలుపెట్టింది. ఈ మేరకు దాదాపు 10 చోట్ల ఈడీ అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. హైదరాబాద్, పులివెందులలోని అవినాశ్ రెడ్డి నివాసాలు సహా ఆయన కార్యాలయాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మనీలాండరింగ్, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించిన కీలక డాక్యుమెంట్ల కోసం వెతుకుతున్నారు.

అలాగే అవినాశ్ రెడ్డి ఆస్తుల వివరాలను సేకరిస్తున్నారు. మరోవైపు, ఎంపీ అవినాశ్ రెడ్డితో పాటు వివేకా హత్య కేసు నిందితుల ఇళ్లపైనా ఈడీ అధికారులు దాడులకు దిగారు. పులివెందులలోని దేవి రెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లలోనూ సోదాలు చేస్తున్నారు. తొండూరు మండలం టి.తుమ్మలపల్లిలో ఎర్ర గంగిరెడ్డి నివాసంలో తనిఖీలు జరుగుతున్నాయి. అలాగే, పులివెందులలోని జగన్ సమీప బంధు సునీల్ రెడ్డి ఇంట్లోనూ సోదాలు చేస్తున్నారు. ఈడీ అధికారులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు చేస్తున్నారు.





# వరలక్ష్మీ వ్రత విధానాచరణ ద్వారా సనాతన ధర్మంపై అవగాహన కల్పిస్తున్నాం

శ్రీశైలం (చైతన్యరథం): భక్తుల్లో సనాతన ధర్మంపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు, ఛైర్మన్ పోతు గుంట రమేశ్ నాయుడు తెలిపారు. శ్రావణమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం చంద్రావతి కల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1500 కలశాలను నెలకొల్పి మహిళలు ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు పూజద్రవ్యాలతో పాటు అమ్మవారి శేష వస్త్రాలు, చీర, రవిక, పూలు గాజులు, లడ్డు ప్రసాదం, శ్రీశైలం ప్రభ పుస్తకం, తులసి, ఉసిరి మొక్కలను అందిస్తున్నట్లు తెలిపారు.



# వడివడిగా వెలిగొండ అలుగులు



ఒంగోలు (చైతన్యరథం): పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్‌కు సంబంధించి నీటి తరలింపులో కీలకమైన ఫీడర్ కెనాల్ సిద్ధమైంది. రూ.450 కోట్లతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. కొల్లంవాగు నుంచి టన్నెళ్ల ద్వారా వచ్చే నీరు కొత్తూరు వద్ద ఫీడర్ కెనాల్‌కు చేరి ఎటువంటి అవరోధం లేకుండా నల్లమల జలాశయంలోకి వెళ్లేందుకు మార్గం సుగమమైంది. గత వైసీపీ ప్రభుత్వం ఫీడర్ కాలువను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో నిర్మాణాత్మకంగా ఫీడర్ కాలువను బలోపేతం చేసింది. త్వరలో నీటి విడుదలకు సిద్ధమైంది. దీంతో జిల్లా ప్రజల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు సాగు, తాగునీరు అందించడం వెలిగొండ ముఖ్య ఉద్దేశం. కృష్ణా జలాలను హెడ్ రెగ్యులేటర్ల నుంచి రెండు టన్నెళ్ల ద్వారా దోర్నాల మండలం కొత్తూరు వద్దకు చేరుస్తారు. ఆనీటిని అక్కడి నుంచి నల్లమల జలాశయానికి తరలించడంలో ప్రధాన భూమిక ఫీడర్ కెనాల్‌దే. దోర్నాల మండలం కొత్తూరు నుంచి పెద్దారవీడు మండలం కలనూతల వరకూ ఫీడర్ కెనాల్ సుమారు 24 కిలో మీటర్ల మేర ఉంది. ఈ కాలు వ బలోపేతంపై గత వైసీపీ ప్రభు త్వం నిర్లక్ష్యం ప్రదర్శించింది. నేడు ప్రజా ప్రభుత్వం నిర్మాణాత్మకంగా నీటి పారుదలకు సిద్ధం చేసింది.

### వైసీపీ నిర్లక్ష్యానికి తెగిన ఆనకట్ట

ఫీడర్ కెనాల్‌ను బలోపేతం చేసేందుకు 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.120 కోట్లతో లైనింగ్ పనులు చేయాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. వీటిని పరిశీలిస్తున్న దశలో ఎన్నికలు జరిగాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల పదవీ కాలంలో వైసీపీ ప్రభుత్వం ఫీడర్ కాలువ గురించి పట్టించుకోలేదు. దీంతో దోర్నాల మండలం కడపరాజుపల్లి వద్ద వర్షపు నీటికే గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు సైతం చర్యలు చేపట్టలేదు. ఎలాంటి పనులూ చేయండానే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశారు.

సిమెంట్ లైనింగ్‌తో కట్టలు బలోపేతం

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వెలిగొండ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసి కృష్ణా జలాలను తరలించేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లింది. ఫీడర్ కాలువ బలోపేతానికి రూ.450 కోట్లతో నూతనంగా ప్రతిపాదనలు తయారు చేసి పనులను కార్యరూపంలోకి తీసుకువచ్చింది. దీంతో ప్రస్తుతం ఫీడర్ కెనాల్‌లో బలహీనంగా ఉన్న కట్టలను సిమెంట్ లైనింగ్‌తో బలోపేతం చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన చోట్ల బ్రిడ్జిలను నిర్మించారు. ఇప్పటికిప్పుడు కృష్ణా జలాలను వదిలినా కొత్తూరు వద్ద నుంచి నల్లమల సాగరానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జలాలు చేరేవిధంగా అంతా రెడీ చేశారు. నీటి విడుదల అనంతరం ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికను సిద్ధం చేసింది.




# స్వచ్ఛ నగరంగా కర్నూలు

## కమిషనర్ చల్లా ఓబు లేశు

కర్నూలు (చైతన్యరథం): నగరాన్ని స్వచ్ఛ కర్నూలుగా తీర్చిదిద్దుతామని నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబు లేసు అన్నారు. గురువారం విద్యానగర్, గాంధీనగర్, రోజా వీధి, వెంకట రమణ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీ లించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో చెత్త పేరుకుపోయిన ప్రాంతా లను గుర్తించి వాటిని సుందరంగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నామన్నారు. నగర పరిధిలో 135 జీవీపీలను గుర్తించగా, ఇప్పటికే 36 జీవీపీ లను శుభ్రపరిచి గ్రీనరీ, మొక్కలు, బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన జీవీపీల్లో దశలవారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై నిఘా ఉంచి జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరిం చాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేకుండా బాధ్యతగా వ్యవహరిం చాలని కమిషనర్ కోరారు.

ఆయన వెంట ప్రజారోగ్య అధికారి డా. ఎం.రఘు, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్‌బాబు, ఇనస్పెక్టర్లు మునిస్వామి, అనిల్, మల్లికార్జున ఉన్నారు.

# వైభవంగా సిరిసంపదలు, భోగభాగ్యాల వరలక్ష్మీ వ్రతం



అనంతపురం (చైతన్యరథం): సిరిసంపదలు, భోగభాగ్యాలు కల్గించే వరలక్ష్మీవ్రతాన్ని శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం మహిళలు వైభవంగా జరుపుకున్నారు. వరలక్ష్మీదేవి వరాలను అనుగ్రహిస్తారని భక్తుల కోర్కెలను తీర్చే దేవతగా నమ్ముతారు. ఆ రోజున లక్ష్మీదేవిని పూజిస్తే అష్టైశ్వర్యాలు కల్గుతాయన్నిది భక్తుల నమ్మకం. ధనం, శ్రేయస్సు, సంతానం, ఆరోగ్యం, జ్ఞానం, ధైర్యం, శక్తి, విజయం ఇవన్నీ అష్టలక్ష్ములు రూపంలో మహిళాభక్తులకు అందుతాయని చెబుతారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తే అష్టలక్ష్ములకు అర్చన చేసినంత ఫలం సిద్ధిస్తుందని పండితులు చెబుతున్నారు. అందువల్ల ప్రతీ ఏటా శ్రావణపౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజునే వరలక్ష్మివ్రతాన్ని జరపడం సంప్రదాయం. వ్రతం ఆచరించే రోజున వేకువజామునే మహిళలు ఇంటిని రంగవల్లులతో అలంకరించి అమ్మవారిని మనసారా ఆహ్వానిస్తారు. పూజాగదిలో మండపాన్ని నిర్మించుకుని బియ్యం పిండితో ముగ్గు వేసి దానిపై కలశాన్ని ఏర్పాటు చేయాలి. ఆ తరువాత కలశస్థాపన కార్యక్రమం చేపడతారు. అనంతరం అమ్మవారిని ఉంచి పూజాసామగ్రి సిద్ధం చేసుకుంటారు. తెల్లటి దారాన్ని ఐదు లేదా తొమ్మిదిపోగులు తీసుకుని పసుపు రాసి దానికి ఐదు లేదా తొమ్మిది ముడులు వేసి తోరాలను తయారు చేసి ముందుగా వీటిని పూజించాలి. అమ్మవారికి ప్రీతికరమైన చేమంతులు. కలువ, నూరువరహాలుతో పూజించేందుకకు ఎంతో వ్యయప్రయాసలతో గురువారం సాయంత్రానికి అన్నీ సిద్ధం చేస్తారు. మహిళలు తమ కుటుంబ శ్రేయస్సు, భర్త ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో నిష్టతో ఈ వ్రతాన్ని ఆచరించడం సంప్రదాయ బద్ధమైనది. ఈవ్రతం సాక్షాత్తు లయకారుడైన పరమేశ్వరుడే పార్వతీ దేవికి వివరించినట్టు స్కందపురాణం చెబుతోంది.



తుంగభద్ర జలాశయానికి వరద పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో మళ్లీ వర్షాలు కురవడంతో 13,800 క్యూసెక్కుల వరద వస్తోంది. డ్యాంలో నీటి నిల్వలు 1603.54 అడుగుల వద్ద 26.454 టీఎంసీలకు చేరాయి. వరద మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వారం రోజులుగా ఇన్‌ఫ్లో 1000 క్యూసెక్కులకు పడిపోవడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. తాజా వర్షాలు ఊరటనిస్తున్నాయి.



# ఆశల ఊపిరితో టమోటా సాగు

## ఆదిలోనే హంసపాదు అన్న పరిస్థితి

అనంతపురం (చైతన్యరథం): టమోటా రైతులకు ఈసారి ఆదిలోనే హంసపాదు అన్న పరిస్థితి ఎదురవుతోంది. ఎన్నో ఆశలతో సాగు చేసిన పంట చేతికొచ్చిన సమయంలో ధరల పతనం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సీజన్ ప్రారంభంలోనే పరిస్థితులు తలకిందులు కావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలోకి పడిపోయారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా కనిపించలేదని కన్నీరుపెడుతున్నారు. కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండాపోతోందని వాపోతున్నారు. చేసేదిలేక పంటను తోటలోనే వదిలేయడం, లేదంటే రోడ్లపక్క పారబోసే దృశ్యాలు నిత్యం కనిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో కొన్నేళ్లుగా టమోటా సాగు బాగా పెరిగింది. సాధారణంగా సీజన్ ప్రారంభంలో ధరలు ఆశాజనకంగా ఉంటాయి. దీంతో రైతులు ముందస్తుగా పంట సాగు చేస్తున్నారు. మే, జూన్‌లో ఎండలతో ప్రతికూల పరిస్థితులు ఉన్నా మొక్కలు నాటి సంరక్షించుకుంటున్నారు. దీని వల్ల సీజన్ ప్రారంభంలోనే పంట మార్కెట్‌కు తరలిస్తే మంచి గిట్టుబాటు ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కానీ ఈసారి పరిస్థితి తల్లకిందులయింది. దిగుబడి బాగా ఉన్నా.. ధరల పతనంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. గత ఏడాది సీజన్ ప్రారంభంలో కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో గరిష్ఠ ధరలు రూ.30 నుంచి రూ.40 మధ్య పలికాయి. 15 కిలో బాక్సుకు రూ.450 నుంచి రూ.600 వరకు లభించింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈసారి ముందస్తుగానే పంట సాగు చేశారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రస్తుతం కిలో గరిష్ట ధర రూ.10 నుంచి రూ.12మధ్య ఊగిసలాడుతోంది. ధరలు పతనానికి ఎగుమతులు మందగించడమే ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 23వేల హెక్టార్లలో టమోటా సాగులో ఉన్నట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 20శాతం కోత ద శలో ఉందంటున్నారు. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో కాయలు మార్కెట్ పెద్ద ఎత్తు న వస్తున్నాయి. అనంతపురం కక్కలపల్లి ప్రైవేట్ మార్కెట్‌కు రోజుకు మూడువేల టన్నులకు పైగానే కాయలు వస్తున్నాయి. కళ్యాణదుర్గం మార్కెట్‌కు కూడా బాగానే వస్తున్నాయి. ఎగుమతులు లేకపోవడం ధరలు లేకపోవడానికి కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. కోలారు, మదనపల్లి, కలికిరి మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి.





# అక్షర కిరీటి 'వేటూరి'

## డాలస్‌లో ఘనంగా 'కవికులాలంకార' సుందరరామమూర్తి సాహితీ మహోత్సవం

**డాలస్, టెక్సాస్:** 'వేటూరి సాహిత్యాభిమాన సమితి ఆఫ్ అమెరికా', 'శుభం ఫౌండేషన్' సంయుక్త ఆధ్వర్యంలో 'కవికులాలంకార' వేటూరి సుందరరామమూర్తి సాహితీ మహోత్సవం వైభవంగా జరిగింది. ఫ్రిస్కో మెమోరియల్ హైస్కూల్ ఆడిటోరి యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేటూరి విరచిత ఎనిమిది సినీ, సినీయేతర గీత సంపుటాలను ఆవిష్కరించారు. వేటూరి ప్రత్యేక పాటలపై నృత్య, సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలుగు వేదకవి, ప్రముఖ సినీ గీత రచయిత, దర్శకుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు సాహిత్య సంపుటాలను ఆవిష్కరించి తొలి గ్రంథాన్ని విశిష్ట అతిథిగా హాజరైన ఈనాడు దినపత్రిక సంపాదకులు ఎం.నాగేశ్వరరావుకు, అతిథులుగా హాజరైన వామరాజు సత్యమూర్తికి, డాక్టర్ కొమాండూరి రామాచారికి అందజేశారు.

వేటూరి సాహిత్యాభిమాన సమితి ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర, శుభం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాల్ పోణంగి ఆధ్వర్యంలో సాహిత్య సంపుటాలను ప్రచురించడానికి సహాయ సహకారాలు అందించిన వారిలో హాజరైన డాక్టర్ బుచ్చిబాబు పైడిపాటి, చంద్రహాస్ మద్దుకూరి, చంద్రశేఖర్ రెంటచింతల, గోకుల్ కిలారు, ప్రొఫెసర్ జగదీశ్వరన్ పుదూర్, మురళి వెన్నం, డాక్టర్ నరసింహారెడ్డి ఊరిమిండి, రామకృష్ణ పొక్కునూరి, రావు కల్వల, డాక్టర్ సుబ్రహ్మణ్యం బోయారెడ్డి, విజయసారథి జీడిగుంట, వినోద్ ఉప్పులను సత్కరించారు.

ఈనాడు దినపత్రిక సంపాదకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ... వేటూరి పాటల్లో గొప్పవి ఏవి అని చాట్‌జీపీటీని అడిగితే... ఎంపిక చెయ్యడం కష్టమనే సమాధానం వచ్చింద న్నారు. దీనిని బట్టి వేటూరి ప్రతిభ ఏమిటో అర్థం చేసుకోవచ్చు అని తెలిపారు. 18 సంవత్సరాలు పాత్రికేయునిగా పనిచేసిన వేటూరిని ఈనాడు జర్నలిజం స్కూల్‌కు ఆహ్వానించి విద్యార్థులతో మాట్లాడించానని గుర్తు చేశారు. ప్రధాని జవహర్ లాల్ నెహ్రూను ఇంటర్వ్యూ చేసిన తొలి తెలుగు జర్నలిస్ట్ వేటూరి అని తెలిపారు. ప్రేమ, విరహం, భక్తి, తాత్వికత, శృంగారం, వేదన, ప్రకృతి, సామాజిక చైతన్యం... ఇలా ఏ రకపు పాటనైనా అక్షరాల్లో ఆవిష్కరించగల దిట్ట అని కొనియాడారు. రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే అనే పాటకు జాతీయ పురస్కారం అందుకున్న వేటూరి సాహిత్యం జ్ఞానపీఠ పురస్కారానికి నూటికి నూరు శాతం అర్హనీయమైనదన్నారు.

ప్రత్యేక అతిథిగా హాజరైన వామరాజు సత్యమూర్తి మాట్లాడుతూ... డాక్టర్ ప్రసాద్ తోటకూర నిర్వహణలో జనవరిలో హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా జరిగిన ఈ గ్రంథాల ఆవిష్కరణ సభలో, మళ్లీ డాలస్‌లో జరిగిన సభ రెండింటి లోనూ పాల్గొనడం తన అదృష్టమన్నారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ప్రముఖ సంగీత గురువు డాక్టర్ కొమండూరి రామాచారి వేటూరితో తనకున్న అనుబంధాన్ని, గీత రచనా శైలిని ప్రశంసిస్తూ కొన్ని పల్లవులను పాడారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన టెక్సాస్ రాష్ట్ర కాంగ్రెస్ మెంబర్ మాట్ షాహీన్, ఫ్రిస్కో నగర మేయర్ మార్క్ హిల్, కౌన్సిల్ మెంబర్ యాన్ యాండర్సన్‌లను సత్కరించారు. ఇటీవల కొలంబియాలో 8 సంవత్సరాల్లోపు పిల్లలకు జరిగిన చదరంగం పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన సరయు తలపనేనిని టెక్సాస్ రాష్ట్ర కాంగ్రెస్ మెంబర్ మాట్ షాహీన్ సత్కరించి ఆమె తల్లిదండ్రులు సందీప్, శ్రీలక్ష్మిలను అభినందించారు. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన అనీషా పోణంగి, అభినుత మద్దుకూరి, శుభం ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు కిశోర్ నారె, పావని నున్న, నాగరాజు నలజల, నేలకొండ రాజు, పద్మ ముప్పిడి, శాస్త్రి అనిపిండిలకు గోపాల్ పోణంగి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





### నవ్వులు పూయించిన... జొన్నవిత్తులతో ముఖాముఖి

వేటూరితో సుదీర్ఘకాలం సాహిత్య ప్రయాణం చేసిన జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుతో డాక్టర్ ప్రసాద్ తోటకూర... వేటూరి జీవితంపై ముఖాముఖి నిర్వహించారు. పాత్రికేయునిగా ఉన్న వేటూరి నందమూరి తారకరామారావు కోరిక మేరకు అయిష్టంగా రచయితగా సినీరంగ ప్రవేశం చెయ్యడం, అందులో ముఖ్య భాగం అవడం, ఆయన కవితావైభవం, వ్యక్తిత్వం, 'జీవనరాగం', 'రాబిన్ హుడ్', 'సిరికాకొలను చిన్నది', 'కొమ్మకొమ్మకో సన్నాయి' లాంటి రచనలతో పాటు వేటూరి జీవితంలో జరిగిన కొన్ని హాస్య సంఘటనలు, వివిధ అంశాలపై నిర్వహించిన ఈ కార్యక్రమం నవ్వులు పూయించింది.



### అలరించిన సంగీత విభావరి, నృత్యాలు



గాయకుడు, సంగీత దర్శకుడు రాజశేఖర్ సూరిభొట్ల ఆధ్వర్యంలో సంగీత విభావరి నిర్వహించారు. స్థానిక గాయనీ గాయకులు సంతోష్ ఖమ్మంఖర్, చంద్రహాస్ మద్దుకూరి, శిరీష కోటంరాజు, జానకి శంకర్, శ్రేయస్ సూరిభొట్ల, సాహితి కోటంరాజు పాటలు పాడారు. రాజశేఖర్ (కీబోర్డు), ముద్దు పాయ్ (కీబోర్డు, గిటార్), రాం యామిజాల, నీవ్ యామిజాల (పెర్కషన్) వాయిద్యాలపై సహకారం అందించారు. సౌండ్ ఇంజినీర్‌గా రవి మాచ, రవి రావు భట్టిప్రోలు పనిచేశారు. వేటూరి రాసిన 'ఓం నమ: శివాయ (సాగర సంగమం)' పాటకు గురు పరంపర స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ డైరెక్టర్ గురు మంజు హేమమాలిని చావ శిష్యులు దేవినేని వైదూర్య, సాహితి వేముల, సింధు వేముల, తేజశ్రీ అబ్బూరు నృత్యం చేశారు. 'జగతి సిగలో జాబిలమ్మకు (పరదేశి)' పాటకు రాగమయూరి స్కూల్ ఆఫ్ డాన్స్-యోగా గురు సింధుజ ఘట్టమనేని శిష్యులు గ్రీష్మా అశోక్, నందిత దినేష్, సహస్ర తటవర్తి, రుషిక కాళ్ల నృత్యం చేశారు. 'నెమలికి నేర్పిన నడకలివే (సప్తపది)' పాటకు నాట్యాంజలి కూచిపూడి డాన్స్ స్కూల్ గురు శ్రీలత సూరి శిష్యులు ప్రియాంక పొత్తూరి, శ్రుతి పొత్తూరి, స్వప్నిక వడాలి, అంజిత నాయర్ నృత్యం చేశారు. 'మధుర మధురతర మీనాక్షి (అర్జున్)' గీతానికి సాయి నృత్య అకాడమీ కూచిపూడి డాన్స్ స్కూల్ గురు శ్రీదేవి యడ్లపాటి శిష్యులు పల్లవి తూములూరు, సంజన కల్వకొలను నృత్యం చేశారు.





# చార్లెట్‌లో ఘనంగా 'తెలుగు మాట్లాట'



**చార్లెట్:** అమెరికాలోని చార్లెట్ నగరంలో హిల్టన్ ఎయిర్‌పోర్ట్ రిసార్ట్‌లో 'సిలికానాంధ్ర మనబడి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలుగు మాట్లాట 2026' అంతర్జాతీయ పోటీలు వైభవంగా ముగిశాయి. పారుపూడి కిరణ్, తాళ్ళూరి ప్రత్యూష, గొల్లపూడి సీతారామ్ నాయకత్వంలో రెండు రోజులు జరిగిన కార్యక్రమాల్లో అమెరికా, కెనడాలకు చెందిన 200 మందికి పైగా పిల్లలు, 1000 మంది ప్రేక్షకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రాథమిక స్థాయిలో దాదాపు 3,500 మంది పాల్గొనగా గెలిచిన విద్యార్థులు ఇక్కడ తుది అంకంలో పోటీపడ్డారు. పద రంగం, తిరకాటం, ఒనిమా అనే ఆటలను బుడతలు, సిసింద్రీలు, చిరుతలు అనే మూడు వయోవర్గాల్లో నిర్వహించారు.

### విజేతలు వీరే...

**పదరంగం:** సిసింద్రీల విభాగంలో పెద్దింటి శ్రీయోగ అద్వైత (ప్రథమ), దొనకంటి శ్రేయాన్స్ (ద్వితీయ), చిరుతల విభాగంలో దువ్వూరి అజిత్ (ప్రథమ), మన్నేమేల లక్ష్మి (ద్వితీయ) బహుమతులు కైవసం చేసుకున్నారు.

**తిరకాటం:** బుడతల విభాగంలో అక్షర శ్రీనివాస్ (ప్రథమ), సిరిసేని శశాంఖ్ (ద్వితీయ), సిసింద్రీల విభాగంలో ఈప్సిత కళ్యాణ్ (ప్రథమ), నాలం ధారిష్ (ద్వితీయ), చిరుతల విభాగంలో గుత్తికొండ వంశీ కృష్ణ (ప్రథమ), కాట్రగడ్డ ప్రణతి (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు.

**ఒనిమా:** బుడతల విభాగంలో నాలం దేవర్ష్ (ప్రథమ), యార్లగడ్డ ఐరా (ద్వితీయ), సిసింద్రీల విభాగంలో దొనకంటి శ్రేయాన్స్ (ప్రథమ), దత్ ఈశ్వర్ (ద్వితీయ), చిరుతల విభాగంలో వడ్డిచర్ల ఆశ్రిత స్నిగ్ధ (ప్రథమ), కాట్రగడ్డ ప్రణతి (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభల శ్రీని బహుమతులు ప్రదానం చేశారు. మనబడి చేస్తున్న కృషిని, పిల్లల భాషా పటిమను ఆయన కొనియాడారు. విదేశాల్లో తెలుగు రావడం వల్ల ఉద్యోగ, వ్యాపార, కళా రంగాల్లో ఎంతో ప్రయోజనం ఉందన్నారు. ఆరియా విశ్వవిద్యాలయంలోని తెలుగు కోర్సుల్లో చేరాలని ఉపాధ్యక్షురాలు శ్రీదేవి గంటి పిలుపునిచ్చారు.

ఉపాధ్యక్షుడు రాయవరం విజయభాస్కర్ రచనల కోసం బాలచంద్రిక శిక్షణ గురించి వివరిస్తూ... 2026-27 విద్యా సంవత్సరం తరగతులు సెప్టెంబరు 12/13 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఉపాధ్యక్షుడు కస్తూరి గౌతమ్ చంద్ర మాట్లాడుతూ 13 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని ఆదరిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. జట్టు నాయకుడు పారుపూడి కిరణ్ మాట్లాడుతూ పోటీల నియమాలను ఈసారి మరింత సులభతరం చేశామని చెప్పారు. చార్లెట్ ప్రాంతీయ సమన్వయకర్త గొల్లపూడి సీతారామ్ నాయకత్వంలోని బృందం సదుపాయాలు, ఆహారం, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక నిర్వహణలను సమర్థవంతంగా చూసుకుంది. సహకరించిన 'తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చార్లెట్', ఇతర దాతలకు, వాలంటీర్లకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# డీలిమిటేషన్‌పై ప్రత్యేక సమావేశాలు

## కేంద్రం నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ



మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు విషయంలో కేంద్రం ఏం చేయనుందన్న అంశంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు పెడతారన్న అంచనాలు మొదట్లో వెలువడినా పేపర్ లీక్ అంశం వివాదాస్పదం కావడంతో డీలిమిటేషన్ అంశం తెరమరుగైనట్టు కనిపించింది. అయితే, డీలిమిటేషన్ కోసం కేంద్రం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న అంచనాలు ప్రస్తుతం వెలువడుతున్నాయి. నిన్న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అమిత్ షా నియోజకవర్గ పునర్విభజన అంశాన్ని ప్రస్తావించారు. డీలిమిటేషన్‌ను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న తమిళనాడు సీఎం ఈ సమావేశం తరువాత మెత్తబడినట్టు ప్రచారం మొదలైంది. సమావేశం అనంతరం విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో రాష్ట్రాల వాటా తగ్గకుండా రక్షణ కల్పించాలని అన్నారు. ఈ దిశగా కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. ఇక దక్షిణాది వాటా తగ్గకుండా ఉంటే డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాల్సిన అవసరం లేదనే అభిప్రాయంలో డీఎంకే కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవలి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 13వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. ఆ తరువాత సభను ప్రోరోగ్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ ఆ దిశగా ఎలాంటి చర్య లేకపోవడంతో కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్న ఉత్కంఠ పెరిగింది.



# కొండపై నుంచి పడి.. ముగ్గురు కుటుంబసభ్యుల దుర్మరణం

మహారాష్ట్ర శంభాజీనగర్‌లోని కావడియా కొండ సమీపంలో విషాద ఘటన చోటుచేసుకుంది. తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు కొండపై నుంచి దూకినట్లు సమాచారం. తనయుడు లోయలో పడిపోవడంతో అతడిని కాపాడేందుకు తండ్రి కూడా కొండపై నుంచి కిందకు వెళ్లేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తూ లోయలో పడిపోయాడు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర కలకలం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు లోయలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. భర్త, కుమారుడు ఇద్దరూ లోయలో పడిపోయిన విషయం తెలుసుకున్న తల్లి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆమె కూడా కొండపై నుంచి దూకినట్లు సమాచారం. దీంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కావడియా కొండ వద్ద జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలపై సీజేపీ ఫోకస్





నీట్, యూజీ పేపర్ లీక్ నిరసనల అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఫోకస్ పెట్టింది. సీజేపీ కార్యకర్తలంతా 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమం కింద తమతమ ప్రాంతాల్లోని పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను ఆరా తీస్తున్నారు. నిర్వహణ సరిగా లేని స్కూళ్ల వివరాలను సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల గురించి తెలుసుకునేందుకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా గ్రామాల బాట పట్టారు. లాతూర్ జిల్లా ఔసా జెడ్పీ పాఠశాలను సందర్శించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం ఔసా జెడ్పీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణ మొత్తం కలియతిరిగారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం వంటివి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తనిఖీ సమయంలో తరగతి గదుల్లో ఉన్న కొందరు విద్యార్థులు ఆ పాఠశాలకు చెందిన వారు కాదని ఆరోపించారు. తనను చూసి ఇతర పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకొచ్చి కూర్చోబెట్టినట్లు పేర్కొన్నారు. పాఠశాల రికార్డుల్లో పేర్లు లేని పిల్లలు అక్కడ ఎందుకు ఉన్నారని ఉపాధ్యాయులను తాను ప్రశ్నించినట్లు దీప్కే తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను పాఠశాల ప్రిన్సిపల్ బాలాజీ గవాలీ ఖండించారు. ఒకే భవనంలో మరాఠీ, ఉర్దూ మాధ్యమాలకు చెందిన రెండు పాఠశాలలు కొనసాగుతున్నాయని, అక్కడ కనిపించిన పిల్లలు తమ విద్యార్థులేనని స్పష్టం చేశారు. మరోవైపు, పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు కనిపించాయని దీప్కే ఆరోపించారు. తాగునీటి వంటి కనీస సదుపాయాలూ సరిగా లేవని పేర్కొన్నారు. తనిఖీకి కొద్దిసేపటి ముందే మరుగుదొడ్లను శుభ్రం చేసినట్లు చెప్పుకొచ్చారు. పాఠశాలల నిర్వహణను పర్యవేక్షించే విద్యాశాఖ అధికారులు దీనికి బాధ్యత వహించాలని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే లాతూర్ జిల్లాలోని పాఠశాలల్లో సామాజిక ఆడిట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల దుస్థితికి బాధ్యత వహిస్తూ మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, దీప్కే ఆరోపణలపై మహారాష్ట్ర విద్యాశాఖ ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# 105 ఏళ్ల వృద్ధుడికి శిక్షా కాలం రద్దు

## సుప్రీం కోర్టు కీలకతీర్పు

హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్ద జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు. 1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.



# లా విద్యార్థులకు సుప్రీం కోర్టు శుభవార్త

## ప్రాక్టీసు అనుభవం లేకపోయినా సివిల్ జడ్జి పరీక్షలకు అర్హత

జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గించింది. మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధనను తొలగించాలన్న అభ్యర్థనను పూర్తిగా తోసిపుచ్చనప్పటికీ, యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని మార్పులు చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ అంశంపై జస్టిస్ వినోద్ చంద్రన్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టుల ప్రత్యక్ష నియామకాలకు కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, నిబంధనలు కఠినంగా ఉండి యువ లా గ్రాడ్యుయేట్లకు ఇబ్బంది కలగకూడదని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 2025 మే 20 నుంచి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు హాజరయ్యే లా గ్రాడ్యుయేట్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేకపోయినా దరఖాస్తు చేసుకునేందుకు సుప్రీంకోర్టు మినహాయింపునిచ్చింది. ఈ కాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రెయినీ జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులవుతారు. అలానే వీరు స్టేట్ జ్యుడీషియల్ అకాడమీలో ఒక సంవత్సరం పాటు శిక్షణ పొందాలి. ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు స్ట్రక్చర్డ్ లా క్లర్క్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇందులో మొదటి ఆరు నెలలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేదా హయ్యర్ జ్యుడీషియల్ సర్వీస్ సభ్యుల పర్యవేక్షణలో, తర్వాతి ఆరు నెలలు హైకోర్టు సిట్టింగ్ జడ్జిల పర్యవేక్షణలో క్లర్క్‌షిప్ పూర్తి చేయాలి. శిక్షణ కాలంలో జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ స్థూల వేతనంలో సగానికి సమానమైన గౌరవ వేతనం అందుకుంటారు. 2027 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత వెలువడే నోటిఫికేషన్ల ద్వారా సివిల్ జడ్జిలుగా ఎంపిక కావాలనుకునే అభ్యర్థులు కనీసం ఒక సంవత్సరం పాటు న్యాయవాద వృత్తి అనుభవాన్ని కలిగి ఉండాలి. దీనిని ధ్రువీకరణ పత్రం ద్వారా సరిచూస్తారు. ఎంపికైన తర్వాత పైన పేర్కొన్న విధంగా ఒక సంవత్సరం అకాడమీ శిక్షణ, ఒక సంవత్సరం క్లర్క్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ శిక్షణ కాలం పరిపూర్ణంగా ముగిసిన తర్వాతే వారు రెగ్యులర్ పోస్టుల్లో నియమితులై పూర్తి స్థాయి వేతనాన్ని అందుకుంటారు. న్యాయ వ్యవస్థలో ప్రవేశించే ముందు అభ్యర్థులకు వృత్తిగత అనుభవం ఉండాలనే తలంపుతో పాటు, అకస్మాత్తుగా విధించిన కఠిన నిబంధనల వల్ల మహిళలు, దివ్యాంగులు, యువ లా గ్రాడ్యుయేట్లు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# హెచ్-1బీలో కొత్త మార్పులు.. వైట్ హౌస్ సమీక్ష




అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ వలసల కట్టడే అజెండాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకెళుతున్నారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను తన ప్రధాన టార్గెట్‌గా మార్చుకున్నారు. రకరకాల మార్గాల్లో వీసా ఫీజులు పెంచి విదేశీయుల రాకను కట్టడి చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. తాజాగా హెచ్-1బీ వీసా ఫీజులను మరోసారి పెంచేందుకు ట్రంప్ సర్కారు ప్రయత్నాలు చేస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. వైట్‌హౌస్‌లోని ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ అఫైర్స్ (ఓఐఆర్ఏ) విభాగం ఈ ప్రతిపాదనపై సమీక్ష పూర్తి చేసినట్టు తెలిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఈ ఫీజు పెంపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను మాత్రం ట్రంప్ సర్కారు బహిర్గతం చేయలేదు. ఏ మేరకు ఫీజులు పెంచుతారన్నదాని గురించి ఎలాంటి వివరాలు బయటకురాలేదు. ఏయే రకాల హెచ్-1బీ వీసా పిటిషన్లకు ఈ ఫీజు పెంపు వర్తిస్తుందనేది కూడా ఇంకా తెలియరాలేదు. రాబోయే వారాల్లో డీహెచ్ఎస్ స్వయంగా ఈ ప్రతిపాదనను బహిరంగ పరచనుంది. అనంతరం ప్రజల అభ్యంతరాలు స్వీకరించి ఆపై తుది నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. ఓఐఆర్ఏ సమీక్ష పూర్తైనంత మాత్రాన ఫీజుల పెంపునకు అనుమతి లభించినట్టు కాదని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రతిపాదనను, ప్రజల ముందు పెట్టాక వారి అభిప్రాయాల ఆధారంగా డీహెచ్ఎస్ తుది నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్నారు. హెచ్-1బీ వీసా ఫీజు పెంపుపై కోర్టుల్లో చుక్కెదురైనా వెనక్కు తగ్గని ట్రంప్ సర్కారు ఇటీవల 9-11 రెస్పాన్స్ అండ్ బయోమెట్రిక్ ఫీజులను పెంచిన విషయం తెలిసిందే. హెచ్-1బీ, ఎల్-1 వీసా పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకునే కొన్ని సంస్థలపై ట్రంప్ సర్కారు ఈ అదనపు భారం మోపింది. ఇవే కాకుండా, వీసా స్పాన్సర్ చేసే సంస్థలపై నిఘా మరింత కట్టుదిట్టం చేసేలా హెచ్-1బీ వీసాకు మరిన్ని మార్పులు చేసే యోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో అమెరికా ప్రభుత్వం 4,06,348 హెచ్-1బీ వీసా పిటిషన్లను ఆమోదించింది. వీటిలో 2,91,542 పిటిషన్లు వీసా పొడిగింపునకు సంబంధించినవి. ఇందులో భారతీయుల పిటిషన్ల వాటా 77.6 శాతం. ఈ నేపథ్యంలో మరోసారి వీసా ఫీజులు పెరిగితే భారతీయ ఉద్యోగులు అధికంగా ఉన్న టెక్ కంపెనీలకు ఖర్చుల భారం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.




# అలాస్కాలో ఘోర విమాన ప్రమాదం

## చార్టర్ ప్లేన్ కుప్పకూలి 8 మంది దుర్మరణం

అమెరికాలోని అలాస్కాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. పశ్చిమ అలాస్కాలోని మారుమూల ప్రాంతంలో ఓ చార్టర్ ప్లేన్ కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 8మంది మృతిచెందినట్టు అమెరికా సైన్యం వెల్లడించింది. ప్రమాదానికి గురైన విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులు ఉన్నట్లు అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అలాస్కా ప్రాంత అధికారి క్లింట్ జాన్సన్ తెలిపారు. గురువారం యాంకరేజ్ నుంచి విమానం బయలుదేరి కేప్ న్యూనెహామ్ ప్రాంతానికి చేరుకుంటుండగా ప్రమాదం జరిగింది. కేప్ న్యూనెహామ్ లాంగ్ రేంజ్ రాడార్ సైట్ సమీపంలోనే కూలిపోయింది. ఈ ప్రాంతం యాంకరేజ్‌కు సుమారు 450 మైళ్ల దూరంలోని మారుమూల ప్రాంతం కావడంతో సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. విమాన ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అలాస్కా రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్.. సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. తొలుత విమానంలో ఉన్నవారి పరిస్థితిపై స్పష్టమైన సమాచారం అందలేదు. అనంతరం అమెరికా సైన్యం 8 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ధ్రువీకరించింది. అయితే, విమానం ఎందుకు కుప్పకూలిందన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రమాదానికి సంబంధించిన కారణాలను అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎన్‌టీఎస్‌బీ ప్రాథమిక విచారణను ప్రారంభించింది. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరిగే కొద్దీ మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# అమెరికా, ఇరాన్ ఎత్తుకు పైఎత్తులు




మధ్య ఆసియాలో అమెరికా, ఇరాన్ దేశాలు యుద్ధంలో ఆధిపత్యం సాధించేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయగా.. పర్షియన్ గల్ఫ్ దేశాల నుంచి చమురు నౌకలను రహస్యంగా జలసంధిని దాటించేందుకు అమెరికా కొత్త ఎత్తుగడ వేసినట్టు బయటపడింది. పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు బయటకు రాకుండా అడ్డుకుంటే ప్రపంచమంతా చమురు ధరలు పెరిగి అమెరికా దిగి వస్తుందని ఇరాన్ భావించింది. అయితే, ఇరాన్ కళ్లుగప్పి రోజూ భారీ మొత్తంలో చమురు బయటకు వస్తున్నట్లు తేలింది. అమెరికా నౌకాదళం, వాయుసేన రక్షణలో సౌదీ, యూఏఈ, ఖతర్ తదితర దేశాల నుంచి లక్షలకొద్ది బ్యారెళ్ల ముడిచమురు హోర్ముజ్‌ను దాటి వెళ్తోందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ ఆక్సియోస్ వార్తా సంస్థ తెలిపింది. రోజుకు ఏకంగా కోటి బ్యారెళ్ల చమురు రహస్యంగా జలసంధిని దాటి ప్రపంచవ్యాప్తంగా వెళ్తోందని పేర్కొంది. యుద్ధానికి ముందు చమురు నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో ఉత్తర భాగం (ఇరాన్ తీరం వెంట) ప్రయాణించేవి. వాటిని ఇరాన్ తేలిగ్గా అడ్డుకొనేది. దీంతో అమెరికా మిలిటరీ జలసంధి దక్షిణ భాగం (ఒమాన్ తీరం వెంట) నుంచి ఓ మార్గాన్ని ఏర్పాటు చేసింది. రోజుకు 10 నుంచి 15 భారీ చమురు ట్యాంకర్లను ఈ మార్గంలో గత రెండు నెలలుగా పంపిస్తోందని ఆక్సియోస్ తెలిపింది. గత పది రోజుల నుంచి రోజూ దాదాపు కోటి బ్యారెళ్ల ముడి చమురును విజయవంతంగా జలసంధిని దాటిస్తోందని పేర్కొంది. ఈ జలమార్గం చాలా ఇరుకుగా ఉండటంతో దక్షిణ తీరం నుంచి ప్రయాణించే నౌకలను కూడా ఐఆర్‌జీసీ తేలిగ్గా గుర్తించగలదు. ఈ ప్రమాదాన్ని తప్పించేందుకు అమెరికా మిలిటరీ మొదట ఇరాన్‌లోని రాడార్ వ్యవస్థలను ధ్వంసం చేసింది. దీంతో జలసంధిలో ప్రయాణించే నౌకలను గుర్తించే సామర్థ్యాని ఇరాన్ చాలావరకు కోల్పోయింది. అయినా, అమెరికా మిలిటరీ ముందు జాగ్రత్తగా చమురు ట్యాంకర్లన రాత్రిపూట మాత్రమే పంపిస్తున్నట్లు ఆక్సియోస్ తెలిపింది. అమెరికా నేవీ ఈ ట్యాంకర్లకు ఎస్కార్టుగా వెళ్తున్నట్లు వెల్లడించింది. ఆకాశం నుంచి ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు రాకుండా అమెరికా వైమానిక దళం అడ్డుకుంటోంది. అంతేకాకుండా జలసంధిని దాటే సమయంలో చము రు నౌకల నావిగేషన్ వ్యవస్థలను నిలిపేస్తున్నారు. దీంతో వాటిని గుర్తించటంలో ఐఆర్‌జీసీ విఫలమవుతోంది. ప్రస్తుతం రోజుకు 1.5కోట్ల నుంచి 2 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును జలసంధి ద్వారా బయటకు తీసుకొచ్చేందుకు ప్రణాళిక వేసినట్లు ఇద్దరు అమెరికా అధికారులు ఆక్సియోస్‌కు తెలిపారు.

# త్వరగా వచ్చేయండి..

## అంతర్జాతీయ విద్యార్థులకు యూఎస్ యూనివర్సిటీ పిలుపు

యూఎస్‌లోని అంతర్జాతీయ విద్యార్థులకు సంబంధించి నాలుగేళ్ల అడ్మిషన్ కాలపరిమితి నిబంధన మరో నెలలో అమల్లోకి రానున్న ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం కీలక సూచన చేసింది. కొత్త రూల్స్ సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆలోపే అమెరికాకు చేరుకోవాలని అంతర్జాతీయ విద్యార్థులకు యూనివర్సిటీ సూచించింది. ఎఫ్-1 స్టూడెంట్స్‌తో పాటు జే-1 విద్యార్థులు, జే-1 స్కాలర్లనూ ఈ మేరకు అప్రమత్తం చేసింది. ట్రంప్ సర్కారు ఇటీవల విద్యార్థుల చదువులకు సంబంధించి నాలుగేళ్ల గరిష్ఠ కాలపరిమితిని తీసుకొచ్చింది. చదువు పూర్తి చేసుకునేందుకు ఇంతకుమించిన సమయం కావాలనుకున్న వారు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో యూనివర్సిటీ నిర్ణయం మేరకు విద్యార్థులకు కోర్సు పూర్తి చేసేందుకు అదనపు సమయం లభించేది. అయితే, ఇప్పటికే అమెరికాలో ఉంటున్న అంతర్జాతీయ విద్యార్థుల కోసం అమెరికా కొన్ని మినహాయింపులు ఇచ్చింది. దీని ప్రకారం సెప్టెంబర్ 15 నాటికే యూఎస్‌కు చేరుకున్న అంతర్జాతీయ విద్యార్థులు తమ కాలపరిమితి పొడిగింపు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే, సెలవులు లేదా ఇతరత్రా కారణాలతో సొంత దేశాలకు వెళ్లిన వారు సెప్టెంబర్ 15 తరువాత తిరిగి వెళ్లితే మాత్రం కొత్త నిబంధనలు వర్తిస్తాయి. కోర్సు పూర్తి చేసుకునేందుకు అదనపు సమయం కావాల్సి వస్తే ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అదనపు ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుంది. వీసా గ్రేస్ పీరియడ్‌కు సంబంధించి కూడా మార్పులు రానున్నాయి. సెప్టెంబర్ 15 నాటికి అమెరికాలో ఉంటున్న అమెరికా ఎఫ్-1 వీసా విద్యార్థులకు మునుపటి వలెనే 60 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. సెప్టెంబర్ 15 తరువాత అమెరికాకు వెళ్లిన ఎఫ్-1 వీసా విద్యార్థులకు గ్రేస్ పీరియడ్‌ను 30 రోజులకు పరిమితం చేశారు.



# మళ్లీ జైలుకు పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్



పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మళ్లీ జైలుపాలయ్యారు. ఇస్లామాబాద్‌లోని షిఫా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఆయనను మళ్లీ పోలీసులు జైలుకు తరలించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పీటీఐ సభ్యులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇమ్రాన్ ఆరోగ్యం దృష్ట్యా ఆయనను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాలని ఇటీవల పాక్ సుప్రీం కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. పలు కేసుల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పీటీఐ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ దాదాపు మూడేళ్లుగా జైల్లో ఉంటున్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు ప్రభుత్వం ఆయనను ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. అనంతరం మళ్లీ రావల్పిండిలోని అడియాలా జైలుకు తరలించింది. ఆరోగ్యం చక్కబడే వరకూ ఇమ్రాన్ ఖాన్‌ను ప్రైవేటు ఆసుపత్రిలోనే ఉంచి చికిత్స అందించాలని సుప్రీం కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు ఓ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్‌కు త్వరలో తన ఇంట్లో ఉండి చికిత్స తీసుకునే అవకాశం కూడా రావొచ్చని అక్కడి విశ్లేషకులు కామెంట్ చేశారు. రాజకీయాల్లోకి ఇమ్రాన్ రీఎంట్రీకి ఇది తొలి అడుగు అన్న కామెంట్స్ కూడా వినిపించాయి. ఇమ్రాన్ విడుదల వెనక ఏదో డీల్ జరిగే ఉంటుందని కొందరు అన్నారు. ఈ అంచనాలను తలకిందులు చేస్తూ ఇమ్రాన్ ఖాన్ మళ్లీ జైలుకెళ్లడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

# భారత్‌కు పతకం ఖరారు

## ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సెమీస్‌కు గాయత్రి-ట్రీసా జోడీ



బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత అమ్మాయిలు పతకం ఖరారు చేశారు. మహిళల డబుల్స్‌లో సంచలన ఆటతో దూసుకెళ్తున్న గాయత్రి గోపిచంద్, ట్రీసా జాలీ ద్వయం 15 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌కు షాకిచ్చిన ఈ ద్వయం.. ఈసారి 32వ రౌండ్‌లో నాలుగో సీడ్‌పై సంచలన విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టడం ద్వారా దేశానికి చరిత్రాత్మక పతకం అందించనుందీ జంట. పీవీ సింధు విఫలమైనా మేమున్నాం అని చాటుతూ.. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్, ట్రీసా జాలీ 15 ఏళ్ల కరువు తీర్చారు. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌ను ఇంటికి పంపిన ఈ జంట.. శుక్రవారం నాలుగో సీడ్ జియా యీ ఫాన్-ఝాంగ్ షు గ్జియాన్(చైనా)ను చిత్తు చేసింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను 16-21తో కోల్పోయినా ఒత్తిడికి లోనవ్వని భారత ద్వయం రెండో సెట్‌ను 21-15తో గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ చైనా జోడీకి చెక్ పెడుతూ 21-13తో మ్యాచ్‌ను ముగించింది గాయత్రి-ట్రీసా జంట. సెమీఫైనల్‌లో కూడా విజయం సాధిస్తే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళల డబుల్స్ జోడీగా గాయత్రి-ట్రీసా చరిత్ర సృష్టిస్తారు. కాగా అశ్విని పొన్నప్ప, గుత్తా జ్వాల అనంతరం.. మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం చేసిన రెండో జంటగా వీరు రికార్డు నెలకొల్పారు. 2011లో జ్వాల-అశ్విని జోడీ కాంస్యం సాధించింది.

## మెస్సి జెర్సీ... 56లక్షలు!




ఫుట్‌బాల్ దిగ్గజం, అర్జెంటీనా కెప్టెన్ లియోనల్ మెస్సి క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ప్రపంచవ్యాప్తంగా ఈ స్టార్ ఫుట్‌బాలర్‌కు కోట్లాది మంది అభిమానులున్నారు. మెస్సి ప్రపంచంలో ఎక్కడ మ్యాచ్ ఆడినా ఇసకేస్తే రాలనంత మంది జనాలు స్టేడియాలకు తరలివస్తారు. అతను ధరించే బ్రాండ్‌లు, అతనికి సంబంధించిన వస్తువుల రేంజ్ వేరే లెవెల్లో ఉంటుంది. తాజాగా మెస్సి ధరించిన జెర్సీని వేలానికి పెట్టగా భారీ ధరకు అది అమ్ముడైంది.

మాంచెస్టర్ యునైటెడ్ జట్టు మాజీ థెరపిస్ట్ రాడ్ థార్న్‌లే వద్ద భద్రపరిచిన ఫుట్‌బాల్ వస్తువులకు వేలంలో అద్భుతమైన స్పందన లభించింది. బార్సిలోనా తరపున ఆడిన కాలంలో లియోనెల్ మెస్సి ధరించిన ఒక జెర్సీ వేలంలో ఏకంగా 66,107 డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.56.4 లక్షలు) ధర పలికి అందరినీ ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో క్రిస్టియానో రొనాల్డో ధరించిన రియల్ మాడ్రిడ్ జెర్సీ కేవలం 10,601 డాలర్లు (సుమారు రూ. 9.05 లక్షలు) మాత్రమే పలికింది. ఈ వేలంతో ఫుట్‌బాల్ ప్రపంచంలో మెస్సి క్రేజ్ మరోసారి స్పష్టమైందని అతడి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెస్సి ధరించిన ఈ జెర్సీ వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. 2012లో బార్సిలోనా మాంచెస్టర్ మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. అయితే బార్సిలోనా జట్టు ఇంగ్లండ్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానానికి రాకముందు రాడ్ థార్న్‌లే బార్సిలోనా డిఫెండర్ గెరార్డ్ పిక్వెను వ్యక్తిగతంగా కలిసి మెస్సి జెర్సీని ఇవ్వమని కోరాడు. ఇక మ్యాచ్ ముగిసిన తర్వాత పిక్వె నేరుగా థార్న్‌లేను బార్సిలోనా జట్టు డ్రెస్సింగ్ రూమ్‌కు తీసుకెళ్లాడు. ఆ సమయంలో మెస్సి అదే జెర్సీ మీద ఉన్నాడు. కాసేపటి తర్వాత మెస్సి స్వయంగా ఆ జెర్సీని తీసి, సంతకం చేసి థార్న్‌లే బహుమతిగా ఇవ్వడంతో పాటు అతడితో కరచాలనం చేశాడు. ఈ అరుదైన జ్ఞాపకం తన జీవితంలో ఎప్పటికీ మరువలేనిదని థార్న్‌లే గుర్తుచేసుకున్నాడు. ఈ జెర్సీ కేవలం మెస్సీ ధరించిందనే కాకుండా, ఇద్దరు దిగ్గజ క్లబ్‌ల మధ్య మైత్రికి, ప్రపంచ స్థాయి ఆటగాడి జ్ఞాపకానికి ప్రతీకగా నిలవడం వలనే వేలంలో భారీ ధరకు అమ్ముడైందని థార్న్‌లే తెలిపాడు.

## ఫిఫా మహిళల ప్రపంచ కప్ 2027 షెడ్యూల్ విడుదల




జ్యూరిచ్: ఇటీవలే అమెరికా వేదికగా జరిగిన ఫిఫా పురుషుల ప్రపంచ కప్-2026 అభిమానులను ఎంతో అలరించింది. వివాదాలు, వినోదాలు, విచిత్ర ఘటనల మధ్య ఎంతో ఆసక్తిగా సాగిన ఈ టోర్నీలో స్పెయిన్ విజేతగా నిలిచింది. ఈ క్రమంలోనే ఫుట్‌బాల్ ప్రియులకు మరో క్రేజీ న్యూస్ బయటకు వచ్చింది. వచ్చే ఏడాది జరిగే ఫిఫా మహిళల ప్రపంచ కప్-2027 షెడ్యూల్ రిలీజ్ అయింది. బ్రెజిల్ వేదికగా జరిగే ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఫిఫా విడుదల చేసింది. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో ఉన్న ఫిఫా ప్రధాన కార్యాలయంలో ప్లే-ఆఫ్ టోర్నమెంట్ ప్రిలిమినరీ దశ డ్రా సందర్భంగా ఈ షెడ్యూలును ప్రకటించారు. దక్షిణ అమెరికా గడ్డపై తొలిసారిగా జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక మెగా టోర్నమెంట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. బ్రెజిల్‌లోని ఎనిమిది ప్రధాన నగరాల్లో మొత్తం 64 మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిస్తున్న బ్రెజిల్ జట్టు తన తొలి మ్యాచ్‌ను జూన్ 24న రియో డి జనీరోలోని ప్రఖ్యాత 'ఎస్టాడియో డో మరాకానా' స్టేడియంలో ఆడనుంది. జూలై 4న బ్రెసిలియాలోని చివరి గ్రూప్ మ్యాచ్‌ను బ్రెజిల్ ఆడుతుంది.

**నాకౌట్ మ్యాచ్‌ల వేదికల వివరాలు**

రౌండ్ ఆఫ్ 16: బ్రెసిలియా, పోర్టో అలెగ్రే, రెస్సిఫె, సాల్వడార్ నగరాలు రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తాయి.

క్వార్టర్ ఫైనల్స్: ఈ దశకు బెలో హోరిజోంటే, ఫోర్టలేజా నగరాలతో పాటు రియో డి జనీరో, సావొపాలో వేదికలు కానున్నాయి.

సెమీఫైనల్స్, ఫైనల్: సావొపాలలో ఒక సెమీఫైనల్, మూడో స్థానం కోసం పోటీపడే మ్యాచ్ జరుగుతాయి. మరో సెమీఫైనల్, జూలై 25న తుదిపోరు మరాకానా స్టేడియంలో జరుగుతాయి.

## భారత్-ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు!

భారత్ వేదికగా టీమిండియాతో జరగనున్న ఆఫ్ఘనిస్తాన్ టీ20 సిరీస్ షెడ్యూల్‌లో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. అంతకు ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా మూడు టీ20 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే దేశంలో పండుగల వాతావరణం ఉండటంతో తేదీల్లో మార్పులు చేయాలని అభిమానుల నుంచి విజ్ఞప్తులొచ్చాయి. మరోవైపు వినాయక చవితి రోజే మ్యాచ్ ఆడాలని ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు కూడా ప్రతిపాదించింది. సెప్టెంబరు 24 నుంచి ఆసియా క్రీడలు కూడా ప్రారంభం కానుండటంతో షెడ్యూల్‌లో మార్పులకు బీసీసీఐ సిద్ధమైనట్టు సమాచారం. సవరించిన తేదీల ప్రకారం తొలి టీ20 సెప్టెంబరు 11న, రెండో టీ20 సెప్టెంబరు 13న, మూడో టీ20 మ్యాచ్‌ను వినాయకచవితి పండగ రోజైన సెప్టెంబరు 14న నిర్వహించే అవకాశాలున్నాయి.

**సెప్టెంబరులో బంగ్లాదేశ్ పర్యటన లేనట్లే!**

మరోవైపు భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ పర్యటన దాదాపు రద్దయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మూడు వన్డేలు,మూడు టీ20 సిరీస్ కోసం భారత్‌ను పంపాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కోరింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 3 నుంచే వన్డే సిరీస్ ప్రారంభం కావాల్సి ఉండగా.. సమయం సమీపిస్తున్నా భారత బోర్డు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సెప్టెంబరులో భారత్‌తో ఆడే అవకాశాలు లేనట్లేనని బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాలు కూడా భావిస్తున్నాయి.

## మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్ నిర్దోషి


### 22 ఏళ్ల క్రితం నాటి కేసులో పాటియాలా కోర్టు తీర్పు




న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్, వడోదర నివాసి జాకబ్ మార్టిన్ ను 22 ఏళ్ల క్రితం నాటి కేసులో పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. 2004లో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఐపీసీలోని 420, 468, 471, 120బీతో పాటు పాస్‌పోర్ట్ చట్టంలోని 12 సెక్షన్ కింద అతనిపై కేసు బుక్ చేశారు. యూకే ఇమిగ్రేషన్ స్టాంప్ ఫోర్జరీ చేసినట్లు మార్టిన్ జాకబ్‌పై ఆరోపణలున్నాయి. అతడిపై నమోదైన ట్రావెల్, ఫైనాన్షియల్ ట్రాన్‌జాక్షన్స్ కేసుల్లోనూ ఎటువంటి ఆధారాలను కోర్టు ముందు చూపలేకపోయారు. అజ్వా స్పోర్ట్స్ క్లబ్ జాకబ్ మార్టిన్ ఆధీనంలో ఉన్నట్టు ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. సాక్షులు కూడా ఎటువంటి ఆధారాన్ని చూపలేకపోయినట్లు చెప్పారు. తప్పుడు కేసు వల్ల తాను మానసిక క్షోభకు గురైనట్టు మార్టిన్ తెలిపాడు. ఆ కేసు వల్ల తన రైల్వే జాబ్ కూడా పోయిందన్నారు. నిర్దోషిగా తేలడంతో చాలా రిలీఫ్ వచ్చిందని, ఇది తన జీవితంలో టర్నింగ్ పాయింట్ అవుతుందన్నాడు. 2004లో తనకు చెందిన ఓ టీమ్ యూకేకు వెళ్లిందని, ఇంగ్లండ్‌లో ఆడిన తర్వాత ఆ టీమ్ వెనక్కి వచ్చిందని, కానీ ఓ కుర్రాడు అక్కడే ఉండిపోయాడని, ఆర్నెళ్ల వీసా కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా అతను అక్కడే ఉన్నాడని, అక్కడ ఫేక్ స్టాంపింగ్ వేయించుకున్నాడని, కానీ ఇండియాకు వచ్చే సమయంలో అతన్ని డిపోర్ట్ చేశారని, ఈ కేసులో తనను ప్రశ్నించారని మార్టిన్ తెలిపాడు. ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేదని, కానీ అప్పుడు తాను అంతర్జాతీయ క్రికెట్ ఆడుతుండడం వల్ల తన పేరు పెద్దగా వినిపించిందన్నారు.

## అర్జున్ టెండూల్కర్ కీలక నిర్ణయం

### ఇకపై గోవా జట్టుకే ప్రాతినిధ్యం



దిగ్గజ క్రికెటర్ సచిన్ తనయుడిగా మనందరికీ సుపరిచితుడైన అర్జున్ టెండూల్కర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్‌లో అవకాశాలు రాక.. ఇటు టీమిండియాకు ఆడాలన్న కల కలగానే ఉండిపోగా... దేశవాళీలో మాత్రం ఒకే జట్టుకు ఆడాలని భావిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం గోవాకు మారిన అర్జున్.. ఇప్పట్లో తనకు జట్టు మారే ఉద్దేశం లేదంటున్నాడు. కెరీర్ పరంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న అర్జున్ టెండూల్కర్ దేశవాళీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నాడు. కొన్నాళ్లుగా గోవాకు ఆడుతున్న అతడు ఈ మధ్య ఆ జట్టు ఒమన్ పర్యటనకు దూరమయ్యాడు. దాంతో టెండూల్కర్ జట్టు మారుతున్నాడనే వార్తలొచ్చాయి. అయితే తాను మాత్రం గోవాకే కట్టుబడి ఉన్నానని చెప్తున్నాడీ పేసర్. 2022-23 సీజన్‌కు ముందు ముంబైను వీడి గోవాకు మారిన అతడు.. మరికొన్ని సీజన్లు జట్టు మారే ఆలోచన చేయట్లేదు. ఇప్పటిదాకా అర్జున్... గోవా తరపున 50 వికెట్లు తీశాడు.

చైతన్య రథం
సినిమా
శనివారం 22 ఆగస్టు 2026 

# ‘షావుకారు’ జానకి ఇక లేరు

## 70 ఏళ్ల సినీ ప్రస్థానం, 400కు పైగా సినిమాలు

## తెలుగు చలనచిత్ర రంగానికి తీరని లోటు



భారతీయ చలన చిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసిన అలనాటి ప్రముఖ సీనియర్ నటి ‘షావుకారు’ జానకి (94) తుదిశ్వాస విడిచారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్టు వైద్యులు వెల్లడించారు. జానకి మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

టేకుమళ్ల జానకి ఆంధ్రప్రదేశ్‌లోని 1931 డిసెంబరు 12న రాజమహేంద్రవరంలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ నటనా ప్రస్థానాన్ని ప్రారంభించారు. కేవలం 11ఏళ్ల వయసులోనే రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ చాటారు. 1949లో వచ్చిన ‘రక్షా రేఖ’ సినిమాతో చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టిన జానకి 1950లో విడుదలైన ‘షావుకారు’ సినిమాతో అద్భుత విజయాన్ని అందుకున్నారు. ఈ సినిమా భారీ హిట్ కావడంతో ఆమె పేరు ‘షావుకారు జానకి’గా మారిపోయింది. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 400 చిత్రాల్లో, 3 హిందీ, ఒక మలయాళ చిత్రంలో నటించి ప్రేక్షకుల మెప్పు పొందారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం 2022లో ఆమెను ప్రతిష్టాత్మక ‘పద్మశ్రీ’ పురస్కారంతో సత్కరించింది.

### ఎవర్ గ్రీన్ సూపర్‌హిట్ చిత్రాలు:

వద్దంటే డబ్బు, కన్యాశుల్కం, పిచ్చి పుల్లయ్య, రేచుక్క-పగటిచుక్క, రోజులు మారాయి, సొంతవూరు, జయం మనదే, పాండురంగ మహత్యం, డాక్టర్ చక్రవర్తి, తాయారమ్మ బంగారయ్య, సంసారం ఒక చదరంగం, తోడికోడళ్ళు, బాబు బంగారం, గీతాంజలి వంటి ఎన్నో సూపర్‌హిట్ చిత్రాల్లో ఆమె నటించారు. కాగా చివరిసారిగా ‘అన్నీ మంచి శకునములే’ చిత్రంలో తెరపై కనిపించి అలరించారు. 1955లో 11 సినిమాల్లో నటించిన షావుకారు జానకి.. ‘ఏది నిజం’ సినిమాకు జాతీయ అవార్డు అందుకున్నారు. చివరగా 2023లో వచ్చిన ‘అన్నీ మంచి శకునములే’ సినిమాలో కనిపించారు. షావుకారు జానకి సొంత చెల్లెలు కృష్ణకుమారి హీరోయిన్‌గా తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

## మహానటి జానకి జీవితంలోని కొన్ని అరుదైన, ఆసక్తికరమైన విషయాలు



### గాంధీజీ సేవలో...

దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో మహాత్మా గాంధీ హిందీ ప్రచార సభకు వచ్చారు. ఆయన భోజనం, వసతి సౌకర్యాలు చూసుకునేందుకు జానకిని పంపారు. దీంతో జవహర్‌లాల్ నెహ్రూ, బాబూ రాజేంద్రప్రసాద్, ఇందిరాగాంధీ వంటి ఎందరో గొప్ప వ్యక్తులను నేరుగా కలిసే అవకాశం జానకికి దక్కింది. ఇది తాను చేసుకున్న అదృష్టమని ఎన్నో సందర్భాల్లో ఆమె తెలిపారు.

### పిల్లల కోసం సినిమాల్లోకి...

జానకికి 15 ఏళ్ల వయసులోనే సినిమా అవకాశాలు వచ్చాయి. కానీ ఇంట్లో అంగీకరించకపోవడంతో ఆమె వాటిని వదులుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత రేడియో ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుందరమూర్తి శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. అక్కడే ఆమె జీవితంలో రెండో అధ్యాయం మొదలైంది. ఆస్తి పంపకాలతో జరిగిన అన్యాయం వల్ల వీరికి డబ్బులు రాలేదు. దీంతో పసిపిల్లల పోషణ కోసం కష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురైంది. కొన్ని రోజులకు సంసారం గడవడం కూడా కష్టమైంది. ఎన్ని కష్టాలు వచ్చినా పుట్టింటికి వెళ్లకూడదని అనుకున్నారు. తనకు తెలిసిన విద్య నటనే కాబట్టి భర్త అనుమతితో సినిమాల్లోకి వచ్చారు. కానీ సినిమాల్లోకి వచ్చిన కొన్ని రోజులకే భర్తతో విభేదాలు రావడంతో పిల్లలను తానొక్కతే పెంచి పెద్దచేశారు.

### బంధువులు ముఖం మీదే చెప్పేశారు..

సినిమాల్లోకి వచ్చాక బంధువులు తనను ఇంట్లోకి రానివ్వలేదని జానకి ఓ సందర్భంలో చెప్పారు. “సినిమాల్లో వేషాలు వేయడానికి వెళ్లడం.. హీరోలతో రాసలీలల సన్నివేశాలు చేయడం, నైట్‌లైట్ సెట్స్‌లో డ్యాన్స్ చేయడం.. ఇవన్నీ మా వాళ్లకు నచ్చలేదు. ఒకరోజు చుట్టాల ఇంటికి వెళ్లి నిద్రపోదామని వెళ్తే.. ‘పద్మమ్మో! అందరూ ఏమైనా అంటారు.. రావద్దు’ అని ముఖం మీదే చెప్పేశారు” అని చెప్తూ ఆమె బాధపడ్డారు.

### బాధపడిన సందర్భాలెన్నో..

90 ఏళ్లు వచ్చినా నటిస్తూ ఉండాలనేది షావుకారు జానకి కోరిక. అలా జరగనందుకు బాధపడేవారు. ఆమె తమిళంలో నటించిన చిత్రాలు హిట్ అయితే వాటిని తెలుగులోనూ తీసేవారు. ఇక్కడ మాత్రం తనను హీరోయిన్‌గా తీసుకునేవారు కాదు. అప్పుడు మనసు చిన్నబోయేదని ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. “నేను ఎప్పుడూ ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. ప్రొడ్యూసర్ డబ్బులతో జల్సా చేయలేదు. సినిమాకు ఏది అవసరమో అదే చేసేదాన్ని. చాలా దెబ్బలు తిన్నా, ఎన్నోసార్లు నిరాశ చెందా. మా కుటుంబంలో నాకంటే చిన్నవాళ్లు కూడా ముందే చనిపోయారు. ఆ సమయంలో మాత్రం చాలా బాధపడేదాన్ని” అని చెప్పారు.

### శ్రీదేవిని ఇండస్ట్రీకి పరిచయం చేసి...

ప్రముఖ నటి శ్రీదేవిని ఇండస్ట్రీకి పరిచయంచేసింది జానకినే. “అప్పటికి ఆమె ఆరేళ్ల పిల్ల. వాహినీ స్టూడియోస్ వాళ్లు ఒక పెద్ద సినిమా తీస్తున్నారు. అప్పుడే రాజేశ్వరి (శ్రీదేవి అమ్మ) పాపను పట్టుకుని దూరంగా నిలబడి చూస్తున్నారు. అదే సమయంలో దర్శకుడు మాట్లాడుతూ.. ‘బాల మురుగన్ పాత్రకు చిన్నపిల్ల కావాలి. అందంగా ఉండాలి.. బ్రిలియంట్‌గా ఉండాలి’ అని చెప్తున్నారు. నేను శ్రీదేవిని తీసుకుందామని చెప్పా. శ్రీదేవి అమ్మగారితో చెప్తే సరేనన్నారు. మేకప్ చేసి మేకప్ రూమ్ నుంచి బయటకు తెస్తే అందరూ ఆశ్చర్య పోయారు. బాల మురుగన్ పాత్రకు శ్రీదేవి చక్కగా సరిపోయింది. చిన్న చిన్న డైలాగులు చెప్పమంటే ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ చెప్పడం చూసి మరో ఆలోచన లేకుండా ఓకే చేశారు” అని జానకి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.



# బాక్సాఫీస్ వద్ద ‘డీసీ’ జోరు

## రూ.100 కోట్ల క్లబ్‌లోకి లోకేష్ కనగరాజ్ సినిమా



టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన ‘డీసీ’ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్రచటోపాధ్యాయ క్లాసిక్ నవల ‘దేవదాస్’ స్ఫూర్తితో అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్, కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా... చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

# ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్... చిరంజీవి మెగాస్టార్




‘విరూపాక్ష’ ఫేమ్ డైరెక్టర్ కార్తీక్ దండు సోదరుడు వివేక్ దండు హీరోగా పరిచయమవుతున్న సినిమా “పనసపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్”. ఈ చిత్రాన్ని క్యాండిడ్ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 1గా ప్రొడ్యూసర్ వివేకానంద్ వర్మ నిర్మిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ పీరియాడిక్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు సీహెచ్ రవికిషోర్ రూపొందిస్తున్నారు. ఇటీవలే రిలీజ్ చేసిన ఈ సినిమా మోషన్ పోస్టర్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. శనివారం మెగాస్టార్ చిరంజీవి బర్త్‌డే సందర్భంగా ఆయనకు ట్రిబ్యూట్‌గా “పనసపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్” మేకర్స్ తమ సినిమా ఫస్ట్ సింగిల్ ‘మెగా సాంగ్’ రిలీజ్ చేశారు. మెగాస్టార్ చిరంజీవి సినిమా రిలీజ్ రోజున ఆయన అభిమాని అయిన పనసపల్లి రాజు, ఆయన మిత్రులు థియేటర్స్ దగ్గర చేసే సందడి నేపథ్యంగా ‘మెగా సాంగ్’ను రూపొందించారు. ‘ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్ చిరంజీవి మెగాస్టార్, ఆడెవడన్నా ఈడెవడన్నా మెగాస్టార్‌కు అడ్డెవడన్నా, ఒకటి రెండు మూడు, మా బాస్ ముందు ఎవడు.. పనసపల్లి రాజు గాని అడ్డరా, చిరంజీవి తెలుగు ముద్దు బిడ్డరా, బాసుకు దండేసి బొట్టు పెట్టరా, దుమ్ములేసి పోద్ది చూడు జాతరా..’ వంటి మెగా ఫ్యాన్స్ చెప్పే స్లోగన్స్‌నే లిరిక్స్ గా ‘మెగా సాంగ్’ డిజైన్ చేయడం విశేషం. ఈ పాటను మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎల్ రాజా మాంచి మాస్ బీట్‌తో కంపోజ్ చేశారు. మెగా కామ్రేడ్స్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పనసపల్లి రాజు పాత్రలో హీరో వివేక్ దండు మాస్ స్టెప్స్‌తో ఆకట్టుకున్నారు.

# ‘ఇరుముడి’కి బ్రహ్మరథం

## థియేటర్లతో రవితేజ అభిమానుల సందడి

మాస్ మహారాజా రవితేజ కథా నాయకుడిగా తెరకెక్కిన చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రీమియర్ షోలు చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. తండ్రి-కూతురు మధ్య బంధాన్ని డైరెక్టర్ శివ నిర్వాణ చాలా ఎమోషనల్‌గా చూపించారని ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా ఇంట్లో ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులను ఈ సినిమా ఆలోచింపజేస్తుందని పలువురు కామెంట్స్ చేస్తున్నారు. కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ కోసం కాకుండా ఒక సామాజిక అంశాన్ని కూడా సినిమాలో టచ్ చేశారని చెప్తున్నారు. ఫస్టాఫ్ చాలా బాగా ఉందని, సెకండాఫ్‌లో కొన్ని ఎమోషనల్ సన్నివేశాలు కంటతడి పెట్టించాయంటున్నారు. ముఖ్యంగా కుటుంబ సంబంధాలకు సంబంధించిన సన్నివేశాలు బాగా కనెక్ట్ అయ్యాయని చెప్తున్నారు. మల్లెపూల పల్లకి సాంగ్‌కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఆ పాట వచ్చిన సమయంలో ప్రేక్షకులు థియేటర్‌లో స్క్రీన్‌కి హారతులు ఇచ్చారు. కొందరు డ్యాన్స్‌లు చేస్తూ నానా హంగామా చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

